మనం
జనం కోసం.. అక్షర యజ్ఞం..

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | AMARAVATHI | TIRUPATI | KURNOOL | TADEPALLIGUDEM | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA

హైదరాబాద్ సంపుటి: 2 • సంచిక: 111 • పేజీలు:12+16 • వెల: రూ.5 శుక్రవారం • 23-3-2018 www.manamnews.com /manamnews



తప్పు జరిగింది.. క్షమించండి

- 2 కోట్ల మంది నమ్మకాన్ని కోల్పోయాం
- డేటా చౌర్యంపై జుకర్‌బర్గ్
- ఇటువంటివి మళ్లీ జరగవు
- ప్రజాభిప్రాయం ప్రభావితం కానివ్వం
- భారత్.. బ్రెజిల్ ఎన్నికలపై అప్రమత్తం
- ఏఐతో నకిలీ ఖాతాలు.. ఫేక్ వార్తలకు కళ్లెం: మార్క్

7లో..



'అమ్మ' ఉన్నప్పుడు సీసీ నిఘా లేదు

- జయ మరణం వరకు ఆస్పత్రిలో కెమెరాలు ఆపేశారు
- కమిషన్‌కు పూర్తి సమాచారం
- అపోలో చైర్మన్ ప్రతాప్‌రెడ్డి

7లో..

గౌడన్నలకు వరాల జల్లు!

రాష్ట్రంలోని తాటి.. ఈత చెట్లపై పన్ను రద్దు

గౌడ భవనానికి ఐదెకరాలు.. 5 కోట్ల వితరణ

- గీత కార్మికులపై కరుణ కురిపించిన సీఎం కేసీఆర్
- గ్రామీణం బలోపేతానికి బహుముఖ ప్రణాళిక
- సమైక్య పాలనలో గీత కార్మికులకు అన్యాయం

హైదరాబాద్, మార్చి 22 (మనం ప్రతినిధి):

రాష్ట్రంలోని గౌడ కులస్థులపై ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు వరాల జల్లు కురిపించారు. కుల వృత్తులకు టీఆర్ఎస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నదని గురువారం శాసనసభ లో ఆయన స్పష్టం చేశారు. అలాగే తెలంగాణ లో గ్రామీణ ఆర్థిక వ్యవస్థను అభివృద్ధి చేసేందుకు బహుముఖ ప్రణాళికలను రూపొంది స్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా తా టి, ఈత చెట్లపై పన్నును పూర్తిస్థాయిలో రద్దు మిగతా 6లో..



ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న గీత కార్మికులు



రాజీనామా లేఖపై సంతకం చేస్తున్న నాగం

బీజేపీకి నాగం గుడ్‌బై

అవినీతిపై నా పోరుకు పార్టీ సహకారం లేదు

క్రియాశీలంగా ఉన్నప్పటికీ ప్రాధాన్యం ఏదీ?

అందుకే వైదొలగాలన్న నిర్ణయమని ప్రకటన

నాగర్‌కర్నూల్, మార్చి 22 (మనం న్యూస్):

మాజీ మంత్రి నాగం జనార్దన్ రెడ్డి భారతీయ జనతా పార్టీకి గుడ్‌బై చెప్పారు. పార్టీలో ఎంతో క్రియాశీలమైనప్పటికీ తనకు తగిన ప్రాధాన్యం లభించడం లేదని కొన్నాళ్లుగా ఆయన కినుక ప్రదర్శిస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో గురువారం నాగర్ కర్నూలులో తన అనుయాయులతో సుదీర్ఘంగా చర్చించిన అనంతరం బీజేపీకి రాజీనామా చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ మేరకు తన నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ ప్రకటించారు. తెలంగాణ ఆవిర్భావానికి ముందు 2013లో బీజేపీలో చేరారని ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఆనాటి నుంచీ పార్టీలో భాగస్వామినై పనిచేస్తున్నా తనకు సముచిత గుర్తింపు దక్కలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో టీఆర్ఎస్ ప్రభుత్వ అవినీతిపై తన పోరాటానికి బీజేపీ నాయకులు ఎంతమాత్రం సహకరించడం లేదని పేర్కొన్నారు. రాష్ట్ర రాజకీయాల్లో, ప్రజల్లో తనకంటూ ఒక స్థానం మిగతా 6లో..

ఇదీలోకం!



పార్లమెంటులో ఎంపీ శివప్రసాద్ రోజుకో గెటప్ తప్ప.. మిగతాదంతా సేమ్ రిపీట్ గురూ..!



ఉస్మానియాలో టెక్నోకల్చరల్ ఫెస్ట్

సాంకేతిక ఉత్సవానికి భాగ్య నగరం వేదికైంది. యువ ఇంజినీర్ల ప్రతిభను వెలికితీసి.. పరిశోధనల వైపు పరుగులెత్తించే పండుగ ధూంధాంగా మొదలైంది. ఉస్మానియా విశ్వ విద్యాలయంలో గురువారం జాతీయ టెక్నో కల్చరల్ ఫెస్ట్, టెక్నో ఉస్మానియా-2కే18 'మనం' దినపత్రిక ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభమైంది. యువ టెక్నోలకు పదునుపెట్టేలా మూడు రోజులు ఈ ఫెస్ట్ సాగనుంది.

5లో..

కాళేశ్వరం పరిధిలోకి ఎగువ మానేరు

- 38 కోట్లతో నర్మాల కాలువల పనులు
- ప్రాజెక్టు పనులకు నిధుల సమస్య లేదు
- కాళేశ్వరాన్ని యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలి
- దసరా నాటికి ప్యాకేజీ 9 పూర్తి కావాలి
- పనులతీరుపై ఇక ప్రతి వారం సమీక్ష
- పనుల నత్తనడకపై తీవ్ర అసంతృప్తి
- అధికారులతో మంత్రులు హరీశ్.. కేటీఆర్



హైదరాబాద్,మార్చి 22 (మనం ప్రతినిధి):

సిరిసిల్ల జిల్లాలోని ఎగువ మానేరు ప్రాజెక్టును కాళేశ్వరం పరిధిలోకి తీసుకురావాలని గురువారం జరిగిన ఉన్నతస్థాయి సమీక్షా సమావేశంలో నిర్ణయించారు. కాళేశ్వరం మిగతా 6లో..

ముహూర్తం

శ్రీవిళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, శుక్లపక్షం, తిథి: షష్ఠి మ.12.03 తదుపరి సప్తమి; నక్షత్రం: రోహిణి సా.4.55 తదుపరి మృగశిర; వర్జ్యం: ఉ.9.18-10.50, రా.10.14-11.45; దుర్ముహూర్తం: ఉ.8.46-9.34; రాహుకాలం: ఉ.10.53-12.23; అమృతఘడియలు: మ.1.54-3.26; శుభసమయం: సా.5.00-6.00.

సూర్యోదయం: 6.22

సూర్యాస్తమయం: 6.24

వాతావరణం

తెలుగు రాష్ట్రాల్లో శుక్రవారం భానుడి ప్రతాపం కొనసాగుతుంది. పగటి, రాత్రి ఉష్ణోగ్రతలలో మార్పులేదు. గాలిలో తేమ శాతం పెరుగుతుంది. రాత్రిపూట గంటకు 14 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయి.

గరిష్ఠ ఉష్ణోగ్రత: 38 డిగ్రీలు

కనిష్ఠ ఉష్ణోగ్రత: 22 డిగ్రీలు

గాలిలో తేమ: 39 శాతం

రాష్ట్రంలో సమగ్ర సాగునీటి విధానం

జేఏసీ చైర్మన్ కోదండరాం డిమాండ్

రైతు.. ప్రజా సంఘాలతో భేటీ.. ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని నిర్ణయం

హైదరాబాద్, మార్చి 22 (మనం ప్రతినిధి):



జిల్లాల సాగునీటి అవసరాలు తీర్చడానికి ప్రభుత్వం సమగ్ర సాగునీటి విధానం తీసుకురావాలని తెలంగాణ జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ కోదండరాం డిమాండ్ చేశారు. ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా గురువారం మఖ్దూంభవన్‌లో వివిధ రైతు, ప్రజా సంఘాలతో కోదండరాం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకొచ్చే కొత్త ప్రాజెక్టులు ప్రజలకంటే కాంట్రాక్టర్లకే ఎక్కువ మేలు చేస్తున్నాయన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం ప్రారంభించిన ఏ ఒక్క ప్రాజెక్టు కూడా పూర్తికాలేదని ఎద్దేవా చేశారు. ప్రభుత్వం ఇష్టారాజ్యంగా ప్రాజెక్టులను నిర్మిస్తూ ప్రజాధనాన్ని దుర్వినియోగంచేస్తోందని, దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణను కోటి ఎకరాల మాగాణిగా చేస్తామని చెప్పడంలో వాస్తవంలేదని విమర్శించారు. సమగ్ర మిగతా 6లో..



లక్ష్మీ నారాయణ స్వచ్ఛంద విరమణ

- ఏడీజీ పదవికి రాజీనామా
- మహారాష్ట్ర డీజీపీకి లేఖ

హైదరాబాద్, మార్చి 22:

సీబీఐ పూర్వ జేడీ లక్ష్మీనారాయణ స్వచ్ఛంద పదవీ విరమణ (వీఆర్ఎస్)కు దరఖాస్తు చేసుకున్నారు. ప్రస్తుతం మహారాష్ట్ర అదనపు డీజీగా ఉన్న ఆయన తన రాజీనామా లేఖను ఆ రాష్ట్ర డీజీపీకి పంపారు. తన దరఖాస్తును అనుమతించి, స్వచ్ఛంద పదవీ విరమణను ఆమోదించాలని మిగతా 6లో..

రాజ్యసభ ఓటింగ్‌కు బీజేపీ దూరం

కాంగ్రెస్, టీఆర్ఎస్‌కు మద్దతివ్వం

కేంద్ర నాయకత్వ సూచన మేరకు నిర్ణయం: లక్ష్మణ్

హైదరాబాద్, మార్చి 22 (మనం ప్రతినిధి):



కేంద్ర నాయకత్వ సూచన మేరకు రాజ్యసభ ఎన్నికల్లో బీజేపీ శాసనసభ్యులు టీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు సమాన దూరంగా ఉండాలని, ఓటింగ్ పాల్గొనకూడదని నిర్ణయించారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మణ్ తెలిపారు. రాజ్యసభ ఎన్నికల్లో పాల్గొనే విషయమై బీజేపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఇటీవలే సమావేశమయ్యారు. ఓటింగ్‌లో పాల్గొంటే ఎవరికి వేయాలని అందులో చర్చించారు. మద్దతు కావాలని ఏ పార్టీ కోరలేదని, కాంగ్రెస్ అభ్యర్థికి మాత్రం మద్దతు ఇవ్వబోమని, తమ ప్రధాన ప్రత్యర్థి కాంగ్రెసేనని బీజేపీ ఎమ్మెల్యే ఒకరు ఇటీవలే తెలిపారు. దాంతో టీఆర్ఎస్ అభ్యర్థికి ఓటు వేస్తారని అంతా భావించారు. రాష్ట్రపతి ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులకు టీఆర్ఎస్ మద్దతు కూడా ఇచ్చింది కాబట్టి టీఆర్ఎస్‌కే మద్ధతు ప్రకటిస్తారని రాజకీయ వర్గాలు భావించాయి. బీజేపీలోనూ ఈ విషయం చర్చకు వచ్చినట్లు తెలుస్తోంది. కానీ కేంద్ర పార్టీ నిర్ణయంతో బీజేపీ ఓటింగ్‌కు దూరంగా ఉంటుంది.

సింగరేణిలో కాంట్రాక్ట్ వ్యవస్థ వద్దు

- ముఖ్యమంత్రి కేసీఆర్‌కు తమ్మినేని వీరభద్రం లేఖ

హైదరాబాద్, మార్చి 22(మనం ప్రతినిధి): సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను శాశ్వత ఉద్యోగులుగా చేయాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం కోరారు. ఈ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ గురువారం ఆయన ఓ లేఖ రాశారు. సింగరేణిలోని వివిధ విభాగాల్లో దాదాపు 20వేల మంది కాంట్రాక్ట్ కార్మికులు పనిచేస్తున్నారని వీరభద్రం పేర్కొన్నారు. వీరంతా సింగరేణి అభివృద్ధిలో ప్రత్యక్ష భాగస్వాములని, రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా వీరికి వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ వ్యవస్థను పూర్తిగా రద్దు చేయాలన్నారు. కార్మికులు కోరుతున్నట్టు 2013 జనవరి నుంచి అమలు కావాల్సిన కోలిండియా వేతనాలు అమలు చేయాలని లేదంటే రాష్ట్ర ప్రభుత్వ ఔట్‌సోర్సింగ్ జీ.ఓ 14 ప్రకారం వేతనాలు చెల్లించాలని కోరారు. జెన్కోలో చెల్లిస్తున్న విధంగా ఎన్టీపీసీలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు చెల్లించాలని పేర్కొన్నారు. వేతనంతో కూడిన పండగ సెలవులు, గ్రాట్యుటీ, తదితర చట్టబద్ధ సౌకర్యాలు అమలు చేయాలని, సంస్థ ఆస్పత్రుల్లో ఉచిత వైద్య సేవలు కల్పించాలని తమ్మినేని డిమాండ్ చేశారు. ఓబీ, ఎన్టీపీసీ, తదితర విభాగాల్లో స్థానికులు, నిర్వాసితులకు ఉపాధి కల్పించాలని తమ్మినేని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు.

హైదరాబాద్ భిన్న సంస్కృతులకు నిలయం

వ్యవసాయం, పరిశ్రమలకు అధిక ప్రాధాన్యం.. ఎసీడీసీ బృందంతో సీఎస్ జోషి

హైదరాబాద్, మార్చి 22(మనం ప్రతినిధి): తెలంగాణలో వ్యవసాయం, నీటి పారుదల, పారిశ్రామిక రంగాలకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని రాష్ట్ర ప్రభుత్వం ప్రధాన కార్యదర్శి ఎస్‌కే. జోషి తెలిపారు. ఎకానమిక్ సెక్యూరిటీ స్టడీ టూర్‌లో భాగంగా మేజర్ జనరల్ హర్ కిరత్ సింగ్ నేతృత్వంలో నేషనల్ డిఫెన్స్ కాలేజీ సభ్యులు గురువారం సచివాలయంలో సీఎస్‌ను కలిశారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ హైదరాబాద్ నగరం భిన్న సంస్కృతులకు నిలయమని, ప్రజల మెరుగైన జీవనానికి అనువైన నగరంగా రూపుదిద్దుకున్నదని తెలిపారు. నీటి పారుదల రంగానికి బడ్జెట్‌లో 25 వేల కోట్లు కేటాయించామని, కోటి ఎకరాలకు సాగు నీరందించేందుకు ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టామని, మిషన్ కాకతీయ ద్వారా 45 వేల చెరువుల మరమ్మతులు చేపట్టి చిన్ననీటి వనరులను పునరుద్ధరించి గ్రామాల్లో నీటి భద్రతను కల్పించనున్నట్టు వారికి తెలిపారు. హైదరాబాద్ నగరం నాలుగు వైపుల విస్తరిస్తున్నదని పారిశ్రామికంగా అనేక మంది పరిశ్రమల స్థాపనకు ముందుకు వస్తున్నారని వివరించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పుడు 7600 మెగా వాట్ల సామర్థ్యం ఉంటే ప్రస్తుతం14 వేల మెగా వాట్లకు చేరుకున్నదని, 24 గంటల విద్యుత్‌ను అందిస్తున్నామని, పవర్ హాలిడేలు లేవని తెలిపారు. ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్మాణం సందర్భంగా ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీకి అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ కోసం హరితహారం కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్టు తెలిపారు. ఎన్‌డీసీ బృందం హైదరాబాద్‌కు రావడం హర్షణీయమన్నారు. ఎన్‌డీసీ బృందం రెండురోజుల పర్యటనలో భాగంగా ఎన్ఎఫ్‌సీ, ఐఎస్‌బీ, మైక్రోసాఫ్ట్, టాటా, బోయింగ్ జేవీ సంస్థలను సందర్శించనుంది.


ఎసీడీసీ బృందంతో మాట్లాడుతున్న సీఎస్ ఎస్‌కే జోషి

హైకోర్టుకు 'గ్రూప్-2' జాబితా



హైదరాబాద్, మార్చి 22 (మనం లీగల్ ప్రతినిధి): రాష్ట్రంలో నిర్వహించిన గ్రూప్-2 పరీక్షల్లో టాప్‌లోని తొలి అయిదు వేల మంది అభ్యర్థుల ఓఎంఆర్ షీట్లను న్యాయవాదుల కమిటీ పరిశీలన పూర్తి అయింది. సీనియర్ లాయర్ల కమిటీ పరిశీలన అనంతరం నివేదికను హైకోర్టుకు అందజేశారు. గ్రూప్-2 నోటిఫికేషన్‌లో వైటనర్ వినియోగించరాదని, కొట్టివేతలు ఉండరాదని, బబ్లింగ్‌లో తప్పు చేసిన, వివరాల నమోదులో తప్పు చేసిన వారిని కూడా అర్హులుగా ప్రకటించారంటూ హైదరాబాద్‌కు చెందిన రామచంద్రారెడ్డి, పలువురు అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై గ్రూప్2 పరీక్షల్లో టాప్‌లో నిలిచిన మొదటి అయిదు వేల మంది అభ్యర్థుల ఓఎంఆర్ షీట్లను పరిశీలించే నిమిత్తం హైకోర్టు న్యాయమూర్తి నవీన్‌రావు సీనియర్ లాయర్ల కమిటీని గతంలో ఏర్పాటు చేసిన విషయం విదితమే. సీనియర్ లాయర్లు ఎస్.నిరంజన్‌రెడ్డి, శ్రీరఘురాం, రఘునందన్‌రావులతో ఏర్పాటైన కమిటీ గురువారం హైకోర్టుకు నివేదికను సీల్డు కవర్‌లో అందజేసింది. పిటిషనర్ల వ్యాజ్యాల తర్వాత ఫలితాల్ని నిలిపివేయవద్దని, వైట్‌నర్ వాడినవారు తక్కువ మందే ఉన్నారని, వారికోసం మొత్తం ఫలితాల్ని ఆపరాదంటూ కూడా వ్యాజ్యాలు దాఖలయ్యాయి. సీనియర్ లాయర్ల నివేదికపై హైకోర్టు న్యాయమూర్తి నవీన్‌రావు శుక్రవారం విచారించే అవకాశముంది.

రథయాత్రకు అనుమతివ్వలేం

- వీహెచ్‌పీ అభ్యర్థనకు హైకోర్టు తిరస్కృతి

హైదరాబాద్, మార్చి 22(మనం లీగల్ ప్రతినిధి): ఉగాది నుంచి హనుమాన్ జయంతి వరకు తలపెట్టిన శ్రీరామ రథయాత్రకు అనుమతివ్వాలంటూ వీహెచ్‌పీ దాఖలు చేసిన వ్యాజ్యాన్ని హైకోర్టు కొట్టివేసింది. రథయాత్రకు తెలంగాణ ప్రభుత్వం అనుమతివ్వకపోవడాన్ని సవాల్ చేస్తూ దాఖలుచేసిన కేసులో బుధవారంతో వాదనలు ముగిశాయి. ఈ క్రమంలో రథయాత్రకు పోలీసుల రక్షణ అవసరం ఉందని పేర్కొంటూ న్యాయస్థానం వీహెచ్‌పీ అభ్యర్థనను తోసిపుచ్చింది. గురువారం హైకోర్టు న్యాయమూర్తి ఎం.సత్యనారాయణమూర్తి తీర్పు చెప్పారు. ఈ నెల 18న ఉగాదిని పురస్కరించుకుని 31న హనుమాన్ జయంతి వరకూ బాసర నుంచి హైదరాబాద్‌లోని తాడ్‌బండ్ హనుమాన్ ఆలయం శ్రీరామ రథయాత్రను నిర్వహించాలని వీహెచ్‌పీ తలపెట్టింది. ఈ యాత్రకు ఎలాంటి షరతులు విధించినా తమకు అభ్యంతరంలేదని వీహెచ్‌పీ తెలంగాణ కార్యదర్శి ఎం.గాల్‌రెడ్డి కోర్టుకు విన్నవించారు. పోలీసులకూ ఇదే విషయాన్ని తెలియజేసినా వారు కావాలనే అనుమతివ్వడం లేదని ఆరోపించారు. రథయాత్ర శాంతియుతంగా నిర్వహిస్తామని, అందుకు ఏమైనా షరతులు విధించినా తమకు అభ్యంతరం లేదనే వాదనను హైకోర్టు తోసిపుచ్చింది. పిల్లలకు పరీక్షలు జరుగుతున్నందున అనుమతివ్వలేమని, రథయాత్ర జరిగే అన్ని చోట్లా పోలీసుల రక్షణ ఏర్పాట్లుచేయడం కష్టమని, వీహెచ్‌పీ పిటిషన్‌ను కోర్టు డిస్మిస్ చేసింది.

ఆర్ఎంపీలు ప్రాథమిక సేవలకే పరిమితం

- నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు: లక్ష్మారెడ్డి

హైదరాబాద్, మార్చి 22(మనం ప్రతినిధి): ప్రాథమిక, అత్యవసర సేవలకే గ్రామీణ/ప్రైవేట్ వైద్యులు పరిమితమని, వాళ్లని కమ్యూనల్ పారా మెడిక్‌గా గుర్తించామని వైద్య శాఖ మంత్రి లక్ష్మారెడ్డి తెలిపారు. నిబంధనలు పాటించని గ్రామీణ వైద్యులు, ఆస్పత్రులపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని, ఇప్పటికే పలువురిపై తెలంగాణ మెడికల్ కౌన్సిల్ చర్యలు తీసుకుంటున్నదన్నారు. నకిలీ వైద్యులు, డాక్టర్ల మెడికల్ ప్రాక్టీస్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు జాతీయ గుర్తింపు అంశాలపై ఎం.ఎస్ ప్రభాకర్‌రావు, పాతూరి సుధాకర్‌రెడ్డి, మాదిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, పురాణం సతీష్, పూల రవీందర్, రాములు నాయక్, గంగాధర్‌గౌడ్, కర్నె ప్రభాకర్ వివరణ కోరగా మంత్రి సమాధానమిస్తూ... ఆర్ఎంపీలు, పీఎంపీలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ చట్టాలు కేవలం కమ్యూనిటీ పారా మెడిక్‌గా గుర్తించి ప్రాథమిక చికిత్స అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే అందించడానికి అనుమతించామన్నారు. తెలంగాణ మెడికల్ ప్రాక్టీషనర్ చట్టంలోని సెక్షన్ 8(9), 8(10) ప్రకారం సరైన అర్హతలు లేకుండా మెడికల్ ప్రాక్టీస్ చేస్తున్న వారిపై, ఆస్పత్రులపై కేసు పెట్టడానికి మెడికల్ కౌన్సిల్‌కు అధికారం ఉందన్నారు. తెలంగాణ మెడికల్ కౌన్సిల్ ఏర్పాటు చేసిన తర్వాత నిబంధన అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. ప్రజారోగ్య వసతులు పెంచడం, వాటిని ప్రజలకు అందుబాటులోకి తేవడం, అవన్నీ నిర్ణీత నాణ్యత ప్రమాణాలతో ఉంటేనే భారత ప్రభుత్వ ఆరోగ్య మంత్రిత్వ శాఖ, ఎన్‌హెచ్‌ఆర్‌సీ సంయుక్తంగా నాణ్యత ప్రమాణాల గుర్తింపుని ఇస్తుంటారని తెలిపారు. భారత ప్రభుత్వం గుర్తించిన ప్రజారోగ్య సంస్థలు సగటుగా 70 శాతానికి పైగా స్కోర్ సాధించాల్సి ఉంటుందన్నారు.

ఆర్టీసీ బాధ్యత ప్రభుత్వానిదే: కోదండ

హైదరాబాద్, మార్చి 22(మనం ప్రతినిధి): ఆర్టీసీని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని టీ జేఏసీ చైర్మన్ కోదండరాం అన్నారు. హైదరాబాద్‌లోని ఐఎన్‌టీయూసీ భవన్‌లో ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్(ఈయూ) చేపట్టిన నాలుగోరోజు ధర్నాలో కోదండరాం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికులను వెంటనే వేతన సవరణ చేపట్టాలని, సకల జనుల సమ్మె కాలానికి వేతనంతో కూడిన సెలవును మంజూరు చేయాలని అన్నారు. డీజిల్‌ను జీఎస్టీ పరిధిలోకి తీసుకువచ్చి టీఎస్‌ఆర్టీసీని ఆదుకోవాలన్నారు. ఆర్టీసీ కార్మిక సంఘాలన్నింటినీ కలుపుకుని ఆర్టీసీ జేఏసీ ఏర్పాటు చేయాలని సూచించారు. రిటైర్డ్ ఉద్యోగుల బెనిఫిట్స్ చెల్లించాలని డిమాండ్ చేశారు.

రేపటి నుంచి సీపీఎం బస్సు జాత

హైదరాబాద్, మార్చి 22(మనం ప్రతినిధి): జాతీయ స్థాయి మహాసభల ప్రచారం నిమిత్తం ఈ నెల 24 నుంచి సీపీఎం రెండు బస్సు జాతలను నిర్వహిస్తుంది. 24న ఉదయం రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నుంచి తొలి బస్సు జాతను పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బి.వి రాఘవులు ప్రారంభిస్తారు. రంగారెడ్డి, నాగర్‌కర్నూల్, వనపర్తి, గద్వాల్, మహబూబ్‌నగర్ జిల్లాలో ఈ జాత జరుగుతుంది. అదేవిధంగా పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం భువనగిరిలో మరో బస్సు జాతను ప్రారంభిస్తారు. భువనగిరి, నల్గొండ, యాదాద్రి, సూర్యాపేట, ఖమ్మం, కొత్తగూడెం, భూపాలపల్లి, వరంగల్, మహబూబాబాద్, జనగాం జిల్లాలో పర్యటిస్తుందని సీపీఎం నేత జూలకంటి రంగారెడ్డి తెలిపారు.

రిజర్వేషన్లపై ప్రధానినీ కలిశాం

జైట్లీ, రాజనాథ్‌తోనూ మొరపెట్టుకున్నాం

- చివరకు.. అద్వానీ దృష్టికీ తీసుకెళ్లాం
- స్పష్టమైన హామీ వచ్చే వరకు పోరాటం
- కేంద్రం కాలక్షేపం చేస్తోంది: ఎంపీ వినోద్

న్యూఢిల్లీ, మార్చి 22: రిజర్వేషన్ల విషయంపై గతంలో ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర మంత్రులు అరుణ్ జైట్లీ, రాజ్‌నాథ్ సింగ్‌ను కలిశామని టీఆర్ఎస్ ఎంపీ వినోద్ తెలిపారు. అయినా.. తమ డిమాండ్‌ను కేంద్రం ఏమాత్రం పట్టించుకోకుండా కాలక్షేపం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. చివరకు.. బీజేపీ కురువృద్ధుడు ఎల్‌కే అద్వానీని కలిసి తమ సమస్యను విన్నవించుకున్నామని అన్నారు. పార్లమెంట్ సమావేశాల అనంతరం గురువారం ఎంపీ వినోద్ మీడియాతో మాట్లాడారు. లోక్‌సభ దాదాపు గంట పాటు సభ వాయిదా పడడంతో ఎంపీలంతా బయటకు వెళ్లిపోయారని, ఆ సమయంలో ముందు వరుసలో కూర్చున్న అద్వానీని కలిసి తమ సమస్యను వివరించారు. తెలంగాణలో ఎస్టీల శాతం 6 నుంచి 9కి పెరిగిందని, అందుకే రిజర్వేషన్లు పెంచాలని కోరుతున్నామని వివరించామన్నారు. సీఎం కేసీఆర్ రిజర్వేషన్ల అంశాన్ని ప్రధాని తీసుకొచ్చారని అద్వానీకి తెలిపామన్నారు. అద్వానీ కూడా మా సమస్యను అర్థం చేసుకున్నారని, తమ గోడు విన్న అనంతరం అద్వానీ.. స్పీకర్‌తో 20 నిమిషాలపాటు భేటీ అయ్యారని చెప్పారు. ఏది ఏమైనా రిజర్వేషన్లపై కేంద్రం నుంచి స్పష్టమైన హామీ వచ్చే వరకూ పోరాడతామని వినోద్ పేర్కొన్నారు. తెలిపారు. వైసీపీ, టీడీపీ అవిశ్వాసానికి తాము అడ్డంకి అని చేస్తున్న ప్రచారాన్ని ఖండిస్తున్నట్లు చెప్పారు.


అద్వానీకి సమస్య వివరిస్తున్న టీఆర్ఎస్ ఎంపీలు

పదోతరగతి గణితం ప్రశ్నపత్రం లీక్

- జగిత్యాల జిల్లా కొడిమ్యాలలో ఘటన
- వాట్సాప్ ద్వారా ప్రశ్నలు పంపిన వైనం
- ఆరుగురు ఉపాధ్యాయుల సస్పెన్షన్
- సివిల్ డ్రెస్‌లోవెళ్లిన ఎస్ఐపై దాడి
- పోలీసుల అదుపులో ఇద్దరు టీచర్లు
- ఎంఈవో సహా పదిమందిపై కేసు

జగిత్యాల, మార్చి 22(మనం న్యూస్): జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండల కేంద్రంలో గురువారం పదో తరగతి గణితం ప్రశ్నపత్రం లీకయ్యింది. కొడిమ్యాల్ మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ, కోనాపూర్‌కు చెందిన వడ్లకొండ రమేష్, శ్రీనివాస్‌తో పాటు పద్మ, లింగవ్వ, రాధ ముగ్గురు మహిళా ఉపాధ్యాయులు కలిసి పరీక్షా కేంద్రానికి అందుబాటులో వున్న ఒక గదిలో కూర్చొని ప్రశ్నా పత్రంలోని ప్రశ్నలను, జవాబులను వాట్సప్ ద్వారా వేరే వారికి చేరవేస్తున్నారు. విషయం తెలుసుకున్న కొడిమ్యాల ఎస్సై సతీష్ కుమార్ సివిల్ డ్రెస్‌లో పరీక్షా కేంద్రానికి దగ్గర్లో వారున్న గదికి చేరుకుని ఇదేంటని ప్రశ్నించారు. దీంతో ఎవడివి నీవు అంటూ సదరు ప్రధానోపాధ్యాయుడు ఎస్ఐపై దాడికి పాల్పడ్డారు. వచ్చిన వ్యక్తి ఎస్ఐ అని తెలిసి ముగ్గురు మహిళ ఉపాధ్యాయులు పరారయ్యారు. సత్యనారాయణ, వడ్లకొండ రమేష్‌ను ఎస్ఐ రెడ్ హ్యాండడ్‌గా పట్టుకున్నారు. లీకేజీతో సంబంధమున్న ఆరుగురు ఉపాధ్యాయులను సస్పెండ్ చేశారు. కొడమ్యాల ఎంఈవోతో పాటు పదిమందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సతీష్ తెలిపారు. కొడిమ్యాల ఎంఈవో వెంకటేశ్వర్‌రావు, మోడల్ స్కూల్ హెచ్‌ఎం సత్యనారాయణ, ఉపాధ్యాయులు రమేశ్, శ్రీనివాస్, పద్మ, రాధ, రాజేశ్వరీ, సత్యనారాయణ, కేజీబీవీ అధికారి లింగవ్వ, కోనాపూర్ స్కూల్ హెచ్‌ఎం చంద్రమోహన్‌పై కేసులు పెట్టారు.


ఉపాధ్యాయుడిని పట్టుకున్న ఎస్సై

రైతులందరికీ 'రైతు బంధు'

- ఉత్పత్తి పెంచడమే లక్ష్యం
- బ్యాంకు అధికారులతో పార్థసారథి

హైదరాబాద్, మార్చి 22(మనం ప్రతినిధి): రైతు బంధు పథకంతో వ్యవసాయ ఉత్పత్తి పెంపొందించాలన్నదే సీఎం కేసీఆర్ లక్ష్యమని వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి పార్థసారథి పేర్కొన్నారు. రాష్ట్రంలోని ప్రతి ఎకరా భూమికీ ఈ పథకాన్ని వర్తింపజేయాలని నిర్ణయించారన్నారు. గతంలో పహాణీలో ఉన్న అన్ని అంశాలు ఇప్పుడు భూ రికార్డుల్లో సమగ్రంగా పొందుపరచామన్నారు. గురువారం సచివాలయంలో సాగుకు పెట్టుబడి పథకం చెక్కుల పంపిణీలో క్షేత్రస్థాయి సాధక బాధకాలు, సాంకేతిక సమస్యలపై బ్యాంకు అధికారులతో చర్చించారు. సాగుకు పెట్టుబడి పథకం పేరు రైతులక్ష్మీ నుంచి రైతుబంధుగా మార్చారని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూ సమగ్ర సర్వే ద్వారా రూపొందిన భూముల మొత్తం డాటా రెవెన్యూ శాఖ వద్ద అందుబాటులో ఉందన్నారు. రైతు బంధు పథకానికి సంబంధించిన పోర్టల్‌లో రైతుకు సంబంధించిన సమాచారమంతా అందుబాటులో పెడుతున్నామని తెలిపారు. ఆ భూమి వివరాలు తహసీల్దార్ సంతకాలతో ఎన్ఐసీ వారు పొందుపరుస్తున్నారని తెలిపారు. రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ గుర్తించిన మండల స్థాయి నోడల్ బ్యాంకు ద్వారా చెక్కుల పంపిణీ జరుగుతుందని తెలియజేశారు. దేశ పరిపాలన చరిత్రలోనే ఇంత పెద్ద కార్యక్రమానికి పూనుకోవడం గొప్ప విషయమన్నారు. ఈ పథకాన్ని వ్యవసాయ శాఖ, బ్యాంకు అధికారులు ఒక సవాలుగా తీసుకుని, సమన్వయంతో విజయవంతం చేయాలని కోరారు. సాగు ప్రారంభానికి ముందే రైతులకు చెక్కుల పంపిణీ పూర్తి కావాలన్నారు. చెక్కుల పంపిణీలో ఎలాంటి పక్షపాతం జరుగకుండా అక్షర క్రమానుసారంగా గ్రామాలకు చెక్కుల పంపిణీ జరుగుతుందన్నారు. రాష్ట్రంలో స్థిరీకరించిన వివరాల ప్రకారం 60 లక్షల పైగా రైతుల ఖాతలు ఉన్నట్టు తెలుస్తోందన్నారు. ఒకే రైతుకు వివిధ గ్రామాల్లో రెండు అంతకన్నా ఎక్కువ పాసు పుస్తకాలు ఉండే అంశాలను దృష్టిలో పెట్టుకోవాలని సూచించారు. బ్యాంకు అధికారులు చెప్పిన సమస్యలను దృష్టిలో ఉంచుకుని, క్షేత్రస్థాయిలో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా జిల్లా కలెక్టర్ నాయకత్వంలో రెవెన్యూ శాఖ అధికారుల సహకారంతో ఆచరణాత్మకమైన పద్ధతిలో ముందుకు పోవాలన్నారు. చెక్కుపైన పథకం పేరు, లబ్దిదారుని పేరు, పట్టా పాసు పుస్తకం నంబర్, ఇవ్వనున్న నగదు మొత్తం, రెవెన్యూ గ్రామం పేరు ఉంటాయని తెలియజేశారు.


సమావేశంలో మాట్లాడుతున్న పార్థసారథి

కాంట్రాక్ట్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి

- ఎమ్మెల్యే ఆర్.కృష్ణయ్య

హైదరాబాద్, మార్చి 22(మనం ప్రతినిధి): కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, తాత్కాలిక, పార్ట్‌టైమ్, కాంటిన్‌జెన్సీ తదితర ఉగ్యోగులను పర్మినెంట్ చేయాలని ఆర్.కృష్ణయ్య ప్రభుత్వాన్ని కోరారు. ముఖ్యమంత్రి కేసీఆర్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ తదితర ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తామని హామీ ఇచ్చి నాలుగేళ్లు కావొస్తుందని, రాష్ట్రవ్యాప్తంగా 2.20 లక్షల ఉద్యోగులు ఉన్నారని, వారికి న్యాయం చేయాలని ఆయన తెలిపారు. ఒక చెయ్యితో ఆర్డర్‌లు పాస్ చేస్తూనే, మరో చేతితో కోర్టుస్టేలు ఇస్తున్నారని మండిపడ్డారు. అసెంబ్లీలో చట్టంచేస్తే ఏ కోర్టు స్టే ఇవ్వదని, వెంటనే ఆ దిశగా చర్యలు చేపట్టాలని, లేదంటే హైదరాబాద్ ముట్టడిస్తామని హెచ్చరించారు. అసెంబ్లీలో బిల్ పెడితే అన్ని పార్టీలు మద్ధతు ఇవ్వాలని ఆయన కోరారు.

కోర్టులను రద్దు చేయండి

- ప్రభుత్వాలే గౌరవించకపోతే.. కోర్టులు ఉండి ప్రయోజనమేంటి?
- కార్మిక సంఘాల నేతల ఆగ్రహం

హైదరాబాద్, మార్చి 22(మనం ప్రతినిధి): సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్న తీర్పును అమలుచేయలేని పక్షంలో కోర్టులను రద్దు చేయాలని కార్మిక సంఘాల నేతలు డిమాండ్ చేశారు. తమ జీతాలను అమాంతం పెంచుకున్న ప్రజాప్రతినిధులు కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు పెంచడంలో అలసత్వం ఎందుకు ప్రదర్శిస్తున్నారంటూ నిలదీశారు. ఉద్యోగ భద్రత లేకుండా, అరకొర జీతాలకే ఏళ్ల తరబడి పనిచేస్తున్న కాంట్రాక్ట్ వర్కర్లకు న్యాయం చేయాలన్నారు. కోర్టు తీర్పులు తమకు అనుకూలంగా ఉన్నా వాటిని అమలుచేయడంలో ప్రభుత్వం విఫలమవుతోందని ఆవేదన వ్యక్తంచేశారు. ఇక కోర్టులు ఉండి ప్రయోజనం ఏముందని మండిపడ్డారు. ఈమేరకు సమాన పనికి సమాన వేతనం డిమాండ్‌తో ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో కార్మికులు చేస్తున్న దీక్షలు గురువారం కొనసాగాయి. ఈ సందర్భంగా కార్మిక సంఘం నేత వి.యస్ బోస్ మాట్లాడుతూ.. ప్రభుత్వాలే కోర్టు తీర్పును గౌరవించనప్పుడు, ఆ కోర్టులు ఉండి ప్రయోజనమేంటని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం లేబర్ డిపార్ట్‌మెంటును నిర్వీర్యం చేస్తోందని, కార్మిక చట్టాలను అమలు చేయకుండా మభ్య పెడుతోందని ఐఎన్‌టీయూసీ నేత ఉజ్జిని రత్నాకర్‌రావు ఆరోపించారు. అనేక చోట్ల కాంట్రాక్ట్ కార్మికులకు కనీసం వేతనాలు అందడంలేదని, ఈయస్ఐ, పీఎఫ్, బోనస్, సెలవుల వంటి సౌకర్యాలు కల్పించకుండా యాజమాన్యాలు దోచుకుంటున్నాయని విమర్శించారు. హెచ్ఎండీఏ పరిధిలో పనిచేస్తున్న గార్డెన్ కార్మికులకు మునిసిపల్ కార్మికులతో సమానంగా నెలకు రూ.14 వేలు చెల్లించాలని యూనియన్ ప్రధాన కార్యదర్శి కె.వీరేందర్ డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ.18వేలు చెల్లించాలని, ఐదేండ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని కోరారు. తమ డిమాండ్లు వెంటనే నెరవేర్చకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని నేతలు హెచ్చరించారు.

బాసర ఆలయంలో ఆత్మహత్యాయత్నం

- అడ్డుకోబోయిన పూజారి, సిబ్బందికి గాయాలు
- అపస్మారక స్థితిలో ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తి
- బయటపడ్డ నిఘా వ్యవస్థలోని డొల్లతనం

నిర్మల్/బాసర, మార్చి 22, (మనం న్యూస్): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం బాసర శ్రీ సరస్వతి అమ్మవారి సన్నిధిలో ఓ వ్యక్తి ఆత్మహత్యకు యత్నించాడు. అతనిని గమనించి అడ్డుకోబోయిన ఆలయ సిబ్బంది కూడా గాయపడ్డారు. గురువారం ఉదయం జరిగిన ఈ ఘటన ఆలయ సిబ్బందిని కలవర పాటుకు గురిచేసింది. నిజామాబాద్‌కు చెందిన సాయిగౌడ్ అనే వ్యక్తి కత్తితో గురువారం ఉదయం ఆలయంలోకి వచ్చాడు. సిబ్బంది అందరూ వారివారి పనుల్లో నిమగ్నమై ఉన్నారు. ఇంతలో అతను గర్భగుడిలోకి ప్రవేశించి వెంట తెచ్చుకున్న కత్తితో చేయి,మెడపై కోసుకున్నాడు. అతనిని గమనించిన పూజారి, ఇతర సిబ్బంది అడ్డుకునే ప్రయత్నం చేశారు. సాయిగౌడ్ వారిని నెట్టేయడంతో వారు గాయపడ్డారు. తీవ్ర రక్తస్రావం వల్ల సాయిగౌడ్ అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. ఆలయ సిబ్బంది పోలీసులకు సమాచారం ఇవ్వగా, వారు అతనిని ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు. ఆత్మహత్య వెనుక కారణాలు తెలియలేదు. అయితే గురువారం జరిగిన ఘటనతో ఆలయంలోని నిఘా వ్యవస్థలో డొల్ల తనం బయటపడింది. మారణాయుధంతో ఓ వ్యక్తి ఆలయంలోకి ప్రవేశించడం పట్ల పలువురు విమర్శలు చేస్తున్నారు.



ఆత్మహత్యకు యత్నించిన సాయిగౌడ్

'నావ్రాస్' యాప్ ఆవిష్కరణ

- అప్లికేషన్‌లో కాచిగూడ స్టేషన్ సమస్త సమాచారం



హైదరాబాద్, మార్చి 22(మనం ప్రతినిధి): కాచిగూడ రైల్వే స్టేషన్‌కు సంబంధించిన సమస్త సమాచారం అందుబాటులో ఉండేలా తయారుచేసిన నావ్రాస్(నావిగేషన్ ఫర్ రైల్వే స్టేషన్స్) యాప్‌ను దక్షిణ మధ్య రైల్వే జీఎం వినోద్‌కుమార్ యాదవ్ గురువారం ఆవిష్కరించారు. ఈ యాప్‌లో కాచిగూడ స్టేషన్‌లోని దుకాణాలు, రిజర్వేషన్ కౌంటర్, ప్లాట్‌ఫారం, తదితర సమాచారం లభ్యమవుతుందని, స్టేషన్లోని ఒక చోటు నుంచి మరో చోటుకి సులువుగా చేరుకునేలా నావిగేషన్ సౌకర్యం ఉంటుందని వినోద్‌కుమార్ తెలిపారు. రైల్వే స్టేషన్ల పూర్తి సమాచారం అందుబాటులో ఉండేలా 'రైల్ స్టేషన్ ఇన్ఫో' అనే మరో యాప్‌ను జీఎం ఆవిష్కరించారు. 400కిలో వాట్ పవర్ సామర్థ్యం ఉన్న సోలార్ పవర్ ప్లాంటును వినోద్ కుమార్ గురువారం ప్రారంభించారు.

ఆర్టీసీ జేడీకి కేయూ డాక్టరేట్



హైదరాబాద్, మార్చి 22(మనం ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(టీఎస్‌ఆర్టీసీ) జాయింట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న టి.వెంకటరావుకు కాకతీయ విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రకటించింది. 'పోలీస్ అండ్ లా – ఏ క్రిటికల్ స్టడీ ఆఫ్ కాన్సిస్టూషనల్ అండ్ హ్యూమన్ రైట్స్ డైమెన్షన్' అనే అంశంపై పరిశోధన కుగానూ వెంకటరావుకు డాక్టరేట్ ప్రదానం చేస్తున్నట్టు వర్సిటీ వెల్లడించింది. వెంకటరావు స్వస్థలం పాత ఆదిలాబాద్ జిల్లా, కుంటల మండలం, అంబ కాంతి గ్రామం. 1976లో సబ్ ఇన్‌స్పెక్టర్‌గా పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో చేరిన వెంకటరావు ఉత్తమ పనితీరుతో అనేక అవార్డులను పొందారు. సూపరింటిండెంట్ ఆఫ్ పోలీస్(ఎస్పీ)గా 2012లో ఉద్యోగ విరమణ చేశారు.

నీటి సంరక్షణలో ముందుండాలి

- ఫ్యూచరిస్టిక్ సిటీస్ అధ్యక్షురాలు కరుణ

హైదరాబాద్, మార్చి 22(మనం ప్రతినిధి): జల వనరుల సంరక్షణలో ఫ్రాన్స్, యూకే దేశాలను భారత్ అనుసరించాలని ఫౌండేషన్ ఫ్యూచరిస్టిక్ సిటీస్ అధ్యక్షురాలు కరుణ గోపాల్ పేర్కొన్నారు. నీటి వినియోగం, సంరక్షణ విషయంలో ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలిచే సత్తా భారత్‌కు ఉందన్నారు. అయితే, సంరక్షణ విషయంలో మనం ఇప్పటికీ వెనకబడే ఉన్నామని తెలిపారు. ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కరుణ గోపాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నీటి సంరక్షణలో అభివృద్ధి చెందిన దేశాలు అవలంభిస్తున్న విధానాలను వివరించారు. భారత్ కూడా ఆ దిశగా పయనించాలని ఆకాంక్షించారు. ఇందుకు ప్రజల సహకారం ఎంతో అవసరమని వివరిస్తూ.. ప్రజలు స్వచ్ఛందంగా ముందుకురానంతవరకూ జల దినోత్సవాలు ఎన్ని జరుపుకున్నా ప్రయోజనం ఉండదని ఐఈఐ చైర్మన్ డాక్టర్ ఎస్.సత్యనారాయణ అన్నారు.



అజ్మీర్ దర్గాకు సీఎం 'చాదర్'

హైదరాబాద్, మార్చి 22: ఉర్సు ఉత్సవాల సందర్భంగా అజ్మీర్ దర్గాకు సీఎం కేసీఆర్ చాదర్ సమర్పించారు. గురువారం ప్రగతి భవన్ లో సీఎం కేసీఆర్.. చాదర్‌ను నెత్తిన మోస్తూ కొద్దిసేపు నడిచి తర్వాత ముస్లిం పెద్దలకు చాదర్ సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ, ఎమ్మెల్సీలు ఫరీదుద్దీన్, ఫరూఖ్ హుస్సేన్, ఎమ్మెల్యే షకీల్, వక్ఫ్ బోర్డు చైర్మన్ సలీం, మక్కా మస్జిద్ ఇమామ్ ఉస్మాన్ నక్షబంధి, మైనారిటీ సంక్షేమం సలహాదారు ఎకె ఖాన్, జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ బాబా ఫసియుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



గీత కార్మికులకు సీఎం కేసీఆర్ వరాలు ప్రకటించిన నేపథ్యంలో మండలి చైర్మన్ స్వామిగౌడ్‌కు పార్టీ ఎమ్మెల్సీల అభినందనలు

జీఎస్టీతో నగదు బదిలీ పెరిగింది

- జమలు చెల్లింపులకు భారీ తేడా
- పెద్ద నోట్ల ఆవశ్యకత ఎక్కువ
- ఆర్బీఐ నుంచి తగ్గిన సరఫరా: ఈటల




హైదరాబాద్, మార్చి 22(మనం ప్రతినిధి): కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జీఎస్టీ విధానంలో ఆధార్ నెంబర్‌ను అకౌంట్‌కు లింక్ చేయడంతో ఎలాంటి డిజిటల్ ట్రాన్సాక్షన్ చేసినా ట్యాక్స్ పడుతుందనే భయంతో ప్రజలు మళ్లీ నగదు రూప లావాదేవీలకు మొగ్గుచూపుతున్నారని ఆర్థిక శాఖ మంత్రి ఈటల రాజేందర్ పేర్కొన్నారు. దీంతో ఏటీఎంలల్లో నగదు కొరత ఏర్పడుతుందన్నారు. ఏటీఎంల్లో నగదు కొరత, ఆహార భద్రత కార్డుల అంశాలపై సయ్యద్ అమినుల్ హసన్ జాఫ్రీ, ఎన్.రామచందర్‌రావు వివరణ కోరగా మంత్రి సమాధానమిస్తూ.. రాష్ట్రంలో నగదు కొరత ప్రధాన కారణాలను వివరించారు. ఆర్బీఐ సరిపడా కరెన్సీని సరఫరా చేయకపోవడం, ప్రజల నుంచి కరెన్సీ ప్రవాహంలో ప్రత్యేకించి ఏటీఎంకు అనువైన నోట్లు, నగదు జమలు, నగదు చెల్లింపులు మధ్య పొంతన లేకపోవడంతో ఏటీఎంల్లో నగదు కొరతకు దారితీసిందన్నారు. పెద్దనోట్ల ఆవశ్యకత ఎక్కువగా ఉందని, చిన్న నోట్లలో కరెన్సీ సరఫరా ఉన్నదన్నారు. తెలంగాణ ప్రజల డిమాండ్‌ను తీర్చడానికి సరిపడా నగదును సరఫరా చేయాలని ప్రభుత్వం ఆర్బీఐ గవర్నర్, కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశామన్నారు. రైతులకు ఇచ్చే పెట్టుబడి పథకంలో భాగంగా రూ. 5 వేల కోట్లు నగదును రాష్ట్ర ప్రభుత్వానికి ఇవ్వాలని కోరినట్టు తెలిపారు. ఆహార భద్రత కార్డుల విషయంపై సమాధానమిస్తూ... ఆరు నెలలుగా హైదరాబాద్‌లో ఆహార భద్రత కార్డుల మంజూరును సస్పెండ్ చేశామని, ఈపీఓఎస్ ప్రాజెక్టు పూర్తి అయినందున మార్చి 1 నుంచి నగరంలో రేషన్ కార్డులను తిరిగి ప్రారంభించినట్టు తెలిపారు. జీహెచ్ఎంసీ ప్రాంతాల్లో ఈపీఓఎస్ ఏర్పాటు పూర్తయిన తర్వాత తెలంగాణలోని మిగిలిన జిల్లాల్లో ఈపీఓఎస్ అమలును చేపట్టడమయిందన్నారు.

మరో ఐదు పట్టణాల్లో టీ హబ్: కేటీఆర్



హైదరాబాద్, మార్చి 22 (మనం ప్రతినిధి): అంకుర సంస్థలను ప్రోత్సహించడానికి ఏర్పడిన టీ హబ్ ఘన విజయాలు సాధించిందని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. ద్వితీయ శ్రేణి నగరాలైనా ఖమ్మం, కరీంనగర్, వరంగల్, నిజామాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాలోనూ టీ హబ్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు గురువారం నాడు శాసన సభ ప్రశ్నోత్తరాల సమయంలో టీఆర్ఎస్ సభ్యులు బిగాల గణేష్, పువ్వాడ అజయ్ కుమార్ అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. రానున్న కాలంలో బడా ఐటి సంస్థల్లో ఉద్యోగాలు తగ్గిపోతాయని, అంకుర సంస్థల్లోనే ఎక్కువ ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉందని కేటీఆర్ అభిప్రాయపడ్డారు. ఇప్పటి వరకు 346 అంకుర ఇంక్యుబేసిన్ సెంటర్లు పని చేస్తున్నాయని, 835 అనుబంధ అంకురాలు పని చేస్తున్నాని తెలిపారు. ప్రపంచంలోనే మన అత్యధిక ఇంక్యుబేసిన్ సెంటర్లు ఉన్న నగరంగా హైదరాబాద్ అవతరించిందని వివరించారు. టాప్ వంద సంస్థలతో టీ హబ్ సంయుక్తంగా పని చేస్తుందని , త్వరలోనే టి హబ్ 2 కూడా నిర్మాణం పూర్తి చేసుకుంటుందన్నారు. స్టార్టప్ ల్లో గ్రామీణ ప్రాంతాలకు చెందిన ఔత్సాహికులను సైతం ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. వీరేశం అనే చేనేత కార్మికుడికి కోటి రూపాయలు ఇచ్చి ప్రోత్సహించినట్లు కేటీఆర్ తెలిపారు. మన టీ హబ్ పనితీరును 8 రాష్ట్రాలకు చెందిన మంత్రులు, అధికారులు పరిశీలించారని, గోవా, అస్సాం, ఢిల్లీ ప్రభుత్వాలతో ఒప్పం దాలు చేసుకున్నాయని, వీరికి సహకరిస్తున్నామని చెప్పారు. స్టేట్ ఇన్నోవేషన్ సెల్ ఏర్పాటుచేసి రెడ్ బస్సు వెబ్ సైట్‌ను స్థాపించిన ఫణీంద్రను సీఇవోగా నియమించామని తెలిపారు. ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడానికి ఈ సెల్ కృషి చేస్తుందన్నారు.

సమన్వయ సమితులే కీలకం: పోచారం



హైదరాబాద్, మార్చి 22(మనం ప్రతినిధి): రైతులకు సంబంధించిన అన్ని అంశాల్లో రైతు సమన్వయ సమితులే కీలకంగా వ్యవహరిస్తాయని వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. గురువారం నాడు అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో చింతా ప్రభాకర్, చెన్నమనేని రమేష్ అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం చెప్పారు. గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి రైతు సమన్వయ సమితిల్లో మొత్తం లక్షా 61 వేల మంది సభ్యులు ఉంటారని చెప్పారు. రైతు సమన్వయ సమితులు నేరుగా రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయవని ఆయన స్పష్టం చేశారు. ఇప్పుడు కొనసాగుతున్న విధానంగానే ఐకేపీ సభ్యులే ధాన్యం కొంటారని చెప్పారు. ప్రభుత్వాలు ప్రకటించిన కనీస మద్దతు ధర రాని సందర్భాల్లో మాత్రం ఆయా పంటలను రైతు సమన్వయ సమితులు కొనుగు చేస్తాయని చెప్పారు. ఇందుకు కావాల్సిన నిధులను ప్రభుత్వం గ్యారంటీ ఇచ్చి బ్యాంక్‌ల నుంచి తీసుకుంటామన్నారు.

రైతు సమన్వయ సమితుల్లో సభ్యులందరినీ టీఆర్ఎస్ కు చెందిన వారినే నియమించడం పట్ల బీజేపీ పక్ష నేత కిషన్ రెడ్డి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనిపై అనుబంధ ప్రశ్న అడిగేందుకు స్పీకర్ అనుమతిం చకపోవడంతో తీవ్ర నిరసన వ్యక్తం చేసిన బీజేపీ సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు. పంట పెట్టుబడి సాయం చెక్కులు ఇచ్చే సమయంలో రైతు సమన్వయ సమితులు కీలక పాత్ర పోషిస్తాయని, రైతులను, అధికారులను, ప్రజా ప్రతినిధుల మధ్య సమన్వయం చేసుకుంటాయని మంత్రి వివరించారు. కేంద్ర వంద శాతం విదేశీ పెట్టుబడులకు అనుమతి ఇచ్చినందున ఈ రంగంలోకి విదేశీ బడా సంస్థలు ప్రవేశించే అవకాశం ఉందని టీఆర్ఎస్ సభ్యుడు చెన్నమనేని రమేశ్ హెచ్చరిం చారు. వీటి వల్ల రైతులకు ఎలాంటి ప్రయోజనం ఉండదన్నారు. అనేక దేశాల్లో ఇలాంటి సంస్థలను రైతులను మోసం చేశారన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు విషయంలో రైతులకు ప్రయోజనం కలిగేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. కల్తీ విత్తనాలు అరికట్టే విషయంలో రైతు సమన్వయ సమితులు అప్రమత్తంగా ఉండాలన్నారు.

కేసీఆర్ కిట్ దేశానికే ఆదర్శం

పేద మహిళలకు ఇదో వరం ...ఒక విజన్ కోసమే ప్రవేశపెట్టాం

- సంక్షేమమే లక్ష్యంగా పథకాలు
- వైద్యులు, స్టాఫ్ నర్సులకు శిక్షణ
- బాలింతలను ఇంటికి చేర్చే 102
- పిల్లల, మత్తుమందు నిపుణుల ఏర్పాటు
- రాష్ట్రంలో తగ్గిన శిశుమరణాల రేటు
- మండలిలో వైద్యారోగ్య మంత్రి లక్ష్మారెడ్డి




(ఫైల్ ఫొటో)

హైదరాబాద్, మార్చి 22(మనం ప్రతినిధి): గర్భిణుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న కేసీఆర్ కిట్ దేశానికే ఆదర్శమని వైద్యారోగ్య శాఖ మంత్రి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. కేసీఆర్ కిట్ ఓ విజన్ అని తెలిపారు. గత ప్రభుత్వాలు ఓట్ల కోసం పథకాలు ప్రవేశ పెడితే.. టీఆర్ఎస్ సర్కారు మాత్రం ప్రజా సంక్షేమమే లక్ష్యంగా వివిధ పథకాలు అమలుచేస్తోందని వివరించారు. గురువారం శాసన మండలిలో కేసీఆర్ కిట్‌పై లఘు చర్చ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. ప్రజారోగ్య సంస్థలలో సంస్థాగత ప్రసవాలను పెంపొందించడం, వేతన నష్టాన్ని భర్తీ చేయడం, నాణ్యమైన ప్రసవ పూర్వ, ప్రసవానంతర సంరక్షణను అందించడం, గౌరవప్రదంగా ప్రసవం, అనవసరపు సీ-సెక్షన్లను నిరోధించడం, తప్పనిసరి వాక్సినలన్నింటితో ప్రతీ శిశువుకు టీకాలను వేయడం వంటి అంశాలను లక్ష్యాలుగా పెట్టుకుని ముందుకు సాగుతున్నామని తెలిపారు. కేసీఆర్ కిట్ ప్రారంభించడానికి ముందే మౌలిక సదుపాయాలను, సిబ్బందిని మెరుగుపరచడానికి అనేక చర్యలను తీసుకున్నట్టు పేర్కొన్నారు. అందులో భాగంగా లేబర్ టేబుళ్లు, ఇతర పరికరాలను సేకరించడం, లేబర్ రూములను నవీకరించడం, తొమ్మిది 150 పడకల ఎంసీహెచ్ బ్లాకులను నిర్మించడం, గర్భిణులను తీసుకెళ్లడానికి 2 సర్వీసులను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ప్రసూతి, మత్తుమందు, చిన్న పిల్లల స్పెషలిస్టులను నియమించడం, డాక్టర్లకు, స్టాఫ్ నర్సులకు అధునాతన లేబర్ రూమ్ ప్రొటోకాల్స్‌లో శిక్షణ ఇచ్చామన్నారు. పేద మహిళలకు సమస్యలు లేని సంస్థాగత ప్రసవాల సంరక్షణకు కేసీఆర్ కిట్ పరిష్కారంగా ఉంటుందన్నారు. ప్రసవ పూర్వ సంరక్షణను పొందడానికి, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలను, ప్రసవానంతర సంరక్షణ, శిశువుకు టీకాలను ఇప్పించడంలో ఈ కిట్ ప్రోత్సాహం అందిస్తుందన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లోని ప్రసవాలకు మాత్రమే కేసీఆర్ కిట్ ప్రోత్సహకాలను అందజేస్తున్నట్టు పేర్కొన్నారు. ఆడశిశువు జన్మిస్తే రూ.13 వేలు, మగశిశువు జన్మిస్తే రూ.12 వేలను విడుతల వారీగా అందిస్తున్నట్టు తెలిపారు. ఇప్పటి వరకు మొత్తం 6,43,420 మంది లబ్దిదారులకు రూ.203.68 కోట్లు ఖర్చు చేసినట్టు తెలిపారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో పెరిగిన ప్రసవాలు


కేసీఆర్ కిట్ వల్ల ప్రభుత్వ ఆస్పత్రులలో ప్రసవాల సంఖ్య పెరిగిందని మంత్రి లక్ష్మారెడ్డి తెలిపారు. జూన్ 2017లో 41.47 శాతం ప్రసవాల నుంచి అక్టోబర్ 2017 వరకు 52 శాతానికి పెరిగాయన్నారు. ప్రస్తుతం ప్రభుత్వాస్పత్రులో ప్రసవాల శాతం 47.2 గా ఉందన్నారు. తెలంగాణలోని ప్రస్తుతం ప్రతీ గర్భిణీకి ఈ పథకంపై నమ్మకం ఉందని పలువురు శాసన సభ్యులు పేర్కొన్నారు. అందుకే 95 శాతం మంది గర్భిణులు ముందే రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని తెలిపారు. గతంలో తెలంగాణలో మెటర్నటీ మోర్టాలిటీ రేటు 92 శాతంగా ఉండేదని ప్రస్తుతం 70 శాతానికి పడిపోవడానికి కారణం కేసీఆర్ కిట్ అని పేర్కొన్నారు. ఇప్పటికే 1.86 లక్షల కిట్లను పంపిణీ చేసినట్టు తెలిపారు. ఈ పథకానికి ఎన్నో అవార్డులు వచ్చాయని తెలిపారు. కేసీఆర్ కిట్, అమ్మ ఒడి పథకాల ద్వారా శిశు మరణాల రేటు కూడా తగ్గిందన్నారు. గతంలో ప్రతీ వెయ్యి మంది పిల్లలో 38 మంది శిశువులు మరణించేవారని ఇప్పుడు ఆ సంఖ్య 30 కి చేరిందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మిషన్ ఇంద్ర ధనుస్సు పథకాన్ని తెలంగాణ రాష్ట్రం వంద శాతం అమలు చేస్తోందని మన్‌కీబాత్ కార్యక్రమంలో స్వయంగా ప్రధాని మోదీ ప్రశంసించారని గుర్తుచేశారు.

కిట్ ఒక్కటే సరిపోదు



'రాష్ట్రంలోని ప్రభుత్వాస్పత్రులో ప్రసవాల సంఖ్య పెంచాలంటే కేసీఆర్ కిట్ పంపిణీ చేస్తే సరిపోదు.. ఆస్పత్రుల్లో సౌకర్యాలను మెరుగు పరచాలి. గతంలో కన్నా ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాల సంఖ్య పెరిగిన మాట వాస్తవమే! దానిని మేంకూడా స్వాగతిస్తున్నాం. అయితే, గర్భిణులను ఆస్పత్రికి తీసుకొచ్చేందుకు, ఇంటికి తీసుకెళ్లేందుకు ఏర్పాటుచేసిన 102 సర్వీసులను మరిన్ని పెంచాలి. ఈ పథకంపై ప్రజల్లో అవగాహన పెంచాల్సిన అవసరం ఉంది'.

-రామచందర్ రావు, బీజేపీ ఎమ్మెల్సీ



పెద్ద ఎత్తున గోదాములు

- 18.3 లక్షల టన్నుల సామర్థ్యంతో నిర్మాణం: హరీశ్

హైదరాబాద్, మార్చి 22(మనం ప్రతినిధి): తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత వ్యవసాయ మార్కెటింగ్ శాఖ కింద గోదాముల సామర్థ్యాన్ని గణనీయంగా పెంచామని, రూ. 1024,50 కోట్లతో 18.30 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల 364 శాస్త్రీయ గోదాములను నిర్మిస్తున్నామని నీటి పారుదల, మార్కెటింగ్ శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. మార్కెటింగ్ శాఖ కింద గిడ్డంగులు, సిద్దిపేటలో మోడల్ రైతు బజారు అంశాలపై పల్లా రాజేశ్వర్‌రెడ్డి, పురాణం సతీషకుమార్, పాతూరి సుధాకర్‌రెడ్డి, ఫారూక్ హుస్సేన్ వివరణ కోరగా మంత్రి సమాధానమిస్తూ... ఇప్పటి వరకు రూ. 818.14 కోట్ల నిధులను ఖర్చు చేసినట్టు తెలిపారు. రాష్ట్రంలో ఎక్కడ గ్యాప్, అవకాశం ఉందో అని నాబార్డును కోరామన్నారు. ప్రభుత్వ గోడౌన్లలో రూ. 2లకే నిల్వ చేసుకునే అవకాశం కల్పిస్తున్నా మన్నారు. ప్రభుత్వ గోడౌన్ల ద్వారా సివిల్ సప్లై, నాబార్డుకు రూ. 8.4 కోట్ల ఆదాయం వస్తుందన్నారు. గత 60 ఏండ్లలో 4 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యంగల గోడౌన్లను నిర్మిస్తే, నాలు గేండ్లలో 12లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోడౌన్లను నిర్మించామన్నారు. సిద్దిపేటలో ఆధుని క సదుపాయాలతో మూడు అంతస్తుల భవనము లో ఆధునిక రైతు బజారును నిర్మిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో ఇతర పట్టణాల్లోనూ ఏర్పా టు చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. పట్టణా ల మధ్యలో ఉంటేనే ప్రజలందరికీ ఉపయోగ కరంగా ఉంటుందన్నారు. ప్రజ్ఞాపూర్‌లో ప్రయో గాత్మకంగా మోడల్ రైతు బజారు ఏర్పాటు చేశా మని, తూప్రాన్ హైవేపై కూడా ఏర్పాటు చేసేం దుకు చర్యలు తీసుకుంటున్నట్టు పేర్కొన్నారు.

ప్రభుత్వంపై అంకుశంలా ఉంటాం

సమన్వయ సమితులతో రైతులకు ప్రయోజనం లేదు

- రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా కమిటీల ఏర్పాటు: కిషన్‌రెడ్డి
- విపక్షాలు లేకుండా సభను నడిపిస్తున్న ఖ్యాతి టీఆర్ఎస్‌దే: లక్ష్మణ్
- ప్రశ్నోత్తరాలను బహిష్కరించిన బీజేపీ సభ్యులు



హైదరాబాద్, మార్చి 22 (మనం ప్రతినిధి) : ప్రతిపక్షాల హక్కులు కాలరాసే విధంగా ప్రభుత్వం ప్రవర్తిస్తుందని, సభలో ప్రభుత్వాన్ని ప్రశ్నించే, నిరసన తెలిపే అవకాశం ఇవ్వడం లేదని అందుకే శాసనసభలో ప్రశ్నోత్తరాలను బీజేపీ బహిష్కరించి బయటకు వచ్చామని బీజేపీ ఎమ్మెల్యే కిషన్ రెడ్డి తెలిపారు. గురువారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ.. దాదాపు 539 గ్రామాల్లో, లక్షా 73 వేల మంది టీఆర్ఎస్ కార్యకర్తలతో, 10,735 రైతు సమన్వయ సమితి కమిటీలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని, ఇది పూర్తిగా రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని ఆయన విమర్శించారు. పంచాయతీ రాజ్ వ్యవస్థకు భంగం కలిగే విధంగా ఈ సమితులను ఉన్నాయని ఆయన ఆరోపించారు. టీడీపీ జన్మభూమి, కాంగ్రెస్ ఆదర్శ రైతుల పథకాలకు సమన్వయ సమితి కమిటీలకు తేడా ఏమీ లేదన్నారు. అసెంబ్లీ సాక్షిగా టీఆర్ఎస్ ప్రభుత్వం బాజాప్తగా అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందని వ్యాఖ్యనించారు. రైతు సమన్వయ సమితులతో రైతులకు ఏమీ ఒరుగదని, గ్రామీణ రైతాంగానికి మేలు జరగడం లేదన్నారు. అవి రైతు సమన్వయ సమితులు కావని, టీఆర్ఎస్ సమన్వయ సమితులని, వీటిని బీజేపీ పూర్తిగా వ్యతిరేకిస్తుందని ఆయన తెలిపారు. ప్రజాసంఘాలు, బడుగు బలహీన వర్గాలతో పాటు, ప్రజలు, సర్పంచ్‌లు రైతు సమన్వయ సమితులు వ్యతిరేకిస్తున్నాయన్నారు. టీఆర్ఎస్ పూర్తిగా నియంతృత్వ పోకడతో వ్యవహరిస్తుందని ఆక్షేపించారు. ప్రతిపక్షా లకు నిరసన తెలిపే అవకాశం ఇవ్వడం లేదన్నారు. పార్లమెంట్‌లో టీఆర్ఎస్ ఎంపీలు సభను అడ్డుకుంటున్నారని, స్పీకర్‌పై ప్లకార్డులు పెడుతున్నారని, కానీ అసెంబ్లీలో తాము సభా నియమావళిని అనుసరించి వ్యవహరిస్తుంటే దాన్ని బలహీనతగా తీసుకుంటోందన్నారు. ఇప్పటికే సభ నుంచి కాంగ్రెస్‌ను సాగనం పిందని, సభలో ఉన్నా ప్రతిపక్షాలనుకూడా ఉండకుండా సర్కారు వ్యవహరి స్తుందన్నారు. ప్రభుత్వంపై అంకుశంలా ఉండేందుకు ప్రజలకు తమకు అధికారం ఇచ్చారని, ప్రభుత్వ తప్పులను ఎత్తి చూపడం తమ హక్కని, ప్రజల తరపున పోరాడటం తమ బాధ్యతని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

అసెంబ్లీలో ఉన్నా నలుగురు, ఐదుగురు బీజేపీ ఎమ్మెల్యేల మాట వినాలా? అన్నట్లు ప్రభుత్వం వ్యవహరిస్తుందని ఎమ్మెల్యే లక్ష్మణ్ విమర్శించారు. ప్రతిపక్షాలు ప్రశ్నించడానికి లేకుండా అప్రజాస్వామికంగా సభను నడిపిస్తుందన్నారు. కొత్త రాష్ట్రం అసెంబ్లీని అర్థవంతంగా నడుపుకుని ప్రజలకు న్యాయం జరిగేలా ఉండాలి తప్పితే, అధికార పార్టీకి ఊకదంపుడు ఉపన్యాసాలుగా, ఏకపక్షంగా అసెంబ్లీని నడపడం దారుణమన్నారు. ప్రతిపక్షాలు లేకుండా సమావేశాలు జరుపుతున్న ఖ్యాతి టీఆర్ఎస్‌కు దక్కుతుందన్నారు.

టీఆర్ఎస్ ఏకపక్షంగా వ్యవహరిస్తోంది : ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్



ఒక్క నిమిషంలో అనేక రంగాలపై మాట్లాడటం సాధ్యమా?, పది పద్దులపై ప్రశ్నించేందుకు 20 నిమిషాలు ఇస్తే ఎలా? అని ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ ప్రశ్నించారు. ప్రతిపక్షాలు ప్రభుత్వానికి అణిగిమణిగి ఉండాలన్నట్లు టీఆర్ఎస్ వ్యవహరిస్తుందన్నారు. ప్రజా సమస్యలను లేవనెత్తడానికి సమయం ఇవ్వరా అని ఆవేదన వ్యక్తం చేశారు. శాసనసభను టీఆర్ఎస్ చులకన చూస్తుందన్నారు. జీరో అవర్‌లో ఎన్నో సమస్యలను సభ దృష్టికి తీసుకువస్తుంటే, మంత్రులు చాలా తేలిగ్గా తీసుకుంటున్నా రని, వాటికి లిఖిత పూర్వకంగా సమాధానాలు ఇవ్వడంలేదన్నారు. ప్రభుత్వం జవాబు దారిగా ఉండాలన్నారు. సరైన సమాధానం దొరకనపుడు నిరసనను తెలియజేసే హక్కు సభ్యులకు ఉంటుందని, సభాపతి ఈ విషయాన్ని గుర్తురెగి వ్యవహరించాలన్నారు.



నిబంధనలు సడలిస్తాం

- సనత్‌నగర్‌లో ఇండ్ల క్రమబద్ధీకరణపై మంత్రి కేటీఆర్

హైదరాబాద్/అమీర్‌పేట, మార్చి 22(మనం న్యూస్): నియమ నిబంధనలతో కాకుండా, వాస్తవిక దృక్పథంతోనే బంగారు తెలంగాణ సాధ్యప డుతుందని మంత్రి కేటీఆర్ అన్నారు. పేదలకు మేలు చేసేందుక అవసరమైతే చర్యలు తీసుకుంటామని చెప్పారు. అసెంబ్లీ సమావేశ మందిరంలో గురువారం రాష్ట్ర మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, ఇంద్రకరణ్ రెడ్డి, వివిధ శాఖల అధికారులతో కేటీఆర్ సమావేశాన్ని నిర్వహించారు. నత్‌నగర్ నియోజకవర్గంలో ప్రభుత్వ శాఖల భూముల సమస్యను పరిష్కరించి, వాటిలో దశాబ్దాలుగా నివాసం ఉంటున్న పేదలకు ఇండ్ల స్థలాలను క్రమబద్ధీకరిం చాలని ఈ సందర్భంగా సూచించారు. ఇందుకు జీహెచ్ఎంసీ. దేవాదాయ, కార్మికశాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఇండ్ల క్రమబద్ధీ కరణకు జీవో 58 జారీ చేసి అమలులోకి తీసుకొచ్చారన్నారు. ఈ జీఓను ఇతర శాఖల వారు అమలుపరచకపోవడం పట్ల మంత్రి విస్మయం వ్యక్తంచేశారు. సనత్‌నగర్ నియోజకవర్గంలో హైదర్‌బస్తీ, న్యూబోయిగూడ, బీజేఆర్‌నగర్ ప్రాంతాలలో ఉన్న 60 జీహెచ్ఎంసీ సర్వీస్ క్వార్టర్స్‌ను రెగ్యులరైజ్ చేసేలా ప్రతిపాదనలను రూపొందించాలని, జీరా కాంపౌండ్‌లోని 134 ఇండ్ల రెగ్యులరై జేషన్‌కు 816జీవోకు కొనసాగింపుగా మరో నూతన ఉత్తర్వులు జారీ చేసేందు కు ప్రతిపాదనలను రూపొందించాలని రెవెన్యూశాఖ ప్రత్యేక కార్యదర్శి రాజేశ్ తివారి, కలెక్టర్ యోగితారాణాలను మంత్రి ఆదేశించారు. ఆదయ్యనగర్, రాంగోపాల్‌పేట, న్యూబోయగూడలలో ఉన్నట్లువంటి 637 ఇండ్లును జీవో 58, 59ల ప్రకారం ఫ్రీ హోల్డ్ చేయాలని సూచించారు. వాటితో పాటు ఇతర ప్రాంతాల్లోని స్థల వివాదాలను పరిష్కరించి పేదలకు న్యాయం చేయాలన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా అధ్వానంగా రోడ్లు

- శాసనసభలో విపక్ష సభ్యుల ఆందోళన

హైదరాబాద్, మార్చి 22(మనం ప్రతినిధి) : రాష్ట్రంలో గ్రామీణ, మండల, జిల్లా స్థాయి రోడ్లు అధ్వాన్నంగా ఉన్నాయని శుక్రవారం నాడు శాసన సభలో అన్ని పార్టీల సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. రోడ్ల మంజూరి కోసం నెలల తరబడి మంత్రి, అధికారుల చుట్టూ తిరగాల్సి వస్తుందని వారు విమర్శించారు. ప్రశ్నోత్తరాల సమయంలో అధికార పార్టీ సభ్యుడు సోలిపేట రామలింగారెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం చెప్పిన సందర్భంలో పలువురు సభ్యులు రోడ్ల దుస్థితిపై ప్రభుత్వం దృష్టికి తీసుకు వచ్చారు. రోడ్ల విషయంలో తాను కూడా సమస్య ఎదుర్కొంటున్నానని, సభ లో చాలా మంది సభ్యులు ఆందోళనగా ఉన్నారని, అందు వల్ల దీనిపై ఆలోచించి సమాధానం చెప్పాలని మంత్రి జూపల్లి కృష్ణారావును స్పీకర్ మధుసూధనాచారి ఆదేశించారు. బీటీ రోడ్డు వేసిన తరువాత ఐదు సంవత్సరాల తరువాత తనిఖీ చేసి నివేదిక ఆధారంగా రెన్యువల్స్ కోసం ఎంపిక చేస్తామని పంచాయితీ రాజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు చెప్పారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఈ మూడున్నర సంవత్సరాల్లో 416 కోట్లతో 14980 కి.మీ. రోడ్లను బీటి రోడ్లుగా మార్చినట్లు మంత్రి చెప్పారు.

మనం

జనం కోసం.. అక్షర యజ్ఞం..

శుక్రవారం, మార్చి 23

మోసుల్ మారణకాండ

ఇరాక్‌లోని మోసుల్‌లో నాలుగేళ్ళ క్రితం ఐసిస్ ఉగ్రవాదులు అపహరించిన 39 మంది భారతీయ వలస శ్రామికులు ఆ కిరాతకుల చేతుల్లో ప్రాణాలు కోల్పోయారన్న వార్త యావత్ దేశాన్ని నిర్ఘాంతపరచింది. పంజాబ్, బిహార్, హిమాచల్‌ప్రదేశ్, పశ్చిమబెంగాల్‌లకు చెందిన ఈ కార్మికులను కాల్చి చంపి మోసుల్‌కు చేరువలోని బదోష్ గ్రామ సమీపంలో పూడ్చి పెట్టినట్టు రాజ్యసభలో సుష్మాస్వరాజ్ చేసిన ప్రకటన కేంద్రప్రభుత్వ క్షమించరాని నిర్లక్ష్యానికి ప్రబల సాక్ష్యంగా నిలుస్తుంది. బందీలు ఎవరూ మరణించలేదని ఇంతవరకూ చెబుతున్న దానికి భిన్నంగా ఒక్కసారిగా వాళ్ళందరినీ ఉగ్రవాదులు వధించారని కేంద్రం ప్రకటించడం బాధిత కుటుంబాల గుండెల్లో చిచ్చురగిల్చింది. బాధిత కుటుంబాలు పాలకుల కాళ్లావేళ్లాపడి, కన్నీటితో అభ్యర్థించినా వారి ఆచూకీ కోసం కేంద్రం చిత్తశుద్ధితో ప్రయత్నించినట్లు కనబడడం లేదు. సుదీర్ఘమైన అధికారిక ప్రక్రియలు ఉన్నప్పటికీ అంతర్జాతీయ పలుకుబడి ఉపయోగించి బందీలు బతికున్నారా లేరా అనే విషయాన్ని తెల్చుకోవడం ప్రభుత్వానికి పెద్ద పనేమీ కాదు. ఈ కార్మికుల మరణాలను బహిర్గతం చేయడంలో ప్రభుత్వం ఇన్నాళ్లూ చట్టసభలను, దేశ ప్రజలను తప్పుదోవ పట్టించడం క్షమించరానిది.


బాధిత కుటుంబాలు పాలకుల వద్ద ఎన్నిసార్లు మొత్తుకున్నా వారిని పట్టించుకున్న నాథుడే లేకపోగా, బందీలు బతికివుండే అవకాశం లేదన్న అనుమానాలు అనేక వర్గాల నుంచి అందుతున్నా సర్కారులో చలనం లేదు. ఆ తర్వాత జూలైలో భారత పాత్రికేయబృందం మోసుల్‌ను సందర్శించి కిడ్నాప్‌నకు గురైన వారెవ్వరూ బతికి ఉండే అకాశం లేదని ధ్రువీకరించినా ప్రభుత్వం స్పందించలేదు. మోసుల్‌లోని ఉగ్రవాదుల చెర నుంచి తప్పించుకొని తిరిగి వచ్చిన హరిజిత్ మాసీ అనే కార్మికుడు మూడేళ్ళ క్రితమే బందీలను ఉగ్రవాదులు కాల్చిచంపారని చెప్పినా ప్రభుత్వం పట్టించుకోలేదు. పైగా అతడ్ని 9 నెలల పాటు భారత గూఢచారి సంస్థ– రీసెర్చ్ అండ్ అనాలిసిస్ వింగ్ (రా) రక్షణ కల్పిస్తున్న సాకుపై 9 నెలల పాటు అక్రమంగా నిర్బంధించి కేసులు పెట్టింది. పాత్రికేయుల బృందం నివేదిక తర్వాత కూడా అందరూ బతికే ఉన్నారంటూ లోక్‌సభలో కేంద్రం ప్రకటించడం దారుణం. ఐసిస్ చేతిలో బందీలుగా ఉన్న 46 మంది నర్సులను విడిపించడం, అంతర్యుద్ధంలో అతలాకుతలమైన యెమన్‌లో చిక్కుకున్న భారతీయలను స్వదేశానికి రప్పించడం వంటి చర్యలను విజయవంతంగా నిర్వహించిన ప్రభుత్వం, రాష్ట్రాల ఎన్నికల తరుణలో మోసుల్ బందీల విషయంలో వైఫల్యం చెందడంతో చెడ్డపేరు తీసుకొస్తుందని భావించి సమాచారాన్ని, సాక్ష్యాధారాలను తొక్కి పెట్టడం ఘోరమైన విషయం. ఆప్తులను కోల్పోయిన బాధిత కు టుంబాలను ప్రభుత్వం అన్నివిధాల ఆదుకోవాలి! సాధ్యమైనంత త్వరగా మృత దేహాలను దేశానికి తీసుకువచ్చి అంతిమ సంస్కారాలకు అవకాశం కల్పించడమే కాక, దేశ ప్రజలకు జరిగిన ఉదంతంపై ప్రభుత్వం సమాధానం చెప్పాలి.

డేటా దోపిడి

సమాచారమే సంపదగా చలామణి అవుతున్న యుగంలో కొత్తపుంతలు తొక్కుతున్న స్కాంలను అదుపు చేయడం సవాలుగా మారింది. ఆధార్‌తో పౌరుల వ్యక్తిగత సమాచారం చోరీకి గురయ్యే ప్రమాదం ఉందన్న వివాదం సర్వోన్నత న్యాయస్థానంలో ఇప్పటికీ తేలకుండా కొనసాగుతున్న తరుణంలోనే ఫేస్‌బుక్ వంటి సామాజిక మాధ్యమాల నిర్వాకం ఆందోళన కలిగిస్తోంది. అమెరికా, బ్రిటన్ ఎన్నికల సమయంలో వినియోగదారులను ప్రభావితం చేసేందుకు వారి సమాచారాన్ని ఫేస్‌బుక్‌తో అనుబంధంలో ఉన్న 'కేంబ్రిడ్జ్ అనలిటికా' (సిఎ) అనే రాజకీయ కన్సెల్టెన్సీ సంస్థ దొంగిలించిందన్న నివేదికలు తాజాగా వెలుగులోకి వచ్చాయి. ఈ నేపథ్యంలో కేంద్ర ఐటీ, న్యాయ శాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ వేగంగా స్పందించారు. భారతీయుల సమాచారం దోపిడీ చేసినట్లు ఏ మాత్రం బయటపడినా ఫేస్‌బుక్ సీఈఓ మార్క్ జూకర్‌బెర్గ్‌ను దేశీయ కోర్టులో బోనెక్కించడం సహా కఠిన చర్యలు తీసుకుంటామని రవిశంకర్ ప్రసాద్ సంచలన ప్రకటన చేశారు. అదే సందర్భంలో మాట్లాడుతూ సిఎతో ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ పార్టీ సుదీర్ఘకాలంగా సంబంధాలు కొనసాగిస్తోందని ఆయన ఆరోపించారు. అయితే 2014 సహా ఇటీవల బిహార్‌లో ఎన్డీఏ భాగస్వామ్య పక్షమైన జనతాదళ్ (యునైటెడ్) పార్టీ, బీజేపీలకు ఆ డేటా సంస్థతో సంబంధాలున్న విషయం జగమెరిగిన సత్యమేనని దీనిపై ఎన్నికల కమిషన్ ద్వారా సమగ్ర దర్యాప్తు జరిపించాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోంది. సిఎ సహాయాన్ని భారత్‌లో ఏఏ రాజకీయ పార్టీలు స్వీకరించాయో నిగ్గుతేల్చి ఎన్నికల కమిషన్ వాటిపై తగు చర్యలు తీసుకుంటే మంచిదే.

బ్రిటన్‌కు చెందిన సిఎ సంస్థ దాదాపు 5 కోట్లకు మందికి పైగా ఫేస్‌బుక్ వినియోగదారుల సమాచారాన్ని వారి అనుమతి లేకుండానే వివిధ దేశాలలో ఆయా పార్టీల రాజకీయ ప్రయోజనాల కోసం వినియోగించినట్లు నివేదికలు బహిర్గతమయ్యాయి. 20 కోట్ల మంది భారతీయులు ఫేస్‌బుక్‌ను వినియోగిస్తున్నారు. అదే సమయంలో సిఎ సంస్థ భారత్‌లో రాజకీయ పార్టీలతో కలసి పనిచేసినట్లు ఆ సంస్థ వెబ్‌సైట్ పేర్కొంది. సిఎ మాతృసంస్థ స్ట్రాటజిక్ కమ్యూనికేషన్స్ లేబరేటరీస్ (ఎస్‌సిఎల్) ఇండియాతో కలసి భారత్‌లో రాజకీయ ప్రచార నిర్వహణ విషయంపై పనిచేస్తున్నట్లుగా 'ఒవ్‌లెనో బిజినెస్ ఇంటిలిజెన్స్' (ఒబిఐ) సంస్థ తన వెబ్‌సైట్‌లో ప్రకటించింది. ఒబిఐ తన ఖాతాదారుల జాబితాలో బీజేపీ, కాంగ్రెస్, జేడీ(యు) వంటి రాజకీయ పార్టీలతోపాటు ఐసిఐసిఐ బ్యాంక్, ఎయిర్‌టెల్ వంటి సంస్థల పేర్లను కూడా వెల్లడించింది. అయితే ఎన్నికల మేనేజ్‌మెంట్ వ్యవహారాల్లో దేశంలోని ప్రధాన రాజకీయ పార్టీలన్నీ ఇలాంటి రాజకీయ కన్సెల్టెన్సీల సేవలు కొనుగోలు చేస్తున్న విషయం విదితమే.

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం మూలంగా ఒక వ్యక్తి ఇష్టాయిష్టాలతో సంబంధం లేకుండానే, వారికి తెలియకుండానే వారి సమాచారమంతా ఇతరుల చేతికి చేరే ప్రమాదం ఏర్పడింది. వినియోగదారుల చిట్టాను సేకరించడం ద్వారా వ్యాపార సంస్థలు మార్కెటింగ్ వ్యూహాలను రూపొందించుకోవచ్చు, ప్రభుత్వాలు వ్యక్తుల హక్కులను హరించవచ్చు, ప్రత్యర్థులను ఇబ్బంది పెట్టవచ్చని చాలాకాలంగా ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఆధార్ అనుసంధానంపై అందుకే సర్వోన్నత న్యాయస్థానం పౌరుల వ్యక్తిగత సమాచార భద్రతకు సంబంధించి ఎలాంటి చర్యలు తీసుకోబోతోందనే అంశంపై కేంద్రం ఒక సమగ్ర అఫిడవిట్‌ను సమర్పించాలని ఆదేశించింది. ఇదే తీరులో జాతీయ, అంతర్జాతీయ ఉగ్రవాద సంస్థల చేతిలోకి ఈ డేటా వెళితే దేశ అంతరంగిక, సరిహద్దు భద్రతలు ప్రమాదంలో పడతాయి. ఇప్పటికే అంతర్జాతీయంగా భారత్‌ను దెబ్బకొట్టాలని చూస్తున్న సామ్రాజ్యవాదిగా మారిన చైనా మన సమాచారాన్ని హాక్‌చేసి ప్రచ్ఛన్న సైబర్ వార్ చేస్తోంది. అలాంటిది ఈ దేశ ప్రధాన రాజకీయ పార్టీలు అలవోకగా విదేశీ సంస్థలకు మన దేశ పౌరల సమాచారాన్ని అప్పచెప్పేందుకు సహకరించడం క్షమించరాని నేరం. ప్రజలను ఆయా వర్గాలుగా గుర్తించి, నిర్దిష్ట సమూహాలను లక్ష్యంగా పెట్టుకొని ఏ రోటి కాడ ఆ పాటలాగా ప్రచారం ద్వారా ప్రభావితం చేయడం ప్రజాస్వామ్యాన్ని భ్రష్టుపట్టించడమే. ప్రజాభిప్రాయం రూపొందించడం కూడా సామాజిక బాధ్యతగా కాక ఒక కార్పొరేట్ వ్యాపారంగా మారితే ప్రజల బతుకులు బుగ్గిపాలైనట్లే. అమెరికాలో ట్రంప్ గెలుపునకు రష్యా తెర చాటు తోడ్పాటు అందించిందనే ఆరోపణలున్నాయి. దీన్నిబట్టి చూస్తే ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అర్హులైన అభ్యర్థులు కాకుండా, కుట్రదారులు ఎన్నికలలో పై చేయి సాధించవచ్చు లేదా పొరుగున చైనా వంటి దేశాలు ఎన్నికల్లో ప్రజాతీర్పును ప్రభావితం చేసి మనదేశ ప్రయోజనాలు దెబ్బతీయొచ్చు. ఇప్పటికే దేశంలో వివిధ చోట్ల వరుసగా శాసనసభా ఎన్నికల్లో పోలింగ్ మిషన్లు ట్యాంపరింగ్ అయినట్లు ఆరోపణల వచ్చిన నేపథ్యంలో ఈసీ ఎన్నికల నిర్వహణ సామర్థ్యంపై అనేక సందేహాలు వస్తున్నాయి. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్నందున డేటా పరిరక్షణకు నిర్దిష్టమైన చర్యలు చేపట్టేందుకు స్వయం ప్రతిపత్తిగల రాజ్యాంగ కమిటీని ఏర్పాటు చేసి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలి.



మంచిమాట



'శత్రువు నీకన్నా బలవంతుడని భావించిన మరుక్షణం నీ పతనం ప్రారంభమైనట్లే.'

- భగత్‌సింగ్

'హిందీ బెల్ట్' ప్రశ్నార్థకం


పాతికేళ్లుగా సీపీయం అధికారంలో ఉన్న త్రిపురలో అంతకుముందు ఒక్క స్థానంలో కూడా గెలువని పరిస్థితులలో ఏకంగా మూడింట రెండు వంతుల ఆధిక్యతతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం దేశ వ్యాప్తంగా బీజేపీకి కార్యకర్తలలోనే కాకుండా ఆ పార్టీకి అండగా ఉంటున్న 'సంఘ్ పరివార్'లో అనూహ్యమైన సంబురాలు కలిగించింది. ఆ నిషా దిగిపోక ముందే ఉత్తరప్రదేశ్, బిహార్ ఉపఎన్నికలలో ఎదురైన ఘోర పరాజయాలు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాజకీయ భవిష్యత్‌ను ప్రశ్నార్థకం చేస్తున్నాయి.

ఇప్పటివరకు మోదీ ప్రజాభిమానాన్ని సవాల్ చేయగల నాయకుడు గానీ, రాజకీయపక్షంగానే దేశంలో లేదని అందరూ భావించారు. అయితే ప్రజలు ఈ ప్రభుత్వంపై తిరుగుబాటుకు సిద్ధంగా ఉన్నారని ఈ ఉపఎన్నికలు స్పష్టం చేస్తున్నాయి. బీజేపీని ఓడించగల సత్తా ఉన్నవారు ఆ విశ్వాసాన్ని కలిగిస్తే వారికి ప్రజలు మద్దతు ఇచ్చే అవకాశాలున్నాయని ఈ ఫలితాలు చెబుతున్నాయి. పార్టీకి ఇంతకుముందు ప్రాతినిధ్యం లేని ప్రాంతాలలో బీజేపీని విస్తరింప చేయడంలో, ఇతర పార్టీల నుంచి ఫిరాయింపులను ప్రోత్సహించి పార్టీని బలమైనశక్తిగా చేయడంలో ఘనమైన విజయాలు సాధించగలుగుతున్నారు. పార్టీ అధికారంలో ఉన్న చోట్ల ప్రజలను ఆకట్టుకోవడంలో మాత్రం విఫలం అవుతున్నారని స్పష్టం అవుతున్నది. అందుకనే ఇప్పుడు 21 రాష్ట్రాలలో బీజేపీ అధికారంలో ఉన్నప్పటికీ 2019 ఎన్నికలు ఆ పార్టీకి విషమపరీక్షగా మారనున్నట్లు అర్థం అవుతున్నది.

2014లో బీజేపీకి లోక్‌సభలో సొంతంగా ఆధిక్యతను సాధించి, మోదీ ప్రధానిగా పదవి చేపట్టడానికి 'హిందీబెల్ట్'గా పేరొందే పెద్ద రాష్ట్రాలలో 90 శాతం మేర సీట్లను గెల్చుకోవడం, ఆయా రాష్ట్రాలలో రాష్ట్ర ప్రభుత్వాలను ఏర్పాటు చేయడం ప్రధాన కారణమని మరువలేము. ఇప్పుడు బీజేపీ ఆ రాష్ట్రాలలో కోలుకోలేని దెబ్బలు తినబోతున్నట్లు వరుసగా రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, బిహార్ ఉప ఎన్నికల ఫలితాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ నష్టాన్ని దక్షిణాదిన పూడ్చుకునే పరిస్థితులు కనబడటం లేదు. ఈశాన్యంలో 8 రాష్ట్రాలలో ఏడుచోట్ల ప్రభుత్వాలను ఏర్పాటు చేసినా వాటిలో మొత్తం సీట్లు 25 మాత్రమే. బీజేపీతో సంబంధాలు టీడీపీ తెంచుకున్న నేపథ్యంలో ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే 25 సీట్లు ఉండటం గమనార్హం.

వాస్తవానికి మోదీ ప్రజాకర్షణకు గండిపడినట్లు గుజరాత్ ఎన్నికల సమయంలోనే బీజేపీ గ్రహించింది. అందుకనే ఆయనకు బదులు ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌ను ప్రజలను ఆకర్షించే నాయకుడిగా భావిస్తూ వస్తున్నారు. ఆయనను కర్ణాటక, ఇతర రాష్ట్రాలలో ఎన్నికల ప్రచారంలో విస్తృతంగా తిప్పుతున్నారు. కానీ ఇప్పుడు ఆదిత్యనాథ్ స్వస్థలం గోరఖపూర్‌లో ఆయన రాజీనామా చేసిన స్థానంలో పరాజయం బీజేపీకి కోలుకోలేని దెబ్బ అని చెప్పవచ్చు. 2014లో వచ్చిన 3.3 లక్షల ఓట్ల ఆధిక్యతను కాపాడుకొనేందుకు యోగి విస్తృతంగా ప్రచారం చేశారు తప్ప, ఓటమి ఎదురవుతుందని ఊహించలేదు. ఇక్కడ యోగి ఐదుసార్లు గెలుపొందారు. అంతకు ముందు మూడుసార్లు ఆయన 'గురువు' గెలిచారు.

1989 నుంచి ఇక్కడ బీజేపీ గెలుస్తూ వస్తున్నది. అటువంటి చోట పరాజయం ఎదురుకావడం రాజకీయంగా కోలుకోలేని ప్రతికూల అంశంగానే చూడవలసి ఉంటుంది. మరోవంక ఉప ముఖ్యమంత్రి కేశవ్ ప్రసాద్ మౌర్య ఖాళీచేసిన ఫుల్పూర్‌లో సమాజ్వాదీ పార్టీ అభ్యర్థి 59 వేలకు పైగా ఆధిక్యతతో గెలుపొందారు. రాజకీయంగా బద్ధ శత్రువులైన సమాజ్వాదీ పార్టీ, బహుజన సమాజ్ పార్టీలు ఒకటి కావడంతో, సామాజిక సమీకరణాలు మారి బీజేపీ ఓడినా, 2019లో వీరిద్దరూ కలిసే అవకాశం లేదంటూ తమ వైఫల్యాలను బీజేపీ కప్పిపుచ్చుకొనే ప్రయత్నం చేసున్నది. అయితే గత సంవత్సరం జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో సమాజ్వాదీ పార్టీ, కాంగ్రెస్‌లు పొత్తు ఏర్పాటు చేసుకున్నా వారికి మద్దతు ఇస్తున్న సామాజిక వర్గాలు కలవలేదు. దానితో పరోక్షంగా బీజేపీ విజయాలకు దోహదపడింది. అంటే ప్రజలు ఇప్పుడు బీజేపీని ఓడించే వారికోసం ఎదురు చూస్తున్నట్లు అర్థమవుతుంది.



బీజేపీకి అండగా ఉంటున్న మధ్య తరగతి ప్రజలు ఉన్న పట్టణ ప్రాంతాలలో ఓటింగ్ చాల తక్కువగా జరగడం గమనిస్తే వారిలో బీజేపీపై నిర్లిప్తత చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. ఓటింగ్ ఎక్కువగా జరిగిన గ్రామీణ ప్రాంతాలలో రైతులు, బలహీనవర్గాలు పట్టుబట్టి బీజేపీకి వ్యతిరేకంగా ఓట్లువేయడం కనిపిస్తున్నది.

ఇటీవల మహారాష్ట్రలో రైతుల 'లాంగ్‌మార్చ్' రైతులలో మోదీపాలన పట్ల పెరుగుతున్న అసహనాన్ని వెల్లడి చేస్తున్నది. ప్రజలలో భావోద్రేకాలు రెచ్చగొట్టి, ఆకర్షణీయ పథకాలు, కార్యక్రమాలు ప్రకటించి ఎక్కువకాలం మభ్య పెట్టలేరని, ప్రాథమిక సమస్యల పరిష్కారం దిశగా చూడాలని తెలుసుకోవాలి.

నిరుద్యోగం, వ్యవసాయ సంక్షోభం, ధరల పెరుగుదల వంటి మౌలిక సమస్యలపై దృష్టి సారించాలి. జన్‌ధన్ యోజన, పెద్దనోట్ల రద్దు, జీఎస్‌టీ వంటి ఎంతో ప్రచారం చేసుకొంటున్న కార్యక్రమాలు సామాన్య జీవితాలను మెరుగు పరచడం కోసం ఏ మేరకు ఉపయోగపడ్డాయో గ్రహించాలి. సుపరిపాలన అందించడంలో, ఎన్నికల సమయంలో చేసిన హామీలను అమలు చేయడంలో నరేంద్ర మోదీ వైఫల్యాల పట్ల ప్రజలు ఆగ్రహం పెంచుకుంటున్నారు. మరోవంక ప్రతిపక్షాలు కూడా తగు గుణపాఠం నేర్చుకోవడంలో విఫలమవుతున్నాయి. ముఖ్యంగా కాంగ్రెస్ బలమైన ప్రాంతీయ పక్షాలు ఉన్న చోట్ల ఎదగలేమని గ్రహించాలి. జాతీయస్థాయిలో విశాలమైన రాజకీయ కూటమి ఏర్పాటు చేయడానికి ప్రాంతీయ పక్షాల విశ్వాసం పొందే ప్రయత్నం చేయాలి. తన నాయకత్వాన్ని బలవంతంగా రుద్దే ప్రయత్నం చేయరాదు. భావస్వామ్య పక్షాల పట్ల మోదీ అనుసరిస్తున్న వైఖరితో వారిలో తీవ్ర వ్యతిరేకతకు దారితీస్తోంది. ఎన్డీయేలో బీజేపీ తర్వాత ఎక్కువగా యంపీలు గల శివసేన, తెలుగుదేశం ఇప్పుడు ఆ పార్టీకి దూరం అవుతున్నాయి. 'ఎస్పీ–బీఎస్పీ చేతులు కలపడం వల్లే ఈ ఫలితాలు వచ్చాయని నేను భావించడం లేదు. శ్రీరాముడిని అవమానించిన ఎస్పీ నాయకుడికి మీరు ఎర్ర తివాచీ పరిచిన రోజే... దేవుడు మీ నుంచి ముఖం తిప్పుకున్నాడు...'అంటూ శివసేన సీనియర్ నాయకుడు సంజయ్ రావత్ బీజేపీ అనుసరిస్తున్న 'ఫిరాయింపు రాజకీయలు'ను అవహేళన చేశారు. తెలుగుదేశం ఇప్పటికే కేంద్ర మంత్రివర్గం నుంచి వైదొలగి ఎన్డీఏకు కూడా రాంరాం చెప్పింది. కేరళలో ఉన్న బీజేపీకి ఏకైక మిత్రపక్షం భారత్ ధర్మ జనసేన(బీడీజేఎస్) కూడా ఆ పార్టీకి దూరంగా జరుగు తోంది. ఈ ఫలితాలను బీజేపీకి దేశ ప్రజలు చరమ గీతం పాడటానికి నాందిగా పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అభివర్ణించారు. ఈ ఫలితాలు రావడానికి ముందురాత్రి యుపీఏ అధినేత్రి సోనియాగాంధీ ఇచ్చిన విందుకు 20 పార్టీల నాయకులు హాజరు కావడం గమనార్హం.


ఉత్తరప్రదేశ్‌లో ఎస్పీ, బీఎస్పీ మధ్య అవగాహన ఏర్పాటు చేసుకోగలిగితే 2019 ఎన్నికల ఫలితాలు విచిత్రమైన మలుపు తిరిగే అవకాశం ఉంది. 2014లో బీజేపీకి 71 సీట్లు గెలుచుకోగా, ఆ పార్టీ మిత్రపక్షం మరో 2 సీట్లు గెలుచుకొంది. కానీ ఎస్పీ, బీఎస్పీ చేతులు కలిపితే ప్రస్తుత ఉపఎన్నికల ఫలితాల సరళిని బట్టి చూస్తే ఎస్పీ 26, బీఎస్పీ 25, బీజేపీకి 23, కాంగ్రెస్ 5 సీట్లలో గెలిచే అవకాశం ఉన్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. ఇదే నిజమైతే మోదీ నాయకత్వానికి అంతిమ ఘడియలుగానే భావించవలసి ఉంటుంది. ఒకవంక ప్రజలలో వ్యతిరేకతను ఎదుర్కొంటున్న మోదీ, అమిత్‌షాలు సొంతపార్టీలోనే తీవ్రమైన అసంతృప్తికి కారకులవుతున్నారు. దానితో వచ్చే ఎన్నికలలో 'అసలైన ఉత్సాహంతో ఏ మాత్రం పనిచేస్తారని ప్రశ్న తలెత్తుతోంది. మోదీ మంత్రివర్గంలో కీలక పదవులు నిర్వహిస్తున్న వారిలో అత్యధికులు ప్రజల నుంచి వచ్చినవారు కాదు. ఎక్కువగా మీడియాలో కనిపించేవారు. తాజాగా రాజ్యసభకు పంపిన వారెవ్వరూ తమ సొంత రాష్ట్రంలో ప్రజలలో తగు ప్రభావం చూపగలిగేవారు కాదు. ప్రత్యక్ష ఎన్నికలలో పోటీచేయగల సాహసం వారిలో అత్యధికులకు లేదు. అటువంటి వారివల్ల మీడియాలో ప్రచారానికి ఉపయోగపడినా వారెవరూ పార్టీకి పది ఓట్లు తీసుకు రాగల సామర్థ్యం ఉన్నవారు కాదు. సొంతపార్టీలో ప్రజాబలం గల నాయకులయితే తమ వైఫల్యాలను ప్రశ్నిస్తారని మోదీ, అమిత్ షా భయపడుతున్నట్లు భావించవలసి వస్తోంది. గతంలో ఎల్ కె అద్వానీ సహితం ఈ విధంగా భజనపరులకు పెద్దపీట వేయడం ద్వారా పార్టీ భవిష్యత్‌ను అంధకారం చేయడమే కాకుండా తమ రాజకీయ భవిష్యత్‌ను సమాధి చేసుకోవడం గమనించాలి. ఈ ఫలితాలు కేవలం బీజేపీ నాయకత్వానికి మాత్రమే కాకుండా అదే ధోరణి ప్రదర్శిస్తున్న దాదాపుగా అన్ని పార్టీలకు గుణపాఠం కావాలి.

> **సొంతపార్టీలో ప్రజాబలం గల నాయకులైతే తమ వైఫల్యాలను ప్రశ్నిస్తారని మోదీ, అమిత్ షా భయపడుతున్నట్లు భావించవలసి వస్తోంది. గతంలో ఎల్ కె అద్వానీ సహితం ఈ విధంగా భజనపరులకు పెద్దపీట వేయడం ద్వారా పార్టీ భవిష్యత్‌ను అంధకారం చేయడమే కాకుండా తమ రాజకీయ భవిష్యత్‌ను సమాధి చేసుకోవడం గమనించాలి. ఈ ఫలితాలు కేవలం బీజేపీ నాయకత్వానికి మాత్రమే కాకుండా అదే ధోరణి ప్రదర్శిస్తున్న దాదాపుగా అన్ని పార్టీలకు గుణపాఠం కావాలి.**

● చలసాని నరేంద్ర

ఉరికి వెరవని వీరులు

అయాచిత భద్రజీవిత కలశాన్ని కాలదన్ని ముళ్ళ కిరీటాల్ని స్వచ్ఛందంగా ధరించిన వీరులు భగత్‌సింగ్, రాజగురు, సుఖ్‌దేవ్‌లు దేశ స్వాతంత్ర్య పోరాటంలో బ్రిటిష్ ప్రభుత్వ దమనకాండకు అమరులై నేటికి 87 సంవత్సరాలైంది. కచ్చితంగా ఉరిశిక్ష పడుతుందని తెలిసీ తప్పించుకునే అవకాశం ఉన్నా తమ ఆశయాల ప్రచారం కోసం విచారణను వినియోగించుకోవాలనే సంకల్పంతో పార్లమెంట్‌లో భగత్‌సింగ్, భటుకేశ్వరదత్ బాంబులు వేశారు. సైమన్ కమిషన్ రాకకు నిరసనకు నాయకత్వం వహించిన పంజాబ్ కేసరి లాలాలజపతి రాయ్‌పై బ్రిటిష్



పోలీసు అధికారులు స్కాట్, సాండర్స్ నాయకత్వంలో లాఠీఛార్జీ చేశారు. తీవ్రంగా గాయపడిన ఆయన 1928 నవంబర్ 17న మరణించారు. ఈ దురాగతానికి కారకుడైన సాండర్స్‌ని చంపాలని హెచ్.యస్.ఆర్.ఎ నిర్ణయించింది. 1928 డిసెంబర్ 17న భగత్‌సింగ్, రాజగురు, ఆజాద్, జయగోపాల్, సుఖ్‌దేవ్ ఆ పనిపూర్తిచేసి తప్పించుకున్నారు. 1929 ఏప్రిల్ 8న పార్లమెంటులో బాంబు విసిరిన ఘటనపై కావాలనే అరెస్టు అయ్యారు. పట్టుబడితే ప్రాణం పోతుందని తెలిసీ ఉద్యమ ప్రచారానికి కోర్టు విచారణను వేదికగా చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. ట్రేడ్ డిస్పూట్స్ బిల్లు, పబ్లిక్ సేఫ్టీ బిల్లు ప్రవేశపెట్టే రోజును ఎంచుకున్నారు. మనుషులకు గాయాలు కాకుండా కేవలం శబ్దం, పొగ వచ్చే బాంబుల్ని భగత్‌సింగ్, భటుకేశ్వరదత్తు సభ్యులెవరూ లేని ప్రదేశంలో విసిరారు. ఎందుకంటే ఆ సమయంలో మోతీలాల్ నెహ్రూ, మదన్‌మోహన్ మాలవ్యా, జిన్నా లాంటి నాయకులు సభలో వున్నారు. వారికి అపాయం జరగకూడదు. బాంబులు విసరటంతో గందరగోళం అలుముకున్న పార్లమెంటులో కరపత్రాల్ని విరజిమ్మారు.

సభాపతి సర్‌సుస్టర్‌ని భగత్‌సింగ్ కాల్చాడు గానీ బల్లకిందకు దూరి తప్పించుకున్నాడు. ఈ కేసుతో సాండర్స్ హత్యను కలిపి లాహోరు కుట్ర కేసు బనాయించారు. మిస్టరీగా మారిన సాండర్స్ హత్య కేసు భగత్‌సింగ్ దగ్గర దొరికిన ఫిస్టల్‌తో తేలిపోయింది. అదే ఆనాడు సాండర్స్‌ని హత్యచేసిన ఆయుధంగా నిర్ధారణ అయింది. పార్లమెంట్‌పై దాడి కేసులో యావజ్జీవం పడినా సాండర్స్‌ని హత్య చేసినందుకు ఉరిశిక్ష తప్పలేదు. తమకు క్షమాభిక్ష కోరుతూ తన తండ్రి కిషన్‌సింగ్ పెట్టిన దరఖాస్తుపై స్పందిస్తూ 'పితృహృదయం పడే బాధ అర్థం చేసుకో గలను. పుత్రవాత్సల్యంతో నాకు వెన్నుపోటు పొడి చారు. నా అభిప్రాయాలు తెల్సుకోకుండా నా తరపున ఆ పనిచేసే హక్కు మీకులేద'ని అన్నాడు. ఈ వీరులలో సుఖ్‌దేవ్ పంజాబ్‌లోని లూధియానాలో 1907 మే 15న జన్మించాడు. చనిపోయే నాటికి 24 ఏళ్లు. పూర్తిపేరు సుఖ్‌దేవ్ థాపర్, లాహోర్ నేషనల్ కాలేజీలో చదివాడు. రాజగురు పూర్తిపేరు శివరాం హరి రాజగురు. మహారాష్ట్రలోని పూనే సమీపంలోని ఖాదేలో 1908 ఆగస్టు 24న జన్మించాడు. చనిపోయే నాటికి వయస్సు 22 ఏళ్లు దాటాయి. తర్వాత కాలంలో రాజగురు పుట్టిన ఊరు పేరు రాజగురునగర్‌గా మార్చబడింది. అలాగే హర్యానాలోని హిసార్ మార్కెట్ ఏరియాకు రాజగురు మార్కెట్‌గా 1953లో పేరు పెట్టారు. 1907 సెప్టెంబర్ 28న పంజాబ్‌లోని లాయల్‌పూర్ జిల్లా బంగా గ్రామంలో కిషన్‌సింగ్, విద్యావతి దంపతులకు భగత్‌సింగ్ జన్మించిన సమయంలో కిషన్‌సింగ్‌తో పాటు అతని తమ్ముళ్ళు స్వర్ణసింగ్, అజిత్‌సింగ్‌లు స్వాతంత్ర్య పోరాటంలో జైల్లో వున్నారు. గ్రామంలో ప్రాథమిక విద్య పూర్తిచేసిన భగత్‌సింగ్ లాహోరులో ఉన్నత విద్య చదువుతూ స్వాతంత్ర్య ఉద్యమం పట్ల ఆకర్షింపబడ్డాడు. ఢిల్లీ చేరి అర్జున్, ప్రతాప్ తదితర పత్రికల్లో పనిచేశాడు. చివరకు హిందుస్థాన్ రిపబ్లికన్ ఆర్మీ సంస్థను స్థాపించాడు. మార్చి 24న ఉరిశిక్షకు సమయ నిర్ధారణ జరగ్గా ఆ విషయంలో దేశవ్యాప్తంగా ఉన్న ఉద్రిక్తతను, యువతలో చెలరేగుతున్న ఆవేశాన్ని చూసి భయపడ్డ తెల్ల పాలకులు ముందురోజు రాత్రే ఆ పని పూర్తిచేశారు. సూర్యాస్తమయం తర్వాత, సూర్యోదయానికి ముందు ఉరితీయటం నిషిద్ధం, మనదేశ చరిత్రలో మొదటి, చివరి రాత్రిపూట అమలు పరిచిన ఒకే ఒక్క ఉరిశిక్ష ఇదే. అంతేగాక జైలు ప్రధాన ద్వారం గుండా కాక జైలు వెనుక గోడ బద్దలు కొట్టించి వారి భౌతికకాయాలను రహస్యంగా బయటకు తీసు కెళ్లారు. లాహోరుకు చాలా దూరంలోని ఫిరోజ్‌పూర్ జిల్లాలోని హుస్సేనివాలా సమీపంలో సట్లేజ్ నది ఒడ్డున పార్థివదేహాలను దహనం చేశారు. ఉరి తీసిన జైలు ప్రాంతంలో మార్కెట్ వెలిసింది. ఆ ప్రాంతానికి షహీద్ చౌక్ అని పేరు పెట్టారు. ఈ మహావీరుల్ని దహనం చేసిన హుస్సేనివాలా ప్రాంతాన్ని 12 గ్రామాలు ఇవ్వటం ద్వారా 1961లో పాకిస్థాన్‌తో మార్పిడి చేసుకున్నారు. ఏ పార్లమెంటులో భగత్‌సింగ్ బాంబులేశాడని శిక్ష అరెస్టువేశారో ఆ పార్లమెంటు భవనంలో 2008 ఆగస్టు 15న 18 అడుగుల భగత్‌సింగ్ కాంశ్య విగ్రహాన్ని ఆవిష్కరించారు.

● చెరుకూరి సత్యనారాయణ

(భగత్‌సింగ్, రాజగురు, సుఖ్‌దేవ్‌ల 87వ వర్ధంతి)

మన లేఖలు

హాకింగ్‌కు నివాళి

అరుదైన వ్యాధితో రెండేళ్లలో మరణించవలసినవాడు నమ్మశక్యం గాని విధంగా 53 ఏళ్ల పాటు జీవించారు. వీల్‌చైర్‌లోనే ఇన్నేళ్లూ వుంటూ ఆ వ్యాధినే భయపెట్టేలా కేవలం చెంపకండరాల సాయంతో సంజ్ఞల ఆధారంగానే పరిశోధనలకు రూపం ఇచ్చారు. మానవ జాతి విజయంగా గర్వపడేలా 'కాలంచరిత్ర' అనే పరిశోధనను దాదాపు శరీరం పనిచేయని స్థితిలోనే మనకు అందించారు. మనుషులు తప్పిదాల వల్లే రాబోవు 100 సంవత్సరాలలో ఈ భూమి మనకు నివాసయోగ్యం కాకుండా మారిపోవచ్చు అని ప్రకటించిన ప్రముఖ కాస్మాలజిస్ట్ హాకింగ్స్‌కు నివాళులు.

- యింద్రవెల్లి రమేష్

కాంగ్రెస్ లేని కూటమి ప్రయోజనం శూన్యం

జాతీయ రాజకీయాల్లో తృతీయ కూటమి ఆలోచనకు తెలంగాణ ముఖ్యమంత్రి కెసీఆర్ మరోసారి తెర లేపారు. దేశరాజకీయాల్లో గుణాత్మక మార్పు తెస్తానంటూ తృతీయ కూటమి ఆలోచనను బయటపెట్టి భవిష్యత్తు ప్రణాళికకు పావులు కదుపుతున్నారు. ఇప్పటికే పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీతో చర్చలు జరిపారు. కేంద్ర లోని మోదీ ప్రభుత్వం రాష్ట్రాలపై పెత్తనం చలాయించడాన్ని ప్రాంతీయ పార్టీలు, బీజేపీయేతర పాలిత పార్టీలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ఇక్కడ ఒక్క విషయాన్ని గమనంలోకి తీసుకోవాల్సి ఉంది. బీజేపీకి అధికారం దక్కకూడదనుకుంటే కాంగ్రెస్‌తో రాజీపడక తప్పదు.

- యండి ఉస్మాన్‌ఖాన్, సీనియర్ జర్నలిస్టు

మనం
కుటుంబం
శుక్రవారం, 23 మార్చి 2018
www.manamnews.com



ఉస్మానియా యూనివర్సిటీలో మూడు రోజుల పాటు సాగే జాతీయ టెక్నో కల్చరల్ ఫెస్ట్, టెక్నో ఉస్మానియా-2కే18 'మనం' దినపత్రిక ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభమైంది. ''రీసెంట్ ట్రెండ్ ఇన్ ప్రాసెస్ ఇండస్ట్రీస్'' అనే అంశంపై మార్చి 22 నుంచి 24వ తేదీ వరకు పలు కార్యక్రమాలు జరుగుతున్నాయి. యంగ్ ఇంజినీర్లలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడానికి సహకరించేలా పూర్వ విద్యార్థుల, పారిశ్రామిక వేత్తల, పరిశోధనా సంస్థల విజ్ఞానాన్ని కల్పించేలా ఈ కార్యక్రమాన్ని రూపొందించడం విశేషం. వివిధ విభాగాల విద్యార్థులు తమ పరిశోధనా పత్రాల పోస్టర్ ప్రజెంటేషన్స్, టెక్నికల్ క్విజ్, వర్క్‌షాప్స్‌తో పాటు రోజూ సాయంత్రం కన్నుల విందుగా సాంస్కృతిక కార్యక్రమాలతో ఆహుతులను అలరిస్తున్నారు. కాలేజ్ ప్రిన్సిపల్ ఆచార్య శ్యాంసుందర్ అధ్యక్షతన జరుగుతున్న 'టెక్నో ఉస్మానియా'ను కన్వీనర్ ఆచార్య గింతుగ ప్రభాకర్ రెడ్డి ప్రారంభించారు.



ధూంధాంగా టెక్నో ఫెస్ట్

ఇన్ ఫాబ్ ఇండస్ట్రీస్ డైరెక్టర్ జీవీ సేతురామన్ టెక్నో ఉస్మానియా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై.. 'మనం' చొరవతో సాగుతున్న అవయవ దాన యజ్ఞం అత్యంత పవిత్రమైనదని కొనియాడారు. అవయవదానంపై అవగాహన కోసం నిర్వహించిన 3కే రన్ కార్యక్రమం వంటివి పెద్ద ఎత్తున నిర్వహించడంతో మరణించిన తరువాత కూడా ఎంతోమందికి ప్రాణం పోయవచ్చని సేతురామన్ పేర్కొన్నారు. కాలేజీల్లో నిర్వహించే ఈ తరహా కార్యక్రమాలతో స్టూడెంట్స్‌లో ఉన్న నాయకత్వ లక్షణాలకు మంచి వేదిక లభిస్తుందని, కళాశాలల్లో నేర్చుకునే పలు ప్రాథమిక అంశాలు భవిష్యత్‌కు మంచి దిశా నిర్దేశం చేస్తాయని కూడా ఆయన అన్నారు. హర్షాభోగ్లే వంటి ప్రముఖులు ఈ కాలేజీ పూర్వ విద్యార్థులేనని, ఇటువంటి వారి సక్సెస్ స్టోరీలతో స్ఫూర్తి పొంది విద్యార్థులంతా అత్యున్నత శిఖరాలను చేరుకోవాలని సేతురామన్ తన ప్రసంగంలో నొక్కి చెప్పారు.





మరణించాక జీవిద్దాం!

నిత్యం 50,000 నుంచి 60,000 మంది మరణిస్తున్నారని, వీరి అవయవాలను దానం చేయడంతో చూపు లేని వారికి చూపుతో పాటు, మరణం అంచున ఉన్న పలువురు రోగులకు ప్రాణం పోయవచ్చని సేతురామన్ విద్యార్థులకు వివరించారు.







సైంటిస్ట్ గెస్ట్‌లు

ఏఆర్‌సీఐ నుంచి విచ్చేసిన ప్రముఖ శాస్త్రవేత్త, అసోసియేట్ డైరెక్టర్ డాక్టర్ టీఎన్ రావు మన దేశ పురోభివృద్ధికి 'నానో మెటీరియల్స్ టెక్నాలజీస్' ఎలా దోహదపడుతుందో తన ప్రెజెంటేషన్‌లో నమూనాలతో సహా చక్కగా ఉపన్యసించి.. విద్యార్థులకు నానో టెక్నాలజీపై ఆసక్తి కలిగించేలా ఉదహరించారు. ఎన్ఐటీ వరంగల్‌కు చెందిన డాక్టర్ శేషగిరిరావు 'అడ్వాన్స్డ్ కంట్రోల్ సిస్టమ్స్ ఇన్ వేస్ట్ వాటర్ ట్రీట్‌మెంట్ 'అనే అంశంపై ప్రసంగించారు.

కొల్హాపురితో అదిరేలా..



వేసవి తాపం నుంచి మిమ్మల్ని మీరు కాపాడుకోవాలంటే తలపైన క్యాప్ మొదలు అరికాళ్ల వరకూ అన్నీ సమ్మర్‌కు సూట్ అయ్యేలా జాగ్రత్తలు తీసుకోవాలి. సింథెటిక్, బ్రాండెడ్ వంటి చెప్పులు, షూస్ వేసుకునే బదులు స్కిన్ ఫ్రెండ్లీగా ఉండే కొల్హాపురి చెప్పులను ధరించేందుకు ప్రాధాన్యత ఇచ్చి చూడండి. కొల్హాపురి చెప్పులతో సమ్మర్ చాలా కూల్‌గా ఉంటుందని మీరే అంటారు. పర్యావరణానికి హాని కలిగించని ఈ కాలి జోళ్లు ఇప్పుడు ఆన్ లైన్‌లో కూడా లభిస్తున్నాయి. వీటికున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని పలు వెబ్‌సైట్లు వీటిని విక్రయిస్తున్నాయి.

స్టైలిష్‌గా..

ఒకప్పుడు సింపుల్ డిజైన్స్‌లో మాత్రమే ఇవి లభించేవి. కానీ కాలానుగుణంగా డిజైన్లలో భారీగా మార్పులు వచ్చి, చూడగానే ఇవి కొల్హాపురి చెప్పులు కాదనేలా ట్రెండీగా మార్కెట్లో అందుబాటులోకి వచ్చి మదిని దోచుకుంటున్నాయి. బెనారస్, ఇక్కత్ వంటి క్లాత్‌ను కూడా చేర్చడంతో కొత్త లుక్ వచ్చేలా కొల్హాపురి చెప్పులు సరికొత్తగా కనిపిస్తున్నాయి. క్లాసిక్, ఫ్లాట్స్, హీల్, హిప్పీ మోడల్స్‌తోపాటు వీటిపై ఎన్నో వర్క్‌లు కూడా వస్తున్నాయి. ఎథ్నిక్ కేటెగెరీలో చేరే కొల్హాపురి చెప్పులను ఎథ్నిక్ డ్రెస్సులతో వేసుకుంటే మీరు సెంటర్ ఆఫ్ అట్రాక్షన్‌లా కనిపించడం ఖాయం.





చవక కూడా

ఇతర మెటీరియల్స్‌తో చేసిన ఫుట్‌వేర్ కంటే కొల్హాపురి చవకగా లభిస్తాయి. స్త్రీ, పురుషులు ఇద్దరికీ వెరైటీగా ఉండే డిజైన్స్‌లో లభిస్తున్న ఈ చెప్పులు ఆరోగ్యానికి మంచిది, కంఫర్ట్ కూడా ఉంటాయి. తక్కువ రేటుకే లభించే ఈ ఫుట్ వేర్‌ను కొనడంతో మీ కలెక్షన్‌లో ఓ హ్యాండ్ మేడ్ మోడల్ చేరడంతోపాటు దీనిపై ఆధారపడ్డ చేతివృత్తుల కుటుంబాలకు ఆర్థికంగా సాయం చేసిన వారవుతారు. ఈమధ్య కాలంలో డిజైనర్స్ కూడా వీటిపై ఫోకస్ పెడుతుండడంతో ఫ్యాషన్ షోల్లో సంప్రదాయ కొల్హాపురి చెప్పులకు మరింత ప్రాధాన్యత పెరుగుతోంది.







గరం గరం సమోసా.. ఈ పేరు వింటూంటేనే నోట్లో నీళ్లు ఊరుతున్నాయా? ఈ టెంప్టేషన్ మనకు మాత్రమే కాదండోయ్ విదేశాలకూ పాకింది. ఖండాంతరాలను దాటేసిన సమోసా రుచి ఇప్పుడు సమోసా ఫెస్ట్‌కు దారితీసింది.

ఇంగ్లండ్‌లో.. సమోసా వీక్

వెస్ట్రన్ రుచుల సరసన..

సాధారణంగా పాశ్చాత్య దేశాల్లో పైస్, చాక్లెట్స్, బర్గర్స్, నూడుల్స్, పిజ్జా, పాస్టా, కేక్ వంటి వాటికి దక్కే స్థానం మన సమోసాకు కూడా దక్కడం హైలైట్. దీంతో తమ సంప్రదాయ వంటలతోపాటు సమోసాకు వీరు పట్టం కట్టారు. ఏటా ఏదో ఒక ఫుడ్ వెరైటీతో ఫుడ్ ఫెస్ట్ నిర్వహించే నగర ప్రజలు ఈసారి తమ ఫేవరెట్ డిష్ సమోసాతో పండగ చేసుకుంటామంటున్నారు.

లీసెస్టర్ సిటీలో హాట్ కేక్స్ ఇవే

ఇంగ్లండ్‌లోని లీసెస్టర్ సిటీ ప్రజలకు సౌత్ ఏషియా ఫుడ్ అంటే చచ్చేంత ఇష్టం. వీరంతా సమోసాకు బాగా అడిక్ట్ అయిపోయారు, అందునా వేడి వేడి సమోసాలంటే లొట్టలేసుకుని వీరు లాగించేస్తున్నారు. అందుకే సమోసాపై తమ ప్రేమను చాటుకునేలా ఇప్పుడు ఏకంగా 'సమోసా వీక్'ను నిర్వహించేందుకు రెడీ అయ్యారు. ఇక్కడి ఫుడ్ జాయింట్స్‌లో హాట్ కేక్స్‌లా అమ్ముడుబోయే సమోసాలకు డిమాండ్ ఏటా అంతకంతకూ పెరుగుతోంది. వచ్చేనెల 9వ తేదీ నుంచి వారం రోజుల పాటు సాగే 'నేషనల్ సమోసా వీక్'లో వీరు పలు రకాల సమోసాలు తినేందుకు ఇప్పటినుంచే ఉవ్విళ్లు ఊరుతున్నారు. ఇందులో భాగంగా ప్రతి ఒక్కరూ సమోసాలను ఆరగించి, వీటి రుచిని ఎంజాయ్ చేసేలా చేయడమే సమోసా వీక్ ప్రధాన అజెండాగా నిర్ణయించారు.



రగడ సమోసా

సమోసా చెప్పేందుకు చాలా సింపుల్ వంటకం కానీ ఇందులో వెజ్, నాన్ వెజ్, డ్రై, చాట్, రగడ చాట్ ఇలా బోలెడు వెరైటీలను తయారు చేయవచ్చు. ఆలూ సమోసా, మిక్స్‌డ్ వెజిటబుల్ సమోసా, కార్న్ సమోసా, ప్యాజ్ సమోసా, క్యారెట్ సమోసా, డ్రై ఫ్రూట్స్, నట్స్ సమోసా ఇలా ఒక్కటేమిటి బోలెడు రుచులను సమోసాలో చేర్చి మరింత రుచికరంగా తయారు చేయవచ్చు. టిఫిన్‌గా, స్నాక్స్‌గా .. భోజనం చేసే టైం లేకపోతే రెండు సమోసా ఒక టీ లేదా కాఫీ లేదా జ్యూస్ తీసుకుంటే చాలు తృప్తిగా కడుపు నిండిపోయేలా చేసే సమోసాలను చిన్నా, పెద్దా అందరూ ఇష్టపడతారు. కార్బోహైడ్రేట్స్, ప్రొటీన్‌లు ఏవి ఎక్కువ కావాలంటే వాటికి అనుగుణంగా కూర తయారు చేసుకుని పూరీలో త్రిభుజాకారంలో నింపి, నూనెలో కాల్చితే చిటికెల్లో తయారయ్యే సమోసా బేకరీలు, టిఫిన్ సెంటర్లు, రెస్టారెంట్లలో విరివిగా లభిస్తాయి. మనదేశంలో నిత్యం కోట్లాది మందికి ఉపాధి కల్పిస్తూ, కడుపునింపే సమోసా తయారీ ఇప్పుడు ఇంటర్నేషనల్ ఫుడ్ స్టేటస్ పొందడం మనందరికీ గర్వకారణం.

గౌడన్నలకు వరాల జల్లు!

(మొదటిపేజీ తరువాయి)

చేస్తున్నట్టు ప్రకటించారు. ఇప్పటికే పన్ను బకాయిలున్నవారు వాటిని చెల్లించనక్కర్లేదని భరోసా ఇచ్చారు. ఈ పన్నుల రద్దుతో ప్రభుత్వంపై రూ. 6.38 కోట్ల మేర భారం పడనుందని వివరించారు. ఉద్యమ సమయంలో ఇచ్చిన మాట ప్రకారం గౌడ కులస్థులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని స్పష్టం చేశారు. గౌడల సంక్షేమం కోసం 5 ఎకరాల భూమి కేటాయింపుతోపాటు అందులో భవన నిర్మాణానికి రూ.5 కోట్లు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. సమైక్య రాష్ట్రంలో సామాజిక విధ్వంసం జరిగిందని, దీన్ని చక్కదిద్దే దిశగా కుల వృత్తులుసహా వారి జీవన విధానాల మెరుగుకు పలు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో గౌడ వృత్తిదారుల మనుగడే ప్రశ్నార్థకంగా మారిందన్నారు. చౌక మద్యం ప్రవేశపెట్టిన సమైక్య పాలకులు కల్లుగీత కార్మికులను మోసగించారని ఆరోపించారు. వృత్తిలో భాగంగా ప్రమాదవశాత్తు చెట్టుపై నుంచి పడి మృతి చెందితే చెల్లించే పరిహారాన్ని రూ. 2లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచినట్టు చెప్పారు. శాశ్వత అంగవైకల్యం పాలైనా పరిహారంగా రూ.5 లక్షలు చెల్లిస్తామని పేర్కొన్నారు. గీత కార్మికుల పెన్షన్‌ను రూ.200 నుంచి రూ.1000కి పెంచుతున్నట్టు ప్రకటించారు. టీఎఫ్‌టీ కార్మికులకు పింఛన్ ఇస్తామని తెలిపారు. టీఎఫ్‌టీ నుంచి టీఎస్‌టీలోకి పదిరోజుల్లో బదలాయింపు ఉంటుందని తెలిపారు. హరిత హారంలో భాగంగా చెరువు గట్లు, నదీ పరీవాహక ప్రాంతాలు, వర్రెలు, వాగులకు ఇరువైపులా కోటి 70 లక్షల తాటి, ఈత, ఖర్జూర మొక్కలు నాటినట్లు వివరించారు. చెట్ల లైసెన్స్ రెన్యువల్ గడువును ఐదేండ్ల నుంచి పదేండ్లవరకు పొడిగించినట్టు పేర్కొన్నారు. సమైక్య పాలకులు గతంలో కల్లు దుకాణాలను ఎత్తివేశారన్నారు. గీత కార్మికులకు ఇచ్చిన హామీ మేరకు హైదరాబాద్‌లో కల్లు దుకాణాలను తెరిపించామన్నారు. గుడుంబా మహమ్మారిని తరిమికొట్టామని తెలిపారు.



సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న మంత్రి పద్మారావు, ఎమ్మెల్యేలు శ్రీనివాస్‌గౌడ్, వివేకానంద్‌గౌడ్, ప్రకాశ్‌గౌడ్, ఎమ్మెల్సీ గంగాధర్ గౌడ్ తదితరులు



బీజేపీకి నాగం గుడ్‌బై

(మొదటిపేజీ తరువాయి)

ఉందని, ఆ ప్రత్యేకత ఏమిటో పార్టీకి అర్థం కాలేదని చెప్పారు. అందుకే పార్టీ నుంచి వైదొలగాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు తన రాజీమానా లేఖను పార్టీ అధిష్ఠానానికి పంపుతానన్నారు. తనతో పాటు మండల, గ్రామస్థాయిలో మరో 20 మంది బీజేపీకి రాజీనామా చేస్తున్నారని ప్రకటించారు. అనంతరం మరోసారి కార్యకర్తలతో విస్తృత సమావేశం నిర్వహించి భవిష్యత్ కార్యాచరణపై నిర్ణయం ప్రకటిస్తామని తెలిపారు. కాగా, ఇంతకుముందు తెలుగుదేశం పార్టీలో కీలక పాత్ర పోషించిన జనార్దన్ రెడ్డి నాగర్ కర్నూల్ నుంచి ఐదుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఆ తర్వాత తెలంగాణ ఉద్యమ సమయంలో పార్టీని వీడి 'తెలంగాణ నగారా' పార్టీని ఏర్పాటు చేశారు. తదనంతర పరిణామాల్లో భాగంగా ఆ పార్టీని బీజేపీలో విలీనం చేశారు.

రాష్ట్రంలో సమగ్ర సాగునీటి విధానం

(మొదటిపేజీ తరువాయి)

సాగునీటి విధానం విషయంలో ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు ఈ నెల 24 నుంచి వారం రోజులపాటు జిల్లాల్లో నిరసన కార్యక్రమాలు చేట్టాలని సమావేశం నిర్ణయించింది. ప్రాధాన్యతా క్రమంలో సాగునీటి ప్రాజెక్టులను నిర్మించాలని వివిధ సంఘాల నేతలు డిమాండ్ చేశారు. ఉమ్మడి ఆదిలాబాద్, మహబూబ్‌నగర్, ఖమ్మం జిల్లాల్లో ప్రారంభించిన ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం జల విధానాన్ని ప్రకటించాలన్నారు. సాగు నీటి ప్రాజెక్టులపై ఇప్పటి వరకు పెట్టిన ఖర్చులు, అంచనాలు ఎందుకు పెరిగాయో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జస్టిస్ చంద్రకుమార్ అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే గుర్రం యాదగిరిరెడ్డి, వ్యవసాయ శాస్త్రవేత్త అరబండి ప్రసాద్, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ, సాగర్, రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనారాయణ స్వచ్ఛంద విరమణ

(మొదటిపేజీ తరువాయి)

అందులో ఆయన విజ్ఞప్తి చేశారు. అప్పట్లో వైఎస్ జగన్ అక్రమాస్తుల కేసు, గాలి జనార్దన్‌రెడ్డి మైనింగ్ కేసుల వ్యవహారంలో సీబీఐ జాయింట్ డైరెక్టర్‌గా దర్యాప్తులో ఆయన కీలకంగా వ్యవహరించిన విషయం తెలిసిందే. అయితే, పదవీ విరమణకు ముందే ఆయన ఎందుకు ఈ నిర్ణయం తీసుకున్నదానిపై ఆసక్తి నెలకొంది. లక్ష్మీనారాయణ రాజకీయాల్లోకి రాబోతున్నారంటూ ఊహాగానాలు వెల్లువెత్తాయి.



ఐదుగురు లష్కరే ముష్కరులు హతం

- కుప్వాడాలో ముగిసిన సుదీర్ఘ ఎన్‌కౌంటర్
- గల్లంతైన జవాను కోసం సిబ్బంది గాలింపు

శ్రీనగర్, మార్చి 22: జమ్ముకశ్మీర్‌లోని కుప్వాడా జిల్లా పరిధిలో 48 గంటలపాటు సాగిన హోరాహోరీ ఎన్‌కౌంటర్ ముగిసింది. ఉగ్రవాదులతో సుదీర్ఘంగా సాగిన ఈ పోరాటంలో ఐదుగురు విదేశీ ముష్కరులు హతమయ్యారు. వీరంతా లష్కరే తోయిబా ఉగ్రవాద సంస్థ సభ్యులని భావిస్తున్నట్లు ఉన్నతాధికారులు తెలిపారు. ఈ పోరులో ముగ్గురు సైనికులు, ఇద్దరు పోలీసులు కూడా అమరులయ్యారని, గల్లంతైన మరో జవాను కోసం సైనిక సిబ్బంది గాలిస్తున్నారని పేర్కొన్నారు. నియంత్రణ రేఖ (ఎల్‌వోసీ) సమీపంలోని హల్మత్‌పుర ప్రాంతంలో పోలీసు సిబ్బందిపై ఉగ్రవాదులు దాడిచేయడంతో ఈ ఎన్‌కౌంటర్ చోటుచేసుకున్నట్లు అధికారవర్గాలు తెలిపాయి. షంశాబరి పర్వత శ్రేణిలోని రెండు లోయలను దాటి సుమారు 8 కిలోమీటర్ల మేర ఈ దుండగులు చొచ్చుకొచ్చారని పేర్కొన్నాయి. అనంతరం కశ్మీర్ లోయలో విచ్ఛిన్న కార్యకలాపాలకు పాల్పడే ఉగ్రవాద సానుభూతిపరులు, క్షేత్రస్థాయి దుండగుల బృందం దారిచూపగా కుప్వాడా జిల్లాలో ప్రవేశించబోయారని తెలిపాయి. మంగళవారం నాడు వీరంతా ఒక మసీదులో దాగి ఉండటం పసిగట్టిన సైనిక, పోలీసు బలగాలు చుట్టుముట్టగా అడవుల్లోకి పారిపోయేందుకు యత్నించినట్లు చెప్పాయి. అయితే, వారిని వెంటాడిన సిబ్బంది అప్పటికప్పుడే నలుగురు ముష్కరులను మట్టుబెట్టినట్లు వివరించాయి. ఐదో దుండగుడు కొంత ఎత్తయిన ప్రాంతంలో దాగి కాల్పులు జరుపుతూ భద్రత బలగాలను నిలువరించినట్లు తెలిపాయి. చివరకు ఇతణ్ని కూడా బుధవారం సాయంత్రం వేళకు హతమార్చినట్లు పేర్కొన్నాయి. ఈ ఐదుగురి మృతదేహాలను పరిశీలించి, వారివద్దగల సమాచారాన్ని విశ్లేషించగా వీరంతా విదేశీయులని, లష్కరే ఉగ్రవాద సంస్థ సభ్యులని తెలిపే ఆధారాలు లభించినట్లు వెల్లడించాయి.

కాళేశ్వరం పరిధిలోకి ఎగువ మానేరు



(మొదటిపేజీ తరువాయి)

ప్రాజెక్టుకు సంబంధించి వివిధ అంశాలపై రాష్ట్ర మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు అసెంబ్లీ కమిటీ హాల్‌లో గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ ఎగువ మానేరు ప్రాజెక్టు (నర్మాల) 2.2 టీఎంసీల రిజర్వాయర్ అని, కానీ అది చాలా కాలంగా పూడుకు పోయిందని అన్నారు. ఈ ప్రాజెక్టు పూడికతీతకు చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ మంత్రి హరీశ్ రావు అధికారులను ఆదేశించారు. నర్మాలకు వెళ్లే కాలువలను 38 కోట్ల తో మరమ్మతులు చేయనున్నట్టు హరీశ్‌రావు చెప్పారు.

దసరాకు పనులు పూర్తి కావాలి

కాళేశ్వరం ప్యాకేజీ 9 పనులను వచ్చే దసరా నాటికి పూర్తి చేయాలని ఈ సందర్భంగా మంత్రులు హరీశ్ రావు, కేటీఆర్ ఆదేశించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన 9,10,11,12 ప్యాకేజీలకు చెందిన టన్నెల్స్, పంప్ హౌస్‌లు, సర్జ్ పూల్, మెయిన్ కెనాల్స్, డిస్ట్రిబ్యూటరీల పనులను గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఇకపై ప్రతివారం సమీక్ష నిర్వహిస్తామన్నారు. ప్రస్తుతం జరుగుతున్న పనుల పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు పనులకు నిధుల కొరత లేదన్నారు. కాగా, ఈ నాలుగు ప్యాకేజీల పరిధిలో సిరిసిల్ల జిల్లాలో 253 చెరువులు నింపనున్నట్లు అధికారులు చెప్పారు. సిరిసిల్ల జిల్లాలో మొత్తం 625 చిన్న తరహా నీటి వనరులున్నాయని, వీటన్నిటిని ఎక్కువ చెరువులను నింపి జిల్లాను మోడల్ గా మార్చాలని ఆ జిల్లా కలెక్టర్ కృష్ణభాస్కర్ ఇరిగేషన్ ఉన్నతాధికారులను, మంత్రి కేటీఆర్‌ను కోరారు.

జూన్ కల్లా కాళేశ్వరం పంపుల వెట్ రన్

జూన్ కల్లా కాళేశ్వరం ప్రాజెక్టు పంపుల వెట్ రన్ నిర్వహించాలని మంత్రి హరీశ్‌రావు ఆదేశించారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ళ బ్యారేజీతో పాటు మూడు పంప్ హౌస్‌ల పనులకు సంబంధించి బీహెచ్‌ఈఎల్ అధికారులు, పంపులు, మోటార్ల సరఫరా కంపెనీ ప్రతినిధులతో ఆయన మాట్లాడారు. పంపులు, మోటార్లు, ఇతర పరికరాలను సరఫరా చేసే సంస్థలు ప్రణాళికబద్ధంగా పనిచేయాలని కోరారు. అవసరమైతే ఎయిర్ కార్గోను వాడుకోవాలన్నారు. ప్యాకేజీ 6,8 పనులను కూడా సమీక్షించారు. ఇందులో వాడనున్న 139 మెగావాట్ల పంపు ఆసియా ఖండంలో మరెక్కడా లేదని విదేశీ సంస్థల ప్రతినిధులు తెలిపారు. ఈ సమీక్షలో శాసనసభ్యులు చెన్నమనేని రమేష్, రసమయి బాలకిషన్, సిరిసిల్ల జిల్లా కలెక్టర్ కృష్ణభాస్కర్, ఈ.ఎన్. సి.మురళీధర్ రావు, సీఈ హరీరాం, ఇతర ఉన్నతాధికారులు, వివిధ కాంట్రాక్టు ఏజెన్సీల ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు రాజ్యసభ ఎన్నికల పోలింగ్



తెలంగాణ భవన్‌లో నిర్వహించిన రాజ్యసభ ఎన్నికల మాక్ పోలింగ్‌లో సీఎం కేసీఆర్

హైదరాబాద్, మార్చి 22 (మనం ప్రతినిధి): రాష్ట్రంలో తెలంగాణ రాష్ట్రంలో ఖాళీగా ఉన్న మూడు రాజ్యసభ స్థానాలకు శుక్రవారం ఎన్నికలు జరుగనున్నాయి. టీఆర్ఎస్ పార్టీ నుంచి రాజ్యసభ స్థానాలకు బండ ప్రకాష్ ముదిరాజ్, బడుగుల లింగయ్య యాదవ్, సంతోష్ కుమార్, కాంగ్రెస్ తరపున మాజీ మంత్రి బలరాం నాయక్ పోటీలో ఉన్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు పోలింగ్ జరుగనుంది. 5 గంటల నుంచి ఓట్ల లెక్కింపు జరుగనుంది. అభ్యర్థులతో పాటు నోటాకు ఓటు వేసేందుకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. టీఆర్ ఎస్ అభ్యర్థులకు ఎంఐఎం ఎమ్మెల్యేలు ఓటు వేయనున్నారు. ఎన్నిక లను రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి రజత్‌కుమార్ పర్యవేక్షించనున్నారు.

వీడియో ఫుటేజీకి సభ ఆమోదం కావాలి

- హైకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం వాదన
- మరింత సమయం కావాలన్న ఏజీ
- విచారణ ఈ నెల 27కు వాయిదా

హైదరాబాద్, మార్చి 22(మనం లీగల్ ప్రతినిధి): శాసనసభ్యత్వాల రద్దును సవాల్ చేస్తూ కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సంపత్‌కుమార్‌లు దాఖలు చేసిన కేసులో గురువారం హైకోర్టులో తాజా పరిణామాలు చోటు చేసుకున్నాయి. గవర్నర్ ప్రసంగ సమయంలో సభాగౌరవాన్ని దెబ్బతీసేలా వారిద్దరూ వ్యవహరించారని ఆరోపిస్తూ వారి శాసనసభ సభ్యత్వాలను రద్దు చేయడాన్ని సవాల్ చేసిన కేసులో సమావేశాల వీడియో ఫుటేజి అందజేయాలని గతంలో హైకోర్టు ఆదేశించింది. అయితే వీడియో ఫుటేజి అందజేయాలంటే సభ ఆమోదం విధిగా ఉండాలని, ఈ నేపథ్యంలో వీడియో ఫుటేజీ ఇచ్చేందుకు మరింత సమయం కావాలని గురువారం తెలంగాణ అదనపు అడ్వకేట్ జనరల్ రామచందర్‌రావు హైకోర్టుకు తెలియజేశారు. గత విచారణ సమయంలో హైకోర్టు ఆదేశాల మేరకు వీడియో ఫుటేజి కావాలని అసెంబ్లీ సెక్రటరీకి అడ్వకేట్ జనరల్ ప్రకాశ్‌రెడ్డి లేఖ రాశారని ఆయన చెప్పారు. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి బి.శివశంకర్‌రావు రికార్డుల్లో నమోదు చేసి వీడియో ఫుటేజీ ఇచ్చేందుకు సమయాన్ని ఈ నెల 27 వరకు పొడిగించారు. విచారణ కూడ ఆదే తేదీకి వాయిదా వేశారు. గవర్నర్ నరసింహన్ ఈ నెల 12న ఉభయసభలను ఉద్దేశించి ప్రసంగిస్తున్న సమయంలో హెడ్‌ఫోన్ విసరడంతో అది శాసనమండలి ఛైర్మన్ స్వామి గౌడ్‌కు తగిలి గాయం అయిందని, ఈ కారణంగా తమ శాసనసభ సభ్యత్వాలను రద్దు చేయడం అన్యాయమని కోమటిరెడ్డి, సంపత్‌ల వాదన. అసెంబ్లీలో ఆరు వీడియో కెమెరాలు ఉంటాయని, రెండు గవర్నర్ ప్రసంగ వేదికపైన, మిగిలిన నాలుగు సభ్యులపై కేంద్రీకరించి వీడియోలు తీస్తాయని, వీడియో ఫుటేజీలను పరిశీలిస్తే తమపై చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదని తెలుతుందని వారిద్దరూ హైకోర్టును ఆశ్రయించిన విషయం విదితమే. వీడియో ఫుటేజీ సమర్పించేందుకు ప్రభుత్వం సమయం కోరడంతో విచారణ 27కి వాయిదా పడింది.

గొల్ల, కుర్మల ప్రగతి కోసమే

గొర్రెల పంపిణీ

- మంత్రి తలసాని శ్రీనివాస్



హైదరాబాద్, మార్చి 22(మనం ప్రతినిధి): రాష్ట్రంలోని గొల్ల, కుర్మల ఆర్థికాభివృద్ధి కోసమే గొర్రెల పంపిణీ చేపడుతున్నామని పశుసంవర్థక, మత్స్య శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. గొర్రెల పెంపకం కోసం మేత దిగుమతి అంశంపై కర్నె ప్రభాకర్ వివరణ కోరగా మంత్రి సమాధానమిస్తూ... 2017-18 గానూ 3,65,520 యూనిట్ల పంపిణీ చేయాలనే లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటికే 2,42,349 యూనిట్లను పంపిణీ చేసినట్టు పేర్కొన్నారు. రాష్ట్రంలోని ప్రాథమిక గొర్రె కాపరుల మొత్తం సహకార సంఘాలు 7,925, గొర్రె కాపరుల సహకార సంఘాలతో నమోదైన మొత్తం సభ్యులు 7,61,985, గ్రామ సభల్లో గుర్తించిన మొత్తం లబ్దిదారులు 7,20,416 అని పేర్కొన్నారు. 2018-19 గొర్రెల యూనిట్ల పంపిణీ లక్ష్యం 3,54,896 కాగా గొర్రెలను తప్పనిసరిగా తెలంగాణ రాష్ట్రం వెలుపల నుంచి కొనుగోలు చేయవలసి ఉంటుందన్నారు.

63 కొత్త నగర పంచాయతీలు!

- 4 మునిసిపాలిటీలు కూడా..
- త్వరలో సర్కారు ఉత్తర్వులు

హైదరాబాద్, మార్చి 22(మనం ప్రతినిధి): రాష్ట్రంలో భారీగా కొత్త నగర పంచాయతీలు పురుడు పోసుకోనున్నాయి. మేజర్ గ్రామ పంచాయతీలుగా కొనసాగుతున్నవాటితోపాటు, రాజకీయ సమీకరణాలనునసరించి ఇప్పటి వరకూ ప్రచారంలో లేని కొన్ని గ్రామపంచా యతీలు కూడా నగర పంచాయతీలుగా మారను న్నట్టు సమాచారం. మొత్తం 63 పంచాయతీలకు నగర పంచాయతీలుగా రాష్ట్ర ప్రభుత్వం ప్రమోషన్ ఇవ్వనుందని, భాగ్యనగరం చుట్టూ ఉన్న జవహర్‌నగర్, తుర్కయాంజల్, శంషాబాద్, అమీన్‌పూర్ కేంద్రంగా నాలుగు కొత్త మునిసిపాలిటీలు అందుబాటులోకి రానున్నాయని తెలుస్తోంది.

పలు పద్దులకు ఆమోదం

హైదరాబాద్, మార్చి 22(మనం ప్రతినిధి) : బడ్జెట్‌లో కేటాయింపులేమో భారీగా ఉంటున్నాయి ఖర్చు మాత్రం నామమాత్రంగానే ఉంటుంది, ఇదెక్కడి చోద్యమని టీడీపీ, బీజేపీ, సీపీఎం సభ్యులు ప్రభుత్వతీరును విమర్శించారు. పలు పద్దులపై గురువారం అసెంబ్లీలో జరిగిన చర్చలో బీజేపీ, టీడీపీ, సీపీఎం, ఎంఐఎంతో పాటు టీఆర్ఎస్ సభ్యులు పాల్గొన్నారు. సభ్యులు పద్దులపై జరిగిన చర్చలో పలు అంశాలపై సూచనలు చేశారు. సభ్యుల ప్రశ్నలకు ఆయా శాఖల మంత్రులు సమాధానమిచ్చారు. విద్యా శాఖలో పాఠశాల విద్య, ఉన్నత విద్య, సాంకేతిక విద్య పద్దులు, గృహ నిర్మాణ శాఖ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమం, బీసీ సంక్షేమ శాఖ, మహిళా , శిశు సంక్షేమం, యువజన , క్రీడల శాఖ, వైద్య ఆరోగ్య శాఖ మొత్తం 11 శాఖల పద్దులను గురువారం నాడు శాసన సభ ఆమోదించింది.

ఉద్యోగులకు శుభవార్త



'గ్రాట్యుటీ' సవరణ బిల్లుకు పార్లమెంట్ ఆమోదం.. ఇకపై రూ.20 లక్షల వరకు పన్ను రహితం

న్యూఢిల్లీ, మార్చి 22: పన్నురహిత గ్రాట్యుటీపై ప్రభుత్వ నిర్ణయానికి వీలు కల్పించే బిల్లుకు ఎట్టకేలకు మోక్షం లభించింది. ఈ మేరకు గత వారం లోక్‌సభ ఆమోదించిన ఈ బిల్లుకు గురువారం రాజ్యసభ సభ్యులు మూజువాణి ఓటుతో సమ్మతి తెలిపారు. రెండు వారాలుగా ఎలాంటి కార్యకలాపాలు సాగని సభలో ఈ బిల్లుపై ఎలాంటి చర్చ లేకుండానే ఆమోద ప్రక్రియ పూర్తికావడం విశేషం. దీంతో ఇకపై పన్నురహిత గ్రాట్యుటీ మొత్తాన్నే కాకుండా ఉద్యోగినులకు ప్రసూతి సెలవు పరిమితిని కూడా ప్రభుత్వం ఒక ఆదేశంద్వారా నిర్ధారించవచ్చు. ఈ బిల్లుద్వారా చట్ట సవరణకు మార్గం సుగమం కావడంతో పన్నురహిత గ్రాట్యుటీ పరిమితిని ప్రభుత్వం రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షలకు పెంచే వీలు కలుగుతుంది. ఈ మేరకు ఏడో వేతన సవరణ సంఘం సిఫారసు చేసిన నేపథ్యంలో చట్టానికి ప్రస్తుత సవరణ అవసరమైంది. మరోవైపు ఉద్యోగినులకు 12 వారాల ప్రసూతి సెలవును 'ప్రసూతి లబ్ధి (సవరణ) చట్టం-2017' ప్రకారం 26 వారాలకు పెంచడంవల్ల కూడా గ్రాట్యుటీ చట్ట సవరణ చేయాల్సి వచ్చింది.



'గార్డెన్ సిటీ' వాడిపోతోంది

కాంక్రీట్ జంగిల్‌గా నగరం.. తీవ్రమైన నీటి ఎద్దడి
దేశంలోనే మొదటి దోషి.. పుణెలోనూ అదే పరిస్థితి

న్యూఢిల్లీ, మార్చి 22: ఒకప్పుడు పచ్చని చెట్లు.. చుట్టూ సరస్సులతో కళకళలాడిన నగరం ఇప్పుడు బహుళ అంతస్థుల భవనాలతో నిండిపోయింది. గార్డెన్ సిటీగా పేరొందిన సిటీ ఇప్పుడేమో కాంక్రీట్ జంగిల్‌గా మారి బావురుమంటోంది. వర్షపు నీటిని ఒడిసిపట్టుకునేందుకు తవ్వించిన సరస్సులు కనుమరుగైపోయాయి. రియల్ ఎస్టేట్ బూమ్ నేపథ్యంలో ఆక్రమణలకు గురై డ్రీమ్ ఎకర్స్, స్ట్రాబెర్రీ ఫీల్డ్స్ వంటి పేర్లతో అపార్ట్‌మెంట్లుగా రూపాంతరం చెందాయి. ఇక మిగిలిన సరస్సులు కాలుష్యానికి ఆలవాలంగా మారాయి. ఓ పద్ధతంటూ లేకుండా జరిగిన పట్టణీకరణ దానిని ప్రమాదపు అంచున నిలబెట్టింది. భారతదేశంలో తీవ్రమైన నీటి ఎద్దడికి గురికానున్న మొదటి నగరంగా బెంగళూరు దోషిగా నిలబడనుంది. పచ్చదనానికి మారుపేరుగా నిలిచిన నగరం ఇప్పుడు మోడువారనుంది. పట్టణీకరణ ఇదే స్థాయిలో కొనసాగితే వచ్చే రెండేళ్లలో బెంగళూరులో 94 శాతం కాంక్రీట్ మయంగా మారనుందని పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ప్రపంచంలో నీటి వనరులు పూర్తిగా అంతరించిపోయే ప్రమాదం ఎదుర్కొంటున్న తొలి పది నగరాల జాబితాలో బెంగళూరు కూడా ఉండడం పరిస్థితి తీవ్రతకు అద్దంపడుతోంది. వాస్తవానికి వర్షపునీటిని సమర్థవంతంగా వినియోగించుకుంటే బెంగళూరు జనాభాకు సరిపడా తాగునీరు అందించడం పెద్ద సమస్య కాదని నిపుణులు చెబుతున్నారు. ఇందుకు బోర్‌వెల్స్‌పైన కానీ సరస్సులపైన కానీ ఆధారపడాల్సిన అవసర మే లేదంటున్నారు. అయితే, వర్షపు నీటిని ఒడిసిపట్టే మార్గాలను పకడ్బందీగా అమలుచేయక పోవడం వల్లే నీటి ఎద్దడి తీవ్రమవుతోందని చెప్పారు. ప్రస్తుతం బెంగళూరులో కనీసం 1500 ఫీట్ల లోతుల్లోకి వెళితే(450 మీటర్లు) తప్ప నీటి జాడే కనిపించడంలేదట! కావేరీ జలాల్లో దక్కిన వాటాతో మున్సిపాలిటీ నగరవాసుల గొంతు తడుపుతోంది. కావేరీ జలాల వివాదంలో ఈ విషయానికీ ప్రాధాన్యం దక్కడం గమనార్హం. పంటలకు నీళ్లు కావాలన్న తమిళనాడు రైతుల డిమాండ్‌ను తోసిపుచ్చి ముందు తాగునీటి అవసరాలు తీర్చడానికే ప్రాధాన్యతంటూ సుప్రీంకోర్టు కర్నాటక వాటాను పెంచడం తెలిసిందే! ఈ పరిస్థితుల నేపథ్యంలో నగరం చనిపోతోందంటూ పర్యావరణవేత్త టీవీ రామచంద్రన్ వ్యాఖ్యానించారు. ఇప్పటికైనా మేలుకొని సంరక్షణ చర్యలు తీసుకోకుంటే బెంగళూరు మరో కేప్‌టౌన్ కావడం తథ్యమని హెచ్చరించారు. కాగా, సగటున 750 మిల్లీమీటర్ల వార్షిక వర్షపాతం, చుట్టూ ఐదు నదులు ఉన్నప్పటికీ పుణె నగరం నీటి ఎద్దడితో సతమతమవుతోంది. నగరం చుట్టుపక్కల ఇప్పుడిప్పుడే అభివృద్ధి చెందుతున్న బానెర్, బాలెవాడి, విమాన్‌నగర్ తదితర ప్రాంతాలలో తీవ్రత చాలా ఎక్కువగా ఉంది. భూగర్భ జలవనరులను సంరక్షించుకునేందుకు సరైన వ్యవస్థ లేకపోవడంతో నీటి ఎద్దడి



తప్పడంలేదని నిపుణులు చెబుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా పలు నగరాలలో నీటి కొరతపై ఐక్యరాజ్య సమితి స్పందిస్తూ.. ప్రస్తుత పరిస్థితి ఇలాగే కొనసాగితే 2050 నాటికి ప్రపంచవ్యాప్తంగా సుమారు 570 కోట్లకు పైగా ప్రజలకు తాగునీటి కోసం కటకటలాడాల్సి వస్తుందని హెచ్చరించింది.

నీటి సంరక్షణకు పునరంకితం: మోదీ

జల సంరక్షణకు పునరంకితం కావాల్సిన సమయం వచ్చిందని ప్రధాని మోదీ ప్రజలకు పిలుపునిచ్చారు. మార్చి 22న అంతర్జాతీయ జల దినోత్సవం సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ.. నీటి వాడకాన్ని తగ్గించుకుని, సంరక్షణ చర్యలు చేపడితే నగరాలు, గ్రామాలతో పాటు రైతులు ప్రయోజనం పొందుతారని ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

ఆధార్ మహా భద్రం!

సూపర్ కంప్యూటరైనా ఛేదించలేనంత పటిష్ఠం
రాజ్యాంగ ధర్మాసనానికి యూఐడీఏఐ 'పీపీటీ'

- **ప్రమాణీకరణలో ఇబ్బందులున్న మాట నిజమే**
- **లోటుపాట్లను చక్కదిద్దగల యంత్రాంగమేదీ లేదు**
- **బయోమెట్రిక్ సరిపోలకపోయినా సేవలు ఆగరాదు**
- **వివిధ మంత్రిత్వ శాఖలకు పలుమార్లు సూచించాం**
- **సుప్రీంలో విశిష్ట గుర్తింపు ప్రాధికార సంఖ్య సీఈవో**

న్యూఢిల్లీ, మార్చి 22: దేశ పౌరుల జీవసంబంధ సమాచారం నిక్షిప్తమైన 'ఆధార్'కు అత్యంత పటిష్ఠమైన భద్రత ఉందని విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (యూఐడీఏఐ) స్పష్టం చేసింది. గురువారం సుప్రీంకోర్టులో 80 నిమిషాలపాటు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చిన సందర్భంగా సంస్థ ముఖ్య కార్యనిర్వహణాధికారి అజయ్ భూషణ్ పాండే ఈ మేరకు వెల్లడించారు. చీఫ్ జస్టిస్ దీపక్ మిశ్రా నేతృత్వంలోని ఐదుగురు జడ్జిల రాజ్యాంగ ధర్మాసనం ఆధార్‌పై దాఖలైన పలు పిటిషన్లపై సామూహిక విచారణ నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆధార్‌కు '2048-ఎన్‌క్రిప్షన్ కీ' (సంకేత నిక్షిప్త సందేశం) సహిత రక్షణ ఉన్నదని పాండే వివరించారు. దీన్ని ఛేదించాలంటే సూపర్ కంప్యూటర్‌కైనా 1300 కోట్ల సంవత్సరాలు పడుతుందని ధీమాగా ప్రకటించారు. ఆధార్ సమాచారం ఒక్కసారి కేంద్ర సమాచార భాండాగారానికి చేరితే దాన్ని జాతీయ భద్రత కారణాలుంటే తప్ప ఎవరితోనూ పంచుకునే ప్రసక్తే లేదని తెలిపారు. అందువల్ల ఎలాంటి పరిస్థితుల్లోనైనా ఈ సమాచార చౌర్యం మానవమాత్రులెవరికీ సాధ్యంకాదని స్పష్టీకరించారు. ఆధార్ అధీకృత ప్రమాణీకరణ కోసం నిత్యం యూఐడీఏఐకి 4 లక్షలదాకా విజ్ఞప్తులు అందుతుంటాయని పాండే తెలిపారు. అయితే, సదరు లావాదేవీ ఉద్దేశంతోపాటు సంబంధిత ప్రదేశం వివరాలను సేకరించడం ఉండదన్నారు. ఆధార్ ఇప్పటికే సురక్షితమైనా ప్రమాణీకరణలో మరింత భద్రత కోసం జూలై 1 నుంచి 'ముఖ'గుర్తింపు ప్రక్రియను ప్రవేశపెడుతున్నట్లు వెల్లడించారు. అయితే, ఆధార్ తనిఖీలో అధీకృత ప్రమాణీకరణ సవ్యంగా కావడంలేదంటూ సేవలు నిరాకరిస్తున్నట్లు పౌరుల నుంచి అందుతున్న ఫిర్యాదుల మాటేమిటని ధర్మాసనం ఈ సందర్భంగా ప్రశ్నించింది. ఇటువంటి పరిస్థితిని చక్కదిద్దడానికి మీరేం చేస్తారంటూ నిలదీసింది. అయితే, ప్రతి సమస్యనూ ఆధార్ తోడ్పాటుతో పరిష్కరించడం సాధ్యం కాదని పాండే వివరించారు. ప్రమాణీకరణలో వైఫల్యం కీలకమైనదని, అలాంటి స్థితి ఏర్పడినప్పటికీ పౌరులకు లబ్ధి అందేలా చూడాల్సి ఉందని జస్టిస్ చంద్రచూడ్ వ్యాఖ్యానించారు. దీనిపై పాండే స్పందిస్తూ- ఆధార్ ప్రాతిపదికన తనిఖీతో నూరుశాతం జీవసంబంధ (బయోమెట్రిక్) ప్రమాణీకరణకు హామీ ఇవ్వలేమన్నారు. ఆధార్ గుర్తింపు సంఖ్యతో ముడిపడి ఉన్న పౌరుల జీవసంబంధ వివరాలు సరిపోలని సందర్భాల్లో దాన్ని చక్కదిద్దగల వ్యవస్థాగత యంత్రాంగం ఏదీలేదని కూడా ఆయన అంగీకరించారు. యంత్రాంగం ఏర్పాటు కోసం పలుమార్లు ప్రభుత్వానికి నివేదించినట్లు గుర్తుచేశారు. అలాగే వివరాలు సరిపోలనంతమాత్రాన పౌరులకు సేవలు నిరాకరించవద్దని కూడా వివిధ మంత్రిత్వ శాఖలకు పదేపదే సూచించినట్లు తెలిపారు. ఇంటర్నెట్ కనెక్షన్ సమస్యలు, లోపభూయిష్ఠ పరికరాలు వంటి పలు కారణాలవల్ల ఆధార్ వివరాలు సరిపోలని దుస్థితి ఏర్పడుతుందని వివరించారు. అందువల్ల పౌరుల గుర్తింపునకు ఆధార్‌ను మాత్రమే ప్రాతిపదికగా తీసుకోవడం కుదరదని స్పష్టం చేశారు.



సుష్మాకు సభాహక్కుల నోటీసు!

- ఇచ్చేందుకు సిద్ధమవుతున్న కాంగ్రెస్
- ఇరాక్ మృతులపై తప్పుదోవ పట్టించారు
- సభను ఇన్నాళ్లుగా చీకట్లో ఉంచారు
- రూ. కోటి పరిహారం.. ఒకరికి ఉద్యోగం
- ఇవన్నీ కేంద్రం ఇవ్వాల్సిందే: కాంగ్రెస్ ఎంపీలు

న్యూఢిల్లీ, మార్చి 22: ఇరాక్‌లోని మోసుల్ నగరంలో 2014లో కిడ్నాపైన 39 మంది భారతీయుల మరణంపై ఇన్నాళ్లుగా సభను తప్పుదోవ పట్టించినందుకు రాజ్యసభలో విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి సుష్మాస్వరాజ్‌పై సభా హక్కుల ఉల్లంఘన నోటీసు ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. ఈ ఘటనపై పూర్తి సమాచారం, తగిన పత్రాలు సిద్ధం చేసిన తర్వాత తాము తీర్మానానికి నోటీసు ఇస్తామని కాంగ్రెస్ ఎంపీలు అంబికా సోనీ, ప్రతాప్ బాజ్వా, షంషేర్ సింగ్ డుల్లో తెలిపారు. నాలుగేళ్లుగా ఆ 39 మంది ప్రాణాలతోనే ఉన్నట్లుగా ఆమె చెప్పడంతో ప్రజలతో పాటు సభ కూడా ఇన్నాళ్లుగా నమ్ముతూ వచ్చిందని వాళ్లు ఆరోపించారు. తమ సమాచారం సరైనదని రుజువైందని, వాళ్ల విశ్వసనీయ సమాచారం తప్పని తేలిపోయిందని అంబికా సోనీ అన్నారు. ఈ అంశాన్ని ఇన్నాళ్లుగా డీప్ ఫ్రిజ్‌లో పెట్టినది విదేశీ వ్యవహారాల మంత్రేనని, ఇది ఆమె బాధ్యతేనని మండిపడ్డారు. మోసుల్ విషాదాన్ని తొక్కిపెట్టాలని కేంద్రం ప్రయత్నిస్తోందని, తాము ఈ అంశాన్ని లేవనెత్తేందుకు ఎన్ని ప్రయత్నాలు చేసినా వాళ్లు స్పందించలేదని అన్నారు. వాళ్లు మరణించినట్లు తమకు సుమారు ఏడాది క్రితం తెలిసిందని, కానీ ప్రభుత్వం మాత్రం ఇన్నాళ్లూ చలనరహితంగా ఉండిపోయిందని సోనీ విమర్శించారు. హర్‌జీత్ మాసీ చెప్పిన విషయం నిజమని తేలిందని.. సుష్మాస్వరాజ్ తన విశ్వసనీయ వర్గాలేంటో వెల్లడించాలని ప్రతాప్ బాజ్వా ప్రశ్నించారు. ప్రజల సెంటిమెంట్లతో ఎందుకు ఆడుకుంటున్నారన్నారు. కనీసం ఇంతవరకు మృతుల కుటుంబాలకు పరిహారం కూడా ప్రకటించలేదని.. వాళ్లకు కోటి రూపాయల పరిహారంతో పాటు కుటుంబ సభ్యులలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కూడా ఇవ్వాలని, కోటిరూపాయలు, ఉద్యోగాలు ఇవ్వాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదేనని ఆయన అన్నారు.

ఖాతాలో డబ్బుల్లేనప్పుడు కార్డు గీకితే మోతే!

- 'ట్రాన్సాక్షన్ డిక్లైన్' వస్తే చార్జీ
- ఒక్కో ట్రాన్సాక్షన్‌కు రూ.17-25 ఫైన్
- జీఎస్టీ అదనం.. పలు బ్యాంకుల నిర్ణయం

ముంబై, మార్చి 22: ఓవైపు ప్రభుత్వం డిజిటల్ పేమెంట్స్ అంటూ డెబిట్, క్రెడిట్ కార్డుల ద్వారా చెల్లింపులను ప్రోత్సహిస్తుంటే.. మరోవైపు బ్యాంకులు మాత్రం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నాయి. ఏటీఎంలో డెబిట్ కార్డ్ స్వైప్ చేసినపుడు 'ట్రాన్సాక్షన్ డిక్లైన్ 'అని వస్తే చార్జీ పడనుంది. అకౌంట్‌లో కనీస నిల్వలు లేని సమయంలో డెబిట్ కార్డు ట్రాన్సాక్షన్ డిక్లైన్డ్ అని వస్తుంది. ఈ సమయంలో ప్రతి స్వైప్‌కు రూ.17 నుంచి రూ.25 వరకు చార్జీ పడనుంది. దీనికి జీఎస్టీ అదనం. ఏటీఎంలో అయినా, పీఓఎస్ మెషీన్‌లో అయినా ట్రాన్సాక్షన్ డిక్లైన్ వస్తే చార్జి పడనుంది. ఈ మేరకు ప్రముఖ బ్యాంకులైన ఎస్‌బీఐ, హెచ్‌డీఎఫ్‌సీ, ఐసీఐసీఐ ఈ నిర్ణయం తీసుకున్నాయి. ఎస్‌బీఐ 17 రూపాయల చార్జీ విధిస్తుండగా.. హెచ్‌డీఎఫ్‌సీ, ఐసీఐసీఐ బ్యాంకులు రూ.25 వసూలు చేయనున్నాయి. కాగా, ఇది అత్యంత దారుణమైన చార్జీలని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇది కచ్చితంగా ప్రభుత్వ డిజిటల్ పేమెంట్స్ కార్యక్రమాన్ని నిర్వీర్యం చేస్తుందని ఐఐటీ బాంబే ప్రొఫెసర్ ఆశిష్ దాస్ అభిప్రాయపడ్డారు. కాగా, చెక్ నిరాకరించినపుడు చార్జీలు వసూలు చేసినట్లే... దీనికీ చేస్తున్నామని బ్యాంకులు వాదిస్తున్నాయి. ఒకవేళ డెబిట్ కార్డులను దుర్వినియోగం చేస్తున్నారని భావిస్తే నెలకు రెండు అవకాశాలు ఇచ్చి, తర్వాత చార్జీలు వసూలు చేస్తే బాగుంటుందని ఆశిష్ దాస్ చెప్పారు.

అమరుల పిల్లలకు ఊరట

- రూ.10వేల ఫీజు రాయితీ పరిమితికి స్వస్తి
- విద్యా సాయంపై కేంద్ర ఆర్థిక శాఖ ఆదేశం

న్యూఢిల్లీ, మార్చి 22: కర్తవ్య నిర్వహణలో అమరులైన, అవయవ నష్టానికిగురైన సైనికుల పిల్లలకు విద్యా సాయంపై పరిమితిని కేంద్ర ప్రభుత్వం రద్దు చేసింది. నిరుడు జూలైనాటి ఆదేశాల ప్రకారం ఈ పరిమితి నెలకు రూ.10 వేలుగా ఉందని సంబంధిత అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో త్రివిధ దళాల సైనిక సిబ్బంది డిమాండ్ మేరకు సదరు పరిమితిని తొలగిస్తూ తాజా ఉత్తర్వులిచ్చిందని పేర్కొన్నారు. అయితే, ప్రభుత్వ-ప్రభుత్వ సాయం పొందే వాటితోపాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించిన విద్యా సంస్థలలో చదువుకుంటున్న వారికి మాత్రమే ఈ సహాయం వర్తిస్తుందని ఈ ఆదేశాల్లో స్పష్టం చేసింది. అలాగే ప్రభుత్వాల ఆర్థిక మద్దతుగల స్వయంప్రతిపత్తి విద్యా సంస్థల్లో చదివే సైనికుల పిల్లలకూ వర్తిస్తుందని వివరించింది. కాగా, 1972లో ఈ పథకాన్ని ప్రారంభించినప్పుడు జారీ చేసిన ఉత్తర్వుల్లో అమరవీరుల, దివ్యాంగ సైనికుల పిల్లలకు ట్యూషన్ ఫీజును పూర్తిగా రద్దుచేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. అటుపైన ఏడో వేతన సవరణ సంఘం సిఫారసు మేరకు నిరుడు జూలైలో ఫీజు రాయితీ రూ.10వేలకు మించరాదని ప్రభుత్వం పరిమితి విధించింది. ఈ పథకం కింద దాదాపు 2,679 మంది విద్యార్థులు లబ్ధి పొందుతుండగా ప్రభుత్వ నిర్ణయం ఫలితంగా వారిలో 250 మంది విద్యాభ్యాసంపై ప్రభావం పడింది. ఈ ఆదేశాలపై ఆనాటినుంచే సైనిక సిబ్బంది తీవ్ర నిరసన, అసంతృప్తి ప్రకటిస్తున్నారు. ఈ నేపథ్యంలో సదరు పరిమితిని తొలగించాలని కోరుతూ త్రివిధ దళాధిపతులు రక్షణ మంత్రిత్వ శాఖకు లేఖలు రాశారు. తదనుగుణంగా ఆ శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఇటీవల ఆర్థిక శాఖకు విజ్ఞప్తి చేయగా తాజా ఆదేశాలు జారీ అయ్యాయి.

తప్పు జరిగింది.. క్షమించండి

2 కోట్ల మంది నమ్మకాన్ని కోల్పోయాం.. డేటా చౌర్యంపై జుకర్‌బర్గ్ వివరణ

- **ఇటువంటివి మళ్లీ జరగనీయబోం**
- **పటిష్టమైన భద్రతా ప్రమాణాలతో చెక్**
- **ప్రజాభిప్రాయం ప్రభావితం కానివ్వం**
- **భారత్.. బ్రెజిల్ ఎన్నికలపై అప్రమత్తం**
- **ఏఐతో ఫేక్ ఖాతాలు.. వార్తలకు కళ్లెం**
- **ఫేస్‌బుక్ వ్యవస్థాపకుడు మార్క్ వెల్లడి**



వాషింగ్టన్, మార్చి 22: ఫేస్‌బుక్ ఖాతాదారులకు సంస్థ వ్యవస్థాపకుడు మార్క్ జుకర్‌బర్గ్ క్షమాపణలు చెప్పారు. 'తప్పు జరిగింది.. మమ్మల్ని క్షమించండి. ఇది పునరావృతం కాకుండా అన్ని చర్యలు తీసుకుంటాం' అంటూ వేడుకొన్నారు. ఫేస్‌బుక్ యూజర్ల వ్యక్తిగత సమాచారం చోరీ చేసి ట్రంప్ ఎన్నికల ప్రచారానికి వాడుకొన్న కేంబ్రిడ్జి అనలిటికా వ్యవహారంపై ఆయన స్పందించారు. దీనిపై అమెరికా కాంగ్రెస్ ఎదుట ఆయన వివరణ ఇచ్చారు. దాదాపు రెండు కోట్ల మంది ఖాతాదారుల నమ్మకాన్ని కోల్పోయామని, ఇటువంటిది మళ్లీ జరగనీయబోమని చెప్పారు. ఫేస్‌బుక్ ద్వారా స్నేహితులు, బంధువులను దగ్గర చేసే ప్రయత్నంలో కొన్ని యాప్స్ సాయం తీసుకోవాల్సి వచ్చిందని, ఆ సమయంలో కొంత మంది తప్పుడు వ్యక్తులను ఎంచుకోవడం వల్ల తప్పులు జరిగాయని వివరించారు. తాము చేసిన సాంకేతిక, వ్యాపార పరమైన తప్పిదాలకు చింతిస్తున్నామని చెప్పారు. ఈ తరహా ఘటనలు మళ్లీ జరగకుండా పటిష్ఠమైన భద్రతా ప్రమాణాలను ఇప్పటికే అందుబాటులోకి తెచ్చామని పేర్కొన్నారు. ఫేస్‌బుక్‌తో అనుసంధానంగా ఉండే వేలాది యాప్‌లను పునఃపరిశీలిస్తున్నామని వివరించారు. ఫేస్‌బుక్ నిబంధనలకు విరుద్ధంగా వ్యక్తిగత సమాచారాన్ని సేకరించే యాప్‌లపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

ఖాతాదారులకు సీఏ చోరీ వివరాలు

కేంబ్రిడ్జి అనలిటికా (సీఏ) వ్యవహారంపై తన ఫేస్‌బుక్ పేజీలో జుకర్‌బర్గ్ సుదీర్ఘ వివరణ ఇచ్చారు. ఫేస్‌బుక్‌ను 2007లో స్థాపించానని, ఇందులో జరిగే తప్పులకు తానే బాధ్యత వహిస్తున్నానని, ఇటువంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఫేస్‌బుక్ ఖాతాదారుల సమాచారాన్ని కాపాడాల్సిన బాధ్యత తమపై ఉందని, ఈ పని చేయలేకపోతే దీన్ని నడిపే అర్హత లేనట్లేనని పేర్కొన్నారు. కేంబ్రిడ్జి అనలిటికా చోరీ చేసిన వ్యక్తిగత వివరాలను మొత్తం వారి వద్ద నుంచి డిలీట్ చేశామని చెప్పారు. సీఏ చోరీ చేసిన ఖాతాల వివరాలను ఆయా వినియోగదారులకు వ్యక్తిగతంగా తెలియజేస్తామని జుకర్‌బర్గ్ ప్రకటించారు. ఇకపై ఈ తరహా డేటా చౌర్యం జరగకుండా తీసుంటున్న చర్యలను జుకర్‌బర్గ్ వివరించారు. తమ నిబంధనలకు విరుద్ధంగా వినియోగదారుల సమాచారాన్ని థర్డ్‌పార్టీ యాప్‌లు యాక్సిస్ చేయకుండా నివారిస్తామని పేర్కొన్నారు.

ఎన్నికల్లో ఇతరుల్ని వేలుపెట్టనివ్వం

భారత్, బ్రెజిల్ వంటి దేశాల్లో వచ్చే ఏడాదిలో జరగబోయే ఎన్నికల్లో ఫేస్‌బుక్‌ను అడ్డంపెట్టుకుని ఫలితాలను ప్రభావితం చేసే ప్రయత్నాలను నివారిస్తామని జుకర్‌బర్గ్ స్పష్టం చేశారు. అమెరికాలోని ఓ మీడియా సంస్థకు ఆయన గురువారం ఇంటర్వ్యూ ఇచ్చారు. ప్రజాభిప్రాయం ఎట్టిపరిస్థితుల్లో ప్రభావితం కాకుండా చర్యలు తీసుకుంటామని, ఫేస్‌బుక్ వేదికగా ఫేక్ వార్తల వ్యాప్తిని అడ్డుకుంటామని ఈ సందర్భంగా జుకర్‌బర్గ్ తెలిపారు. ఇందు కోసం పటిష్ఠమైన భద్రతా ప్రమాణాలను ఇప్పటికే అందుబాటులోకి తెచ్చామని స్పష్టం చేశారు. భారత ప్రజాస్వామ్యంలో ఓటర్లను ప్రభావితం చేసే ప్రయత్నం చేసినా.. పౌరుల వ్యక్తిగత సమాచారం చోరీ జరిగినా ఫేస్‌బుక్ తీవ్ర పరిణామాలను ఎదుర్కోవలసి వస్తుందని కేంద్ర ఐటీ శాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ ఆ సంస్థను హెచ్చరించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో జుకర్‌బర్గ్ తాము తీసుకుంటున్న భద్రతా ప్రమాణాలను వివరించారు. కృత్రిమ మేధ (ఏఐ) సాయంతో ఫేస్‌బుక్‌లో నకిలీ ఖాతాలను, ఫేక్ వార్తలను గుర్తించి వాటిని తొలగిస్తున్నామని పేర్కొన్నారు. ఫ్రెంచ్, అమెరికా ఎన్నికల్లో తప్పుడు వార్తలను ప్రచారం చేసి ఓటర్లను ప్రభావితం చేసేందుకు రష్యా చేసిన ప్రయత్నాలను ఈ వ్యవస్థ ద్వారా అడ్డుకున్నామని చెప్పారు. రానున్న బ్రెజిల్, భారత్ ఎన్నికల నేపథ్యంలో మరింత అప్రమత్తంగా వ్యవహరిస్తున్నామని, బయటి శక్తులు ఆయా దేశాల ఎన్నికల్లో వేలు పెట్టకుండా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు.



సీఏతో రాహుల్‌కు సంబంధాలు

- కేంద్రమంత్రి రవిశంకర్ ప్రసాద్ ఆరోపణ
- ఇరాక్‌లో భారతీయుల మృతి కేంద్రం వైఫల్యం
- ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఆరోపణలు: రాహుల్

న్యూఢిల్లీ, మార్చి 22: ఫేస్‌బుక్ ఖాతాదారుల సమాచారాన్ని చోరీ చేసిన కేంబ్రిడ్జి అనలిటికా (సీఏ)తో రాహుల్ గాంధీకి సంబంధాలు ఉన్నాయని కేంద్రమంత్రి రవిశంకర్ ప్రసాద్ ఆరోపించారు. రాహుల్ గాంధీ గబ్బర్ సింగ్ టాక్స్ వంటి వ్యాఖ్యలు సీఏతో బంధం ఏర్పడిన తర్వాత చేసినవేనని, ఆ మార్పును స్పష్టంగా గమనించవచ్చని ఆయన అన్నారు. సీఏకు చెందిన భారత అనుసంబధ సంస్థ ఒవ్లెనో బిజినెస్ ఇంటెలిజెన్స్ (ఓబీఐ) 2010 బిహార్ ఎన్నికల్లో కాంగ్రెస్, జేడీయూ కోసం పని చేసిందని, ఈ సంస్థ ఫేక్ న్యూస్‌ను ఫేస్‌బుక్ ద్వారా ప్రచారం చేయడంలో దిట్ట అని ఆరోపించారు. అయితే ఈ ఆరోపణలను కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ ఖండించారు. ఉద్దేశ పూర్వకంగా ఈ అవాస్తవ అంశాన్ని కేంద్ర ప్రభుత్వం తెరపైకి తీసుకొచ్చిందని ఆయన ధ్వజమెత్తారు. ఇరాక్‌లో 39 మంది భారతీయులు ప్రాణాలు కోల్పోయారని, ఆ విషయంలో కేంద్రం వైఫల్యం ఉందని, దానిని నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు ఈ ఆరోపణలు చేస్తున్నారంటూ ట్విటర్ ద్వారా తెలిపారు. ఫేస్‌బుక్ డేటా లీకేజీపై తొలిసారిగా స్పందించిన రాహుల్ విభిన్నంగా బీజేపీపై వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ''సమస్య: 39 మంది భారతీయులు చనిపోయారు. ప్రభుత్వం తెరమీదకు వచ్చి అబద్ధాలు ఆడుతూ దొరికిపోయింది. పరిష్కారం: కాంగ్రెస్‌పై సమాచారం దొంగిలింపు అని ఓ కొత్త కథను కనుగొంది. ఫలితం: మీడియాలో దీనిపై ఎప్పటిలాగే విస్తృత చర్చ.. 39 మంది భారతీయులు రాడార్ నుంచి కనుమరుగు.. సమస్యకు పరిష్కారం'' అంటూ రాహుల్ వినూత్నంగా ట్వీట్ చేశారు. కాగా, దీనిపై కేంద్ర మంత్రి రవిశంకర్ ప్రసాద్ స్పందించారు. ఇరాక్‌లో భారతీయుల మృతిపై సుష్మా స్వరాజ్ భావోద్వేగంతో లోక్‌సభలో ప్రకటన చేయబోతే సభ్యులు అడ్డుకున్నారని, ఇటువంటి ఘటనను కూడా రాహుల్ రాజకీయం చేయడం దారుణమని ఆయన మండిపడ్డారు.



టెక్నోమాక్.. రూ. 6వేల కోట్లు!

- హిమాచల్ ప్రదేశ్‌లో మరో కొత్త మోసం
- ఐఏఎస్ అధికారి కుమారుడి నిర్వాకం
- **కంపెనీ మూసేసి పారిపోయిన డైరెక్టర్లు**
- **రాష్ట్రంలోనే అతి పెద్ద మోసమన్న సీఐడీ**

నహన్, మార్చి 22: దేశంలో రోజురోజుకు సరికొత్త ఆర్థిక మోసాలు వెలుగుచూస్తున్నాయి. తాజాగా రూ. 6వేల కోట్ల కుంభకోణం కేసులో హిమాచల్ ప్రదేశ్‌కు చెందిన ఇండియన్ టెక్నోమాక్ కంపెనీ డైరెక్టర్ వినయ్‌కుమార్ శర్మను సీఐడీ అధికారులు అరెస్టు చేశారు. ఐఏఎస్ అధికారి ఎంఎల్ శర్మ కుమారుడైన వినయ్‌ని కోర్టులో ప్రవే శపెట్టగా మూడు రోజుల పాటు సీఐడీ కస్టడీకి ఇచ్చారు. రాష్ట్రంలోనే అతిపెద్ద ఆర్థిక మోసం అయిన ఈ కేసుపై గత నాలుగేళ్లుగా వివిధ శాఖలు విచారణ జరుపుతున్నాయి. ఉద్యోగులకు జీతాలు, ప్రభుత్వ వర్గాలకు పీఎఫ్, ఆదాయపన్ను, అమ్మకపు పన్ను, విద్యుత్ బిల్లులు అన్నీ కలిపి కోట్లాది రూపాయల మేర చెల్లించకుండా టోపీ పెట్టి 2014 మార్చి నెలలో తన ఉత్పత్తులన్నీ ఆపేసి ఉన్నట్టుండి కంపెనీ మూసేసి మాయమయ్యారు. ఈ సంస్థ ఎండీ, కేసులో ప్రధాన నిందితుడైన రాకేశ్ కుమార్ శర్మ కోసం సీఐడీ గాలిస్తోంది. ఆయన దేశంలో ఉన్నాడో లేదో కూడా తెలియడం లేదు. నీరవ్ మోదీ దాదాపు రూ. 12వేల కోట్ల మేర మోసం చేసిన విషయం బయటకు తెలిసినప్పుడే ఈ కేసు కూడా బయటపడింది. ఈ కంపెనీ దాదాపు రూ. 6వేల కోట్ల మేర మోసం చేసినట్లు తెలుస్తోంది. నకిలీ ఆర్టీజీఎస్ ద్వారా హిమాచల్ ప్రదేశ్ రాష్ట్ర విద్యుత్‌బోర్డుకు కోట్లాది రూపాయలు బిల్లులు చెల్లించినట్లు చూపించడం, భారీగా పన్ను ఎగవేతలు, బినామీ పేర్లతో భూముల కొనుగోళ్లు, హిమాచల్‌ప్రదేశ్ భూసంస్కరణల చట్ట ఉల్లంఘన లాంటి అనేక నేరాలకు వీళ్లు పాల్పడ్డారు. రాకేశ్‌శర్మ, ముగ్గురు డైరెక్టర్లు వినయ్ కుమార్ శర్మ, రంగనాథన్ శ్రీనివాసన్, అశ్వనీ కుమార్ సాహూలపై ఐపీసీ 420, 467, 468, 471, 34ల కింద కేసులు పెట్టారు. ఈ సంస్థ పన్ను ఎగవేత వల్ల తమకు దాదాపు రూ. 2175 కోట్ల నష్టం వాటిల్లిందని రాష్ట్ర ఎక్సైజ్, పన్నుల శాఖ తెలిపింది.

ఈడీలో ఇంటిదొంగ!

- సొంతశాఖ అధికారి ఇళ్లలో ఈడీ సోదాలు
- మనీలాండరింగ్ కేసులో అనుమానాలు
- లంచాలు తీసుకున్న గుర్నామ్ సింగ్?
- ఆయన గతంలో ఈడీ డిప్యూటీ డైరెక్టర్

న్యూఢిల్లీ/చండీగఢ్, మార్చి 22: ఆర్థిక నేరాలకు సంబంధించిన కేసులను దర్యాప్తు చేస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)లో ఇంటిదొంగలు పడ్డారా? తాజాగా ఆ సంస్థ చేసిన సోదాలు చూస్తే అలాగే అనిపిస్తోంది. రూ. 600 కోట్ల బురిడీ స్కీంకు సంబంధించిన మనీలాండరింగ్ కేసు దర్యాప్తులో భాగంగా గురువారం ఈడీ అధికారులు తమ సొంత శాఖకే చెందిన మాజీ డిప్యూటీ డైరెక్టర్ గుర్నామ్ సింగ్ ఇంట్లో సోదాలు చేశారు. ఆయనతో పాటు న్యాయవాది పునీత్ శర్మ, చండీగఢ్, మొహాలీలలోని మరో వ్యక్తి ఇళ్లలో కూడా సోదాలు చేశారు. బురిడీ స్కీం కేసు విచారణ బృందంలో గుర్నామ్ సింగ్ కూడా ఉండేవారు. గత జనవరిలో ఆయనను ఈడీ అందులోంచి తప్పించింది. ఈడీ చండీగఢ్ జోన్‌కు గతంలో డిప్యూటీ డైరెక్టర్‌గా వ్యవహరించిన సింగ్.. దాదాపు నాలుగు నుంచి ఆరు కోట్ల రూపాయల వరకు లంచాలు తీసుకుని లాయర్ పునీత్ శర్మ చెప్పినట్లు చేసేవారని ఈడీ అధికారులు ఆరో పిస్తున్నారు. ఈ విషయంలో మరిన్ని ఆధారాలు సంపాదించేందుకే సోదాలు చేశామన్నారు. సంస్థలో అవినీతిని ఎట్టిపరిస్థితుల్లో సహించేది లేదని ఈడీ డైరెక్టర్ కర్నాల్ సింగ్ గట్టిగా హెచ్చరించారు. ఈ కేసుకు సంబంధించి ఈడీ గతసంవత్సరం భారీగా సోదాలు చేసి చిట్‌ఫండ్ సంస్థకు చెందిన ప్రధాన ఏజెంటు కమల్ కె. బక్షిని అరె స్టుచేసింది. వేలాది మంది సామాన్యులను భారీ లాభాలు వస్తాయని మోసం చేసి రూ. 600 కోట్లకు పైగా మోసం చేశారని ఈడీ చెబుతోంది. ఈ స్కీం వెనక సూత్రధారి ఒక మలేసియన్ అతడి పేరు ముకుందన్ గంగమ్ అని ఈడీ అధికారులు చెప్పారు.

'అమ్మ' ఉన్నప్పుడు సీసీ నిఘా లేదు

- **జయలలిత ఆస్పత్రిలో చేరినప్పటి నుంచి మరణం వరకు**
- ఆ 75 రోజులు సీసీ కెమెరాలు ఆపేశారు
- కమిషన్‌కు పూర్తి సమాచారం ఇచ్చాం
- అపోలో ఆస్పత్రి చైర్మన్ ప్రతాప్‌రెడ్డి



చెన్నై, మార్చి 22: తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి జయలలిత చికిత్స నిమిత్తం అపోలో ఆస్పత్రిలో చేరిన దగ్గరి నుంచి ఆమె మరణం వరకు సీసీ కెమెరాలు ఆపేశారని అపోలో ఆస్పత్రి చైర్మన్ ప్రతాప్‌రెడ్డి చెప్పారు. చెన్నైలో జరుగుతున్న అపోలో ఇంటర్నేషనల్ కొలేటరల్ సింపోజీయం-2018 కార్యక్రమంలో భాగంగా గురువారం ప్రతాప్ రెడ్డి విలేకరులతో మాట్లాడారు. జయలలిత మరణంపై విచారణకు నియమించిన జస్టిస్ ఏ ఆర్ముగస్వామి కమిషన్‌కు ఆస్పత్రి నుంచి పూర్తి సమాచారాన్ని అందజేశామని చెప్పారు. సీసీ టీవీ ఫుటేజీను కూడా కమిషన్‌కు అందజేశారా అని విలేకరులు ప్రశ్నించగా, జయలలిత ఆస్పత్రిలో ఉన్న 75 రోజులు వారు సీసీ కెమెరాలు ఆపేశారన్నారు. 24 పడకల ఉన్న ఐసీయూ విభాగంలో ఒక పడకను జయలలిత కోసం వినియోగించారని, అయితే వార్డు మొత్తం ఆమెకు కేటాయించామన్నారు. అదే ఐసీయూలో ఉన్న ఇతర రోగులను వేరే ఐసీయూకు తరలించామని చెప్పారు. జయలలిత ఆస్పత్రిలో చేరినప్పటీ నుంచి ఆ ఐసీయూ వద్ద భద్రత పెంచారని, ఆ ప్రాంతంలో ఉన్న అన్ని సీసీ కెమెరాల కనెక్షన్లను తొలగించారని, లోపల ఎం జరుగుతుందో ఇతరులకు తెలియకుండా ఉండడం కోసమే వారు అలా చేశారని, జయలలితను కలవాలని ఎవ్వరూ వచ్చినా లోపలికి అనుమతించే వారు కాదని చెప్పారు. తమ వైద్యులు శాయశక్తుల కృషి చేశారని, దురదృష్టవసాత్తు 69 ఏళ్ల నాయకురాలు గుండెపోటుతో మరణించారని చెప్పారు. అనారోగ్యంతో బాధపడుతున్న జయలలిత 2016, సెప్టెంబర్ 22న ఆస్పత్రిలో చేరారు. డిసెంబర్ 4వ తేదీన కార్డియోక్ అరెస్టుతో కున్నుమూశారు. డిసెంబర్ 5న ఆమె మరణవార్తను ప్రకటించారు. ప్రస్తుతం ఆర్ముగస్వామి కమిషన్ జయలలిత మరణంపై విచారణ చేస్తోంది.


త్రివిక్రమ్, నితిన్, పవన్‌కల్యాణ్

ముఖ్య అతిథిగా...

నితిన్, మేఘా ఆకాశ్ నటిస్తోన్న చిత్రం 'ఛల్ మోహన్ రంగ'. పవన్‌కల్యాణ్ క్రియేటివ్ వర్క్స్, త్రివిక్రమ్, శ్రేష్ఠ్ మూవీస్ సంయుక్తంగా ఈ సినిమాను నిర్మిస్తున్నారు. కృష్ణ చైతన్య దర్శకుడు. మార్చి 25న ప్రీ రిలీజ్ ఫంక్షన్‌ను నిర్వహిస్తున్నామని.. ఈ ఫంక్షన్‌కు తన అభిమాన హీరో, చిత్ర నిర్మాత పవన్‌కల్యాణ్ ముఖ్య అతిథిగా రానున్నట్లు నితిన్ తన ట్విట్టర్ ద్వారా ప్రకటించారు. గతంలో నితిన్ హీరోగా నటించిన 'ఇష్క్, అఆ' చిత్రాల ఆడియో వేడుకలకు పవన్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. 'ఛల్ మోహన్ రంగ' సినిమాను ఏప్రిల్ 5న విడుదల చేస్తున్నారు.



మనందరి కథ

'ఈ కథ వినగానే నేను ఇంటర్ చదివే రోజుల్లో.. నేషనల్ బాస్కెట్‌బాల్ టీమ్‌కి ఎంపికై.. తల్లిదండ్రులు వద్దన్నారని మానుకున్న నా స్నేహితుడు గుర్తుకొచ్చాడు' అని అన్నారు నారా రోహిత్. శ్రీ విష్ణు హీరో గా నటించిన 'నీది నాది ఒకే కథ' చిత్రం శుక్రవారం(మార్చి 23) విడుదల కానుంది. వేణు ఊడుగుల దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో శ్రీ విష్ణు సరసన 'బిచ్చగాడు' ఫేమ్ సాట్నా టైటస్ జతగా కనిపించనున్నారు. ప్రశాంతి, కష్ణ విజయ్ మరియు అట్లూరి నారాయణ రావు అరాన్ మీడియా వర్క్స్ మరియు శ్రీ వైష్ణవి క్రియేషన్స్ బ్యానర్ లపై సంయుక్తంగా నిర్మించారు. ఈ సినిమా ప్రీ రిలీజ్ ఫంక్షన్ బుధవారం హైదరాబాద్‌లో జరిగింది. ఈ సందర్భంగా నారా రోహిత్ మాట్లాడుతూ ''అందరికీ కనెక్ట్ అయ్యే చిత్రమే 'నీది నాది ఒకటే కథ'. శ్రీవిష్ణు కారణంగానే ఇంత మంచి సినిమా చేయగలిగాను. సినిమా మార్చి 23న విడుదలవుతుంది'' అన్నారు. శర్వానంద్ మాట్లాడుతూ '' ఈ సినిమా ట్రైలర్ చూస్తుంటే నా కథలా అనిపించింది. సినిమాను నేను కొనుక్కుటే బావుంటుందనిపించింది. విజయ్‌కి కాల్ చేశాను. కానీ అప్పటికే సినిమా బిజినెస్ పూర్తయ్యిందని తను అన్నాడు. మంచి సినిమాను మిస్ చేసుకున్నానే అనిపించింది'' అన్నారు. శ్రీవిష్ణు మాట్లాడుతూ ''వేణుగారు కథ చెప్పినప్పుడు 'ఎంట్రా ఇదేదో నా స్టోరీలాగే ఉందే' అనిపించింది. ఎప్పుడైనా నా జీవితాన్ని సినిమాగా చూసుకోవాలంటే ఈ సినిమాను చూసుకోవచ్చు అనిపించి.. ఈ సినిమా చేయడానికి రెడీ అయ్యాను. ఈ సినిమా చేసినందుకు చాలా గర్వంగా ఉన్నాను. చాలా మంది సొసైటీ కోసం చదువుతుంటారు. అలా ఉండకూడదు. తల్లిదండ్రులు కూడా పిల్లలకు సపోర్ట్ ఇవ్వాలి. తల్లిదండ్రులే వారి పిల్లల్ని నమ్మాలి. మీరే నమ్మకపోతే..రేపు ప్రపంచం ఏం నమ్ముతుంది. కాబట్టి చదువుని చదువులాగానే ఉంచుదాం. 'నీది నాది ఒకే కథ'.. మనందరి కథ'' అన్నారు. జీవితంలో ప్రతి క్షణాన్ని ఆస్వాదించాలని చెప్పే సినిమా ఇది అని దేవి ప్రసాద్ అన్నారు. కార్యక్రమంలో యూనిట్ సభ్యుల పాల్గొన్నారు.

నా లైఫ్ ఇదేనని అప్పుడే అర్థమైంది

– కాజల్ అగర్వాల్



నందమూరి కల్యాణ్ రామ్, కాజల్ అగర్వాల్ జంటగా నటించిన చిత్రం 'ఎం.ఎల్.ఎ' మార్చి 23న సినిమా విడుదలవతుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో కాజల్ అగర్వాల్ మాట్లాడుతూ – ''లక్ష్మీ కల్యాణం' చిత్రంల తర్వాత కల్యాణ్ రామ్‌తో చేస్తున్న సినిమా ఇది. అంటే పన్నెండేళ్ల తర్వాత ఇద్దరం మళ్లీ కలిసి నటించడం ఆనందంగా ఉంది. ఈ పన్నెండేళ్లలో నటులుగా ఇద్దరం ఎంతో మార్పు చెందాం. ఆ అనుభవాలనే ఈ సినిమా సమయంలో ఒకరితో ఒకరు పంచుకున్నాం. ఇంత గ్యాప్ తర్వాత కల్యాణ్‌ని కలిసినప్పుడు నా పాత స్నేహితుడిని కలిసినట్లు అనిపించింది. ఈ గ్యాప్‌లో ఓ పబ్లిక్ ఫంక్షన్‌లో కలిశానంతే. మధ్యలో ఎప్పుడూ కలవలేదు. అందుకు ప్రత్యేకమైన కారణాలేమీ లేవు. ఎవరి వ్యక్తిగత జీవితాలతో, కుటుంబాలతో బిజీగా ఉండటమే. హీరోయిన్‌గా 'ఒక సినిమా చేస్తే చాలు. మానేసి వెనక్కి వెళ్లిపోయి ఎం.బి.ఎ చదువుకుందామనిపించింది. కానీ జీవితం వేరేలా ఉంటుంది కదా! నటిగా నా ప్రయాణం పట్ల, నేను సాధించిన దాన్ని పట్ల చాలా హ్యాపీగా ఉన్నాను. దేవుడికి, తెలుగు ప్రేక్షకులకు ఇంత మంచి లైఫ్ ఇచ్చి..వారి కుటుంబంలో నన్ను ఒకరిగా భావించినందుకు కృతజ్ఞతలు. నాకు తెలుగు ఇండస్ట్రీలోనే లైఫ్ అని ఐదు సినిమాలు చేసిన తర్వాత అనిపించింది. నా 'మగధీర' చేసేటప్పుడు వందశాతం ఇదే నా లైఫ్ అని అర్థమైంది. 'ఎం.ఎల్.ఎ' సినిమా విషయానికి వస్తే.. ఇందులో నేను ఎన్నారై అమ్మాయి పాత్రలో కనపడతాను. నా క్యారెక్టర్‌లో ఓ షేడ్ ఉంటుంది. అది ఇంటర్వెల్ వరకు కనపడ దు. దానికి కారణాలేంటో తెలియాలంటే సినిమా చూడాల్సిందే. అలాగే సినిమాలో మంచి మెసేజ్ కూడా ఉంది. సినిమా అంతా ఎంటర్‌టైనింగ్‌గా ఉంటుంది. నటిగా వీలైనంత కొత్తదనం ఉన్న సినిమాలు చేయడానికి ప్రయత్నిస్తూనే ఉన్నాను. నందమూరి కల్యాణ్‌రామ్ తను చేసే పని పట్ల చాలా నిజాయితీగా, ప్యాషన్‌తో ఉంటాడు. నటిగా కమర్షియల్ సినిమాలు, కొత్త తరహా సినిమాలను బ్యాలెన్స్ చేస్తుండటమే నా సక్సెస్ సీక్రెట్'' అన్నారు.

వారు హీరోయిన్స్ కారు.. వ్యభిచారులు – నేహా



తమిళంలో భారీ చిత్రాలతో పాటు తెలుగు, తమిళంలో మీడియం బడ్జెట్ చిత్రాలను చేస్తూ కొత్త టాలెంట్‌ను ఎంకరేజ్ చేస్తున్న నిర్మాత కె.ఇ.జ్ఞానవేల్ రాజా. ఈయన భార్య నేహా కాస్ట్యూమ్స్ డిజైనర్. బుధవారం నేహా.. హీరోయిన్స్ టార్గెట్ చేస్తూ చేసిన ట్వీట్స్ పెద్ద దుమారాన్ని లేపాయి. హీరోయిన్స్ వేశ్యలతో పోల్చుతూ నేహా ట్వీట్స్ చేయడం గమనార్హం. ఆమె ట్విట్టర్‌లో స్పందిస్తూ.. ''ఆడవాళ్లకి ఆడవాళ్లే శత్రువులు. నేను అందరూ హీరోయిన్స్‌ను అనడం లేదు. కొందరినే అంటున్నాను. హీరోయిన్స్‌ను ఇండస్ట్రీలో అడ్జస్ట్ అవ్వాలని అంటారో లేదో తెలియదు కానీ..కొందరు మాత్రం బెడ్ రెడీ అన్నట్లు ఉంటారు. అడ్జస్ట్ అవమని అడిగితే హీరోయిన్స్ నో చెప్పి వెళ్లిపోలేరా? లైమ్ లైట్‌లో ఉండటానికనో, డబ్బులు సంపాదించడానికనో చేసే ప్రయత్నమే ఇదంతా. ఇలా కాపురాలను కూల్చేవారికి వార్నింగ్ ఇవ్వాలి. మగాళ్లు ఏమీ పసిపిల్లలు కారు. వీరు లిమిట్‌లో ఉంచాలని ప్రయత్నించినా! వారు హద్దులు దాటుతుంటారు. మొగుడ్ని కంట్రోల్ పెట్టడమే కాదు.. ఇలాంటి హీరోయిన్స్‌ను కూడా హద్దుల్లో పెట్టడం కూడా భార్య బాధ్యతే. కొందరు హీరోయిన్స్‌ను అలాంటి చర్యలు ఆపాలని బ్రతిమాలినా ఆపేలా లేరు. వారిని రోడ్డుకీడుస్తాను. వారిని హీరోయిన్స్ అనడం కంటే వ్యభిచారులు అని అనాలేమో'' అని ఘాటు వ్యాఖ్యలు తర్వాత నేహా తన ట్వీట్స్‌ను డిలీట్ చేశారు. తర్వాత 'నేను పబ్లిసిటీ కోసం ఇదంతా చేయడం లేదు. నాకు, నా భర్తకు మధ్య ఏ గొడవలు లేవు. అయితే నా చుట్టూ ఉన్న సమాజంలో జరుగుతున్న ఘటనలపై నా స్పందన ఇది. ఇక్కడ స్పందించడం వల్ల ఉపయోగం లేదని అర్థం కావడంతో ఆ వ్యాఖ్యలను తీసేశాను'' అంటూ నేహా మళ్లీ ట్వీట్స్‌లో తెలిపారు.



సందేశం ప్రధానంగా 'ప్రశ్నిస్తా'



జనమ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై రూపొందుతున్న చిత్రం 'పశ్నిస్తా'. గురువారం హైదరాబాద్‌లోని అన్నపూర్ణ స్టూడియోలో మొదలైంది. ఈ సినిమాకు రాజా వన్నెంరెడ్డి దర్శకుడు. సత్యారెడ్డి నిర్మాత. బి.శేషుబాబు సమర్పి స్తున్నారు. ముహూర్తపు సన్నివేశానికి జెమిని కిరణ్ కెమెరా స్విచ్చాన్ చేశారు. దర్శకుడు బాబి (రవీందర్) క్లాప్ కొట్టారు. బి.గోపాల్ గౌరవ దర్శకత్వం వహించారు. బి.వి.రెడ్డి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం నిర్మాత మాట్లాడుతూ ''మా సంస్థలో ఇప్పటిదాకా ఎన్నో సినిమాలు చేశాను. గత రెండేళ్లుగా మా అబ్బాయి నటనకు కావాల్సిన శిక్షణను పొందుతున్నాడు. ఈ చిత్రం మెసేజ్ ఓరియంటెడ్‌గా ఉంటుంది.. కమర్షియల్ హంగులూ ఉంటాయి'' అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ ''గురువారం నుంచి రెగ్యులర్ షూటింగ్ జరుగుతుంది. పది రోజులు హైదరాబాద్‌లో షూటింగ్ చేస్తాం. ఆ తర్వాత పది రోజులు గ్యాప్ తీసుకుంటాం. ఆ తర్వాత మరో 20 రోజులు కూడా షూటింగ్ చేస్తాం. దాసరిగారు ప్రధాన పాత్రగా ఓ సెటైరికల్ కమర్షియల్ చిత్రాన్ని తీద్దామనుకున్నాను. కానీ కుదరలేదు. ఆయన ఎక్కడున్నా ఆయన ఆశీర్వాదాలు నాకు ఉంటాయని నమ్ముతాను'' అని తెలిపారు. ఈ కార్యక్రమంలో హీరో మాట్లాడుతూ ''కథ చాలా బావుంటుంది. టైటిల్‌కి తగ్గట్టుగానే సినిమా ఆసక్తికరంగా ఉంటుంది'' అని తెలిపారు. సంగీత దర్శకుడు ప్రేమ్, మాటల రచయిత రాజేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

టెంపర్ పెంచనుందా?


రాశీ ఖన్నా

తెలుగులో ఎన్టీఆర్, పూరి జగన్నాథ్ కలయికలో రూపొందిన సినిమా 'టెంపర్'. లంచగొండియైన ఓ పోలీస్ ఆఫీసర్ నిజాయితీ పరుడిగా ఎలా మారాడన్నదే కథ. తెలుగులో ఈ సినిమా పెద్ద విజయాన్ని సాధించింది. ఇప్పుడు ఈ సినిమాను తమిళం, హిందీ భాషల్లో తెరకెక్కిస్తున్నారు. హిందీలో 'సింబా' పేరుతో రణవీర్ సింగ్, సారా అలీ ఖాన్ హీరో హీరోయిన్లుగా సినిమాను రోహిత్ శెట్టి తెరకెక్కిస్తున్నారు. ఇక తమిళ విషయానికి వస్తే హీరో విశాల్ ఈ రీమేక్‌లో నటిస్తున్నారు. ఎ.ఆర్.మురుగదాస్ వద్ద దర్శకత్వ శాఖలో పనిచేసిన వెంకట్ మోహన్ సినిమాను డైరెక్ట్ చేస్తున్నారు. ఈ సినిమాలో హీరోయిన్‌గా రాశీ ఖన్నా నటిస్తుంది. త్వరలోనే ఈ విషయమై అధికారిక ప్రకన రానుంది. తెలుగులో సక్సెస్‌ఫుల్ హీరోయిన్‌గా రాణిస్తున్న రాశీ ఖన్నాకు 'టెంపర్' రీమేక్ కోలీవుడ్‌లో ఎలాంటి బ్రేక్ తెచ్చి పెడుతుందో వేచి చూడాల్సిందే.

స్తంభించిన రహదారులు

- అన్ని పార్టీలు, ప్రజా సంఘాల ఆందోళన
- ఏపీలో జాతీయ రహదారులపై రాస్తారోకో
- రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని డిమాండ్
- విభజన హామీలు నెరవేర్చాలని నినాదాలు

(మనం న్యూస్ నెట్‌వర్క్)

ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు కోసం ప్రజలు రోడ్డెక్కారు. గురువారం రాష్ట్ర వ్యాప్తంగా జాతీయ రహదారులను దిగ్బంధించారు. ప్రత్యేక హోదా సాధన సమితి, వామపక్షాలు, వైసీపీ, జనసేన, కాంగ్రెస్ శ్రేణులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నాయి. అధికార టీడీపీ కూడా మద్దతు ప్రకటించింది. అన్ని జిల్లాల్లో అన్ని పార్టీల నాయకులు ధర్నాలో పాల్గొన్నారు. ప్రత్యేక హోదా ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే విభజన చట్టంలోని హామీలను నెరవేర్చాలని కోరారు. ప్రత్యేక హోదా ఆంధ్రుల హక్కు అని నినదించారు. విశాఖ కేంద్రంగా రైల్వే జోన్ ప్రకటించాలని డిమాండ్ చేస్తూ విశాఖలో అఖిలపక్ష నాయకులు జాతీయ రహదారిని దిగ్బంధించారు. అనంతపురం-బెంగళూరు, విజయవాడ-హైదరాబాద్, చెన్నై-కలకత్తా జాతీయ రహదారులపై ఆందోళనకారులు రాస్తారోకో చేపట్టారు. ప్రధాని మోదీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వాహనాలను ఎక్కడికక్కడ అడ్డుకుని నిరసన తెలిపారు. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి.

శ్రీకాకుళంలో..

ఉద్యమాల ఖిల్లా శ్రీకాకుళంలో అన్ని పార్టీలు ఒకే తాటిపై నడిచాయి. ప్రత్యేక హోదా సంజీవని అంటూ నినదించాయి. ప్రత్యేక హోదా వస్తే కానీ రాష్ట్రానికి న్యాయం జరగదంటూ స్పష్టం చేశాయి. వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్మాన ప్రసాదరావు నేతృత్వంలో జాతీయ రహదారిని దిగ్బంధించారు. జిల్లా వ్యాప్తంగా టీడీపీ, కాంగ్రెస్, వామపక్షాల శ్రేణులు ఉద్యమబాట పట్టాయి.

విజయనగరంలో.

విజయనగరం జిల్లాలో జాతీయ రహదారుల దిగ్బంధం కార్యక్రమం విజయవంతమైంది. వామపక్షాలు, వైసీపీ, కాంగ్రెస్, జనసేన పార్టీలతో పాటు ప్రజా సంఘాలు సంయుక్తంగా పాల్గొన్నాయి. అధికార తెలుగు దేశం పార్టీ మాత్రం ఒంటరిగా నిరసన, సంఘీభావ కార్యక్రమాలు నిర్వహించింది. ఆంధ్రా, ఒడిశా జాతీయ రహదారిలో 2 గంటల పాటు ఎక్కడికక్కడ వాహనాలు నిలిచిపోయాయి.



పశ్చిమగోదావరిలో..



జిల్లాలో జాతీయ రహదారుల దిగ్బంధం విజవంతమైంది. ప్రత్యేక హోదా కోరుతూ బీజేపీ మినహా అన్ని పార్టీలు ఆందోళన చేపట్టాయి. ప్రజలు కూడా స్వచ్ఛందంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

తూర్పుగోదావరిలో..



తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా వామపక్షాలు, టీడీపీ, కాంగ్రెస్, వైసీపీ, జనసేన శ్రేణులు ఆందోళన చేపట్టాయి. 16వ జాతీయ రహదారిపై వివిధ పార్టీల నాయకులు బైఠాయించి కేంద్రానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

కర్నూలులో..

ప్రత్యేక హోదా సాధన కోసం పార్టీలకు అతీతంగా ప్రజా సంఘాలు, ప్రజలు రోడ్లపైకి వచ్చారు. అఖిల పక్ష పార్టీల ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా హైవేలు, రహదారులు దిగ్బంధించారు. కర్నూలులో వైసీపీ, కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, జనసేన, విద్యార్థి, కార్మిక, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో 44వ నంబర్ జాతీయ రహదారిపై బైఠాయించారు. అలాగే జిల్లా వ్యాప్తంగా రాస్తారోకోలు నిర్వహించారు.

చిత్తూరులో..

రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని డిమాండ్ చేస్తూ రాజకీయ పార్టీలు రోడ్డెక్కాయి. చిత్తూరు జిల్లాలో జాతీయ రహదారుల దిగ్బంధించారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అనేక రహదారుల్లో ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. ప్రత్యేక హోదా ఆంధ్రుల హక్కు అని, ప్రధాని నరేంద్ర మోదీ మొండి వైఖరి వీడి రాష్ట్రానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

ఇతర జిల్లాల్లో..

అనంతపురం, కడప, నెల్లూరు, ప్రకాశం, గుంటూరు జిల్లాల్లోనూ అన్ని పార్టీల నాయకులు, ప్రజా సంఘాలు రాస్తారోకో నిర్వహించారు. జాతీయ రహదారులను దిగ్బంధించారు. ప్రత్యేక హోదా ఇవ్వాలని డిమాండ్ చేశారు.

చంద్రబాబు కళ్లు తెరవాలి: రఘువీరా

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇప్పటికైనా కళ్లు తెరవాలని, ప్రత్యేక హోదా, విభజన చట్టంలోని హామీల అమలుకు పోరాటానికి కలిసి రావాలి ఏపీసీసీ అధ్యక్షుడు ఎన్.రఘువీరారెడ్డి అన్నారు. ఏపీకి ప్రత్యేక హోదా, విభజన చట్టంలోని హామీల అమలు చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన రహదారుల దిగ్బంధం కార్యక్రమం విజయవంతమైందని ఓ ప్రకటనలో తెలిపారు. ఈ డిమాండ్లకు కాంగ్రెస్ కట్టుబడి ఉందని, ఢిల్లీలో జరిగిన ప్లీనరీ సమావేశంలో ప్రత్యేక హోదాపై తీర్మానం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. చంద్రబాబు తన సొంత ప్రయోజనాల కోసం రాష్ట్రాన్ని మోదీకి తాకట్టు పెట్టారని, 4 ఏళ్లుగా బీజేపీతో కలిసి ప్రజలను మోసం చేశారని విమర్శించారు.

అరెస్ట్ చేయడం దుర్మార్గం: రామకృష్ణ

ప్రత్యేక హోదా కోసం జాతీయ రహదారుల దిగ్బంధంలో పాల్గొన్న వారందరికీ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ధన్యవాదాలు తెలిపారు. ఆందోళనకు సహకరిస్తామన్న రాష్ట్ర ప్రభుత్వం గుంటూరు, కర్నూలు, కాకినాడ, శ్రీకాకుళం తదితర చోట్ల నిరసనకారులను అరెస్టు చేయించడం దుర్మార్గమన అన్నారు. శుక్రవారం మచిలీపట్నంలో కాగడాల ప్రదర్శన చేస్తామని, అఖిలపక్షం, ప్రజాసంఘాలతో చర్చించి భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామన్న చెప్పారు. విజయవాడలో వైసీపీ నేతలతో కలసి రహదారు దిగ్బంధం కార్యక్రమంలో పాల్గొన్నారు.



హామీలను నెరవేర్చాలి: వైసీపీ

రహదారుల దిగ్బంధం కార్యక్రమం విజయవంతమైందని వైసీపీ నేత పార్థసారథి అన్నారు. విజయవాడలో వైసీపీ నేతలు పార్థసారథి ,మల్లాది విష్ణు, వెల్లంపల్లి శ్రీనివాస్ తదితరులు ధర్నాలో పాల్గొన్నారు. విభజన చట్టంలో పేర్కొన్న విధంగా హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు జగన్ నాయకత్వంలో రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు.



బీజేపీతో రాష్ట్రానికి ప్రమాదం: చలసాని

ఉత్తరాది బీజేపీతో రాబోయే రోజుల్లో రాష్ట్రానికి పెను ప్రమాదం పొంచి ఉందని ప్రత్యేక హోదా, విభజన హక్కుల సాధన సమితి కన్వీనర్ చలసాని శ్రీనివాస్‌రావు అన్నారు. కులాలు, మతాలు, జిల్లాల మధ్య విభేదాలు సృష్టించడానికి కేంద్రం కుట్రలు చేస్తోందని ఆరోపించారు. విజయనగరంలో ప్రత్యేక హోదా కోసం నిరాహార దీక్ష చేస్తున్న గజపతినగరం మాజీ ఎమ్మెల్యే సన్యాసినాయుడు మనుమడు డాక్టర్ తాడ్డి జశ్వంత్ నాయుడుకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా చలసాని మీడియాతో మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం నమ్మక ద్రోహం చేసిందంటూ ఆవేదన వ్యక్తం చేశారు. మోదీ, అమిత్ షా కోటరీ కలిసి ఆంధ్రప్రదేశ్ ఈ దేశంలో భాగంగా కాదన్న చందంగా వ్యవహరిస్తూ అన్యాయం చేస్తుందన్నారు. అన్ని రాజకీయ పార్టీలు ఏకతాటిపైకి వచ్చి హోదా కోసం పోరాటం చేయాల్సిన అవసరముందన్నారు. ఎంపీ సుజనా చౌదరి వంటి వారి వల్ల రాష్ట్రానికి ఏం మేలు జరిగిందంటూ ప్రశ్నించారు.

సీబీఐని పంపుతారా?

- కాగ్ నివేదిక ఇస్తే.. మాపై విచారణలా
- కావాలనే ఏపీపై కేంద్రప్రభుత్వం కుట్ర
- కేంద్రం పైనా కాగ్ పలు నివేదికలు
- వాటిపై సీబీఐ విచారణకు బీజేపీ సిద్ధమా
- మీరు పెట్టే కేసులకు భయపడతామా?
- 40 ఏళ్ల రాజకీయంలో నీతిగా బతికాను
- ఎవరికీ భయపడేది లేదు: అసెంబ్లీలో సీఎం
- కేంద్రం చేపడితే పోలవరం అయ్యేది కాదు
- రాష్ట్ర ప్రయోజనాల కోసమే మేం చేపట్టాం
- శాసనమండలిలో సీఎం చంద్రబాబు వెల్లడి

అమరావతి, మార్చి 22 (మనం ప్రతినిధి): పట్టిసీమ ప్రాజెక్టుపై 'కాగ్' ఇచ్చిన నివేదిక ఆధారంగా సీబీఐ ఎంక్వైరీ వేయాలని బీజేపీ నేతలు మాట్లాడుతున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. కావాలనే కేంద్రం కుట్ర చేస్తోందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వంపై కూడా కాగ్ పలు నివేదికలు ఇస్తుందని, వాటి ఆధారంగా కూడా సీబీఐ విచారణ జరిపించేందుకు బీజేపీ సిద్ధంగా ఉందా అంటూ ఆయన అసెంబ్లీలో గురువారం ప్రశ్నించారు. ప్రపంచ జలదినోత్సవ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజల సహకారంతో నీటి సమస్య పరిష్కారం కోసం ముందుకు వెళ్లాలని ఎమ్మెల్యేలకు పిలుపునిచ్చారు. ఉమ్మడి రాష్ట్రంలో నీరు-మీరు కార్యక్రమం చేపట్టామని, ఆ కార్యక్రమానికి మంచి స్పందన వచ్చిందని అన్నారు.

బీజేపీ కేసులకు భయపడతామా..?

''40 ఏళ్ల రాజకీయాల్లో నేను నీతిగా బతికాను. న్యాయం కోసం, రాష్ట్ర ప్రజల హక్కుల కోసం పోరాడుతున్నాం. చట్టంలో ఉన్న అంశాలు అమలు చేయాలని కేంద్రాన్ని అడిగా. అంతమాత్రానికే నాపై కేసులు పెట్టిస్తారా? ఏ1, ఏ2లు ప్రధాని ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నారు. నన్ను బోనులో ఎక్కించేవరకూ నిద్రపోనని.. విజయసాయిరెడ్డి సిగ్గులేకుండా మాట్లాడుతున్నారు. బీజేపీ పెట్టే కేసులకు ఎట్టి పరిస్థితుల్లో భయపడను. నామీద ఆరోపణలు చేయడం దారుణం. పోలవరంపై ఎక్కడా దాపరికం లేదు. ఖర్చులన్నీ ఆన్‌లైన్‌లో పెట్టాం. ఈ ప్రాజెక్టు పూర్తయితే దాదాపు రాష్ట్రంలో రెండు కోట్ల ఎకరాలకు నీరు అందించొచ్చు. అందుకే.. ప్రతిపక్షాలు కుట్రపన్ని ప్రాజెక్టును అడ్డుకోవాలని చూస్తున్నాయి. పవన్‌కల్యాణ్ కూడా నేను కావాలని ప్రాజెక్టు తీసుకున్నానని తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు'' అని చంద్రబాబు మండిపడ్డారు. ఆ తర్వాత శాసనమండలిలో మాట్లాడే సందర్భంలోనూ పోలవరం అంశాన్ని ఆయన ప్రస్తావించారు. ఈ ప్రాజెక్టుకు ఇప్పటివరకు రూ.13,201 కోట్లు ఖర్చు పెట్టామని చెప్పారు. పోలవరం ప్రాజెక్టు ఆలస్యం అవుతుందనే



పట్టిసీమ చేపట్టామని, దానిని ఏడాదిలోపు పూర్తి చేసి రూ.2,500 కోట్లు విలువైన పంటలను కాపాడామన్నారు. పట్టిసీమ వల్ల గోదావరి డెల్టా ఎడారిగా మారుతుందని రెచ్చగొట్టారని.. ఏదో అయిపోయిందని తప్పుడు ఆరోపణలు చేశారని సీఎం మండిపడ్డారు.

జలవనరులపై రూ. 52వేల కోట్లు

ఇప్పటి వరకు రాష్ట్రంలో జలవనరుల కోసం రూ. 52,400 కోట్లను ఖర్చుచేశామని సీఎం చంద్రబాబు తెలిపారు. పెన్నా-గోదావరి అనుసంధానానికి రూ. 80 వేల కోట్ల ఖర్చవుతుందని, దీని నిర్మాణంతో రెండుకోట్ల ఎకరాలకు సాగునీరు అందుతుందని ఆయన చెప్పారు. నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులు పూర్తయితే 25.41 లక్షల ఎకరాల నూతన ఆయకట్టు స్థిరీకరణ అవుతుందని ఆయన వివరించారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు ప్రయోజనం చేకూర్చేందుకు ఏడు ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తిచేసేందుకు నిర్ణయించుకున్నామని, వాటిలో కొన్ని ప్రాజెక్టుల పనులు కూడా పూర్తయ్యాయని చెప్పారు. వీటితోపాటు మరో 11 ప్రాజెక్టులను జూన్ లోపు పూర్తి చేస్తామని సీఎం తెలిపారు. నీరు-చెట్టుకింద 1071 చెరువులను అభివద్ధి చేశామని, 64,122 చెక్ డ్యాంలను నిర్మించామని వెల్లడించారు. 17,104 ఊట చెరువులతోపాటు 6.48 లక్షల పంట కుంటలను తవ్వామని ఆయన వివరించారు.

ఎవరు.. వారు?

- పవన్ టచ్‌లో ఉన్న 40 మందిపై టీడీపీ ఆరా
- జిల్లాలు, సామాజికవర్గాల వారీగా వడపోత
- జనసేన వద్ద 'సర్కారు అవినీతి' ఆధారాలు
- బహిర్గతం చేసేందుకు సిద్ధమవుతున్న పవన్
- త్వరలో అమరావతికి సీబీఐ బృందం?
- కొందరు ఐఏఎస్‌లను విచారించే చాన్స్!

(అమరావతి- మనం ప్రతినిధి)

'నేనేం ఆషామాషీగా ఆరోపణలు చేయడం లేదు.. 40 మంది టీడీపీ ఎమ్మెల్యేలు నా దగ్గరకు వచ్చి మొరపెట్టుకున్నారు' అంటూ జనసేన అధినేత పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలు తెలుగుదేశం పార్టీలో కలవరం పుట్టిస్తున్నాయి. ప్రభుత్వంలో జరుగుతున్న అవినీతికి సంబంధించిన సాక్ష్యాధారాలను కూడా పవన్ చేతికి వాళ్లు అందించారా అని తెగ మధన పడుతున్నారు. వాళ్లెవరో లెక్కతేల్చేందుకు సిద్ధమవుతున్నారు. ముందునుంచి పవన్‌తో కాస్త సన్నిహితంగా మెలుగుతున్న ఎమ్మెల్యేలు ఎవరన్న విషయం చంద్రబాబుకు కూడా తెలుసని జనసేన అంటోంది. అయితే.. ఆ సంబంధాలకు ఇంతవరకు రాజకీయ రంగు అంటలేదు. కానీ.. ప్రభుత్వ అవినీతి అంటూ పవన్ బహిరంగ విమర్శలు చేయడం, ఆయన వెంట తమవాళ్లే కొందరున్నారని తెలియడంతో పార్టీలో నిఘా ఒక్కసారిగా పెరిగిపోయింది. ఇప్పటివరకు తమకు తెలిసినవారితో పాటు.. తమకు తెలియకుండా ఎవరెవరు పవన్‌తో రహస్య సంబంధాలు కొనసాగిస్తున్నారో.. వాళ్లకు ఆయన నుంచి ఎలాంటి భరోసా అందుతోందన్న కోణంలో వివరాలు తెలుసుకునేందుకు టీడీపీ ముమ్మర యత్నాలు చేస్తోంది. తమ ఎమ్మెల్యేలు పవన్‌తో టచ్‌లో ఉన్నారంటూ జరిగే ప్రచారంలో వాస్తవం ఏమీ లేదని పైపైకి చెబుతున్నా, అంతర్గతంగా మాత్రం జనసేనతో టచ్‌లో ఉన్న వారిని లెక్కకట్టేందుకు గట్టిగానే కృషిచేస్తోంది.

అసంతృప్తులపై ఆరా

జిల్లాల వారీగా ఉన్న అధికారపార్టీ ఎమ్మెల్యేలు, వారి సామాజికవర్గాలు, వారి వైఖరి, పార్టీ కార్యక్రమాల్లో వారు చురుకుగా పాల్గొంటున్నారా.. ఆ జిల్లాకు చెందిన మంత్రితో వారి సంబంధాలు ఎలా ఉన్నాయి.. ప్రభుత్వంలో పనులు కావటం లేదని అసంతృప్తిగా ఉన్నారా.. ఇలా, ఎమ్మెల్యేలను వర్గీకరించి పార్టీపైన, ప్రభుత్వంపైనా వాళ్ల అభిప్రాయాలేంటో తెలుసుకునే ప్రయత్నాలు ప్రారంభించింది. ఎక్కువ మందిని బుజ్జగించి.. కొద్ది మందిని మాత్రం దూరంగా



పెట్టాలన్న నిర్ణయానికి వచ్చినట్టు సమాచారం. ఎమ్మెల్యేలపై ఒక అంచనాకు వచ్చేందుకు నిఘా వర్గాలను, తమకు అనుకూలంగా ఉన్న మీడియాను, పార్టీ ఇంటెలిజెన్స్‌ను కూడా వాడుకుంటున్నట్లు తెలుస్తోంది.

రిలీజ్ కు ఆధారాలు రెడీ

ప్రభుత్వంలో మంత్రుల అవినీతితో పాటు ఏకంగా సీఎం తనయుడు లోకేష్ బాబుపై పవన్ బహిరంగంగా అవినీతి ఆరోపణలు చేయడంతో పాటు.. వాటికి సంబంధించిన ఆధారాలను బయటపెట్టేందుకు రంగం సిద్ధం చేసినట్లు తెలిసింది. సమాధానం చెప్పుకోలేని స్థాయిలో ఉన్న డాక్యుమెంట్ ఆధారాలను ఒకటి రెండు రోజుల్లోనే బయటపెట్టేందుకు జనసేన నిర్ణయించుకున్నట్టు తెలిసింది. తనపై టీడీపీవైపు నుంచి కొనసాగుతున్న ప్రతిదాడి ఏ స్థాయికి వెళుతుందో చూశాక తన వద్ద ఉన్న ఆధారాలన్నింటినీ ప్రజల ముందు పెట్టాలని పవన్ భావిస్తున్నట్టు తెలిసింది. ప్రత్యేకించి శేఖర్‌రెడ్డి కేసులో లోకేష్ పాత్రను తెలియజెప్పే ఆధారాలు జనసేన వద్ద ఉన్నట్టు సమాచారం. 'పైస్థాయి' నుంచి కూడా దీనిపై ఆధారాలు అందడం వల్లే.. లోకేష్ అవినీతిపై కేంద్ర దర్యాప్తు సంస్థలు రంగంలోకి దిగి విచారణ చేపట్టాలని జనసేన డిమాండ్ చేసింది. లోకేష్‌పై పవన్ ఆధారాలు బయటపెడితే రాజకీయాలు కొత్త మలుపు తీసుకుంటాయన్న అభిప్రాయం కూడా వ్యక్తమవుతోంది.

ఏపీకి సీబీఐ బృందం?

పార్లమెంటు సమావేశాలు ముగిసిన తర్వాత సీబీఐ బృందం పక్కా ఆధారాలతో అమరావతి రానుందని.. ఐదుగురి వరకు సీనియర్ అధికారులను ప్రశ్నించబోతోందని ఢిల్లీ వర్గాల సమాచారం. సమాధానం చెప్పుకోలేని, గుక్క తిప్పుకోవటానికి వీల్లేని ఆధారాలతో భారీ అవినీతిని బయటపెట్టేందుకు రంగం సిద్ధమైనట్టు ప్రచారం జరుగుతోంది. దీంతో టీడీపీ, వైఎస్ఆర్‌సీపీ, జనసేన మధ్య అవినీతి ఆరోపణల మాటెలా ఉన్నా ఐఏఎస్‌ల గుండెల్లో గుబులు పుట్టుకుంది. అయితే, వందల కోట్ల రూపాయల అవినీతిని ఛేదించడమే లక్ష్యంగా సీబీఐ బృందం వస్తోందని అటు రాజకీయవర్గాల్లోనూ, ఇటు అధికార వర్గాల్లోనూ చర్చ జరుగుతోంది. దాంతో ఆ ఐదుగురు అధికారులు ఎవరన్న విషయమై చర్చలు, ఊహాగానాలు ఊపందుకున్నాయి. రాజకీయ పరిణామాలు వేడెక్కిన నేపథ్యంలో అధికారులను టార్గెట్ చేయటం ద్వారా రాష్ట్రంలో అవినీతి ఏ స్థాయిలో ఉందో తెలియజెప్పే ప్రయత్నం జరుగుతోందని పరిశీలకులు భావిస్తున్నారు.

కేంద్రం నుంచి మరిన్ని సమస్యలు

- అన్నింటికీ సిద్ధం: యనమల



అమరావతి, మార్చి 22 (మనం ప్రతినిధి): రానున్న రోజుల్లో కేంద్రం నుంచి రాష్ట్రానికి మరిన్ని సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉందని ఆర్థిక శాఖ మంత్రి యనమల రామకృష్ణుడు అన్నారు. అన్నింటికీ తాము కూడా సిద్ధమయ్యామని చెప్పారు. పార్లమెంటులో విభజన సమయంలో నెలకొన్న పరిస్థితులు ప్రస్తుతం కనిపిస్తున్నాయన్నారు. గురువారం అసెంబ్లీలోని తన చాంబర్‌లో మంత్రి మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. రాజ్యసభలో బీజేపీకి పూర్తిస్థాయి మెజార్టీ లేనందునే.. ఆ పార్టీ కొంత తగ్గి ప్రవర్తిస్తోందని అన్నారు. రాజ్యసభలో కూడా మెజార్టీ ఉంటే ఆ పార్టీ ఎలా ప్రవర్తించేదో అని యనమల అనుమానం వ్యక్తం చేశారు. దశాబ్దాల తర్వాత ప్రజల నుంచి కాంగ్రెస్ పార్టీ దూరమెందని, కానీ ప్రజల నుంచి దూరమయ్యేందుకు బీజేపీకి నాలుగేళ్లు పట్టిందని యనమల విమర్శించారు.

రాష్ట్రవ్యాప్తంగా 49 పీహెచ్‌సీలు

రాష్ట్రంలో మారుమూల ప్రాంతాల్లో 49 పీహెచ్‌సీలు ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మంత్రి యనమల రామకృష్ణుడు వెల్లడించారు. అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయ చౌదరి అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు.

మండలానికో జూనియర్ కళాశాల

- మంత్రి గంటా శ్రీనివాసరావు

ప్రతి మండలానికో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్టు మంత్రి గంటా శ్రీనివాసరావు వెల్లడించారు. రాష్ట్రంలో ఇతర మండలాల కన్నా కళాశాలలు లేని మండలాలకు ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. ఎక్కువ ప్రతిపాదనలు అందినట్లయితే.. సాధ్యాసాధ్యాలను నివేదికను పరిశీలించిన తర్వాత మంజూరు కోసం కొత్త కళాశాలలు అనుమతిస్తామని మంత్రి శ్రీనివాసరావు వెల్లడించారు.



నిరసన.. వాయిదా

- లోక్‌సభలో 4వ రోజూ అదే దృశ్యం
- అన్నాడీఎంకే, టీఆర్ఎస్ ఆందోళన
- సభ ఆర్డర్‌లో లేదని స్పీకర్ ప్రకటన
- మళ్లీ చర్చకు రాని అవిశ్వాస తీర్మానం

న్యూఢిల్లీ, మార్చి 22: వరుసగా నాలుగు రోజులుగా లోక్‌సభలో అవే దృశ్యాలు. సభ ప్రారంభం కావడం.. వెంటనే అన్నాడీఎంకే, టీఆర్ఎస్ ఎంపీలు ఆయా డిమాండ్లపై ఆందోళన చేపట్టడం.. ఆయా సమస్యలపై ఇతర పార్టీల సభ్యులు గళం విప్పడం.. ఇలా నినాదాలు, నిరసన మధ్య అవిశ్వాసం తీర్మానం చర్చకు రాకుండానే సభ వాయిదా పడుతోంది. గురువారం కూడా లోక్‌సభలో ఇదే పరిస్థితి. ఎలాంటి కార్యక్రమాలు, చర్చలు చేపట్టకుండానే శుక్రవారానికి వాయిదా పడింది. తెలంగాణలో రిజర్వేషన్ల కోటా పెంచాలని టీఆర్ఎస్, కావేరి నీటి యాజమాన్య బోర్డు ఏర్పాటు చేయాలనే డిమాండ్‌తో అన్నాడీఎంకే సభ్యులు ఆందోళన చేపట్టారు. వెల్‌లోకి దూసుకెళ్లి ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. టీడీపీ, వైసీపీ ఇచ్చిన అవిశ్వాసం నోటీసులపై చర్చ చేపట్టాలని కాంగ్రెస్, లెఫ్ట్ ఎంపీలు డిమాండ్ చేశారు. అవిశ్వాస తీర్మానం సహా బ్యాంకు కుంభకోణం, అన్ని అంశాలపై చర్చించేందుకు సిద్ధంగా ఉన్నామని, సభ్యులు వెల్‌లో నుంచి తమ సీట్ల వద్దకు వెళ్లాలని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి అనంత్‌కుమార్ కోరారు. స్పీకర్ సుమిత్రా మహాజన్ అవిశ్వాసం నోటీసును పరిశీలనకు తీసుకోగా.. అన్నాడీఎంకే ఎంపీలు నిరసన కొనసాగించారు. సభను ఆర్డర్‌లోకి తీసుకురావాలని కాంగ్రెస్, టీఎంసీ, లెఫ్ట్ సభ్యులు డిమాండ్ చేశారు. సభ్యులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ ఆందోళన చేస్తున్నందున అవిశ్వాస తీర్మానానికి అవసరమైన మద్దతు ఇచ్చే 50 ఎంపీలను లెక్కించడం వీలు కాదని స్పీకర్ పేర్కొన్నారు. తీర్మానాన్ని పరిశీలించి, చర్చకు చేపట్టాలని కాంగ్రెస్ సభా పక్ష నేత మల్లికార్జున ఖర్గే పలుమార్లు స్పీకర్‌ను కోరారు. అవిశ్వాస తీర్మానానికి మద్దతుగా లెఫ్ట్ సభ్యులు చేతులెత్తారు. కాగా సభ ఆర్డర్‌లో లేకుంటే తీర్మానం చేపట్టడం సాధ్యంకాదని స్పీకర్ ప్రకటించారు. సభ్యులు ఆందోళన మధ్యే సభను వాయిదా వేశారు. అంతకుముందు కేంద్ర న్యాయ శాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ బిల్లులు ప్రవేశపెట్టేందుకు ప్రయత్నించినా ఎంపీల ఆందోళనతో సాధ్యంకాలేదు. రోజూ మాదిరిగా రాజ్యసభలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ఆయా డిమాండ్లపై టీడీపీ, కాంగ్రెస్, అన్నాడీఎంకే సభ్యులు ఆందోళనకు దిగారు. కేంద్ర కార్మిక శాఖ మంత్రి సంతోష్ కుమార్ గంగ్వార్ కీలకమైన గ్రాట్యుటీ చెల్లింపు సవరణ బిల్లును పరిశీలనకు ఉంచగా.. ఎంపీల నిరసనల మధ్యే ఎలాంటి చర్చా లేకుండా మూజువాణి ఓటుతో ఆమోదించారు. కేంద్ర మంత్రి విజయ్ గోయల్ మాట్లాడుతూ.. సభ్యులు ఆందోళన విరమించి తమ సీట్ల వద్దకు వెళ్లాలని, అన్ని అంశాలపై చర్చించేందుకు సిద్ధంగా ఉన్నామని కోరారు. సభ్యులు శాంతించకపోవడంతో సభ వాయిదా పడింది. మార్చి 5న పార్లమెంటు బడ్జెట్ రెండో విడత సమావేశాలు ప్రారంభమైనప్పటి నుంచి ఎంపీల ఆందోళనతో వాయిదాల పర్వం కొనసాగుతోంది.

విపక్ష నేతలతో గోయల్ భేటీ


పార్లమెంటులో నెలకొన్న ప్రతిష్ఠంభనను తొలగించేందుకు కేంద్ర మంత్రి విజయ్ గోయల్.. ముఖ్యమైన ప్రతిపక్ష నేతలను వారి నివాసాల్లో కలసి చర్చలు జరపనున్నారు. కాంగ్రెస్, అన్నాడీఎంకే, టీడీపీ, టీఆర్ఎస్ పార్టీల నేతలను కలవనున్నట్టు గోయల్ చెప్పారు. విపక్షాలు డిమాండ్ చేస్తున్న అంశాలపై చర్చించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. పార్లమెంటు కార్యక్రమాల నిర్వహణకు నిమిషానికి 2.5 లక్షలు ఖర్చు చేస్తున్నామని, ఎంపీలు ఉభయ సభల్లో సమస్యలను లేవనెత్తి చర్చించాలని కోరారు. 14 రోజులుగా విపక్షాల ఆందోళనతో పార్లమెంటు సమావేశాలకు అంతరాయం కలుగుతున్న సంగతి తెలిసిందే.

జిల్లాకో శిల్పారామం:అఖిల ప్రియ

అమరావతి, మార్చి 22: రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో తెలుగు వైభవాన్ని ప్రతిబిం బించే శిల్పారామాలను ఏర్పా టు చేయడానికి కృషి చేస్తున్నా మని ఏపీ పర్యాటక, సాంస్క ృతిక శాఖ మంత్రి భూమా అఖిలప్రియ తెలిపారు. గతంలో హైదరాబాద్‌లో మాత్రమే ఉన్న శిల్పారామాన్ని విభజన తర్వాత ఇక్కడ అన్ని జిల్లాలలో ఏర్పాటు చేయాలని చంద్రబాబు సంకల్పించారన్నారు. అసెంబ్లీలో ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి అడిగిన ప్రశ్నకు మంత్రి అఖిలప్రియ ఈ మేరకు సమాధానమిచ్చారు. తెలుగు వైభవాన్ని చాటాలన్న లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్‌లో జిల్లాకో శిల్పారామం ఏర్పాటు తమ ప్రభుత్వ నిర్ణయించిందని ఆమె తెలిపారు.

సెన్సెక్స్ మార్చి 22 2018


33,006.27 ▼-129.91



పెరిగినవి	%	తగ్గినవి	%
ఓఎన్‌జీసీ	2.45	ఎస్‌బీఐ	-2.46
ఇండస్‌ఇండ్	1.41	విప్రో	-2.32
టాటా మోటార్స్	1.29	ఎం అండ్ ఎం	-2.14
రిలయన్స్	1.22	ఐసీఐసీఐ బ్యాంకు	-2.09
సన్ ఫార్మా	0.64	మారుతీ సుజుకి	-2.01

నిఫ్టీ మార్చి 22 2018

10114.75 ▼-40.50



పెరిగినవి	%	తగ్గినవి	%
వేదాంత	2.12	బీపీసీఎల్	-3.70
ఓఎన్‌జీసీ	1.91	హెచ్‌పీసీఎల్	-2.96
టాటా మోటార్స్	1.30	ఎస్‌బీఐ	-2.60
ఇండస్‌ఇండ్	1.25	విప్రో	-2.30
రిలయన్స్	1.25	ఐసీఐసీఐ బ్యాంకు	-2.06

టాప్ లూజర్స్ 22 మార్చి

34,757.16


పాయింట్లు	బి.ఎస్.ఇ సెన్సెక్స్	%
241.60	ఎస్‌బీఐ	-2.46%
288.70	విప్రో	-2.32%
729.80	ఎం అండ్ ఎం	-2.14%
283.55	ఐసీఐసీఐ బ్యాంకు	-2.09%
8699.00	మారుతీ సుజుకి	-2.01%
2107.70	డాక్టర్ రెడ్డీస్	-1.60%
358.15	అదానీ పోర్ట్స్	-1.58%
1154.80	ఇన్ఫోసిస్	-1.18%
519.80	యాక్సిస్ బ్యాంకు	-1.06%
2825.00	బజాజ్ ఆటో	-1.00%

▼ -309.59

బులియన్ | గత 7 రోజులు



రూపాయి వర్సెస్ డాలర్



ఆర్‌కాం ఆస్తుల అమ్మకానికి బ్రేక్

- యథాతథ స్థితిని కొనసాగించాలంటూ సుప్రీం కోర్టు ఆదేశం
- తదుపరి విచారణ ఏప్రిల్ 5కి వాయిదా

న్యూఢిల్లీ: బ్యాంకుల కన్సార్టియం చేసిన అభ్యర్థన మేరకు ఆర్‌జియోకు రిలయన్స్ కమ్యూనికేషన్స్‌కు చెందిన ఆస్తుల అమ్మకంపై యథాతథ స్థితిని నిర్వహించవలసిందిగా సుప్రీం కోర్టు గురువారంనాడు ఆదేశించింది. ఆర్‌కాం ఆస్తుల అమ్మకంపై బొంబాయి హైకోర్టు జారీ చేసిన స్టేటీని తొలగించేందుకు న్యాయమూర్తులు ఎ.కె.గోయల్, ఆర్.ఎఫ్. నారిమన్, యు.యు.లలిత్‌లతో కూడిన ధర్మాసనం తిరస్కరించింది.

బ్యాంకుల కన్సార్టియం చేసే విన్నపాలను, ఆస్తుల అమ్మకంపై స్టేకి వ్యతిరేకంగా ఆర్‌కాం చేసే వాదనలను ఉన్నత న్యాయస్థానం ఏప్రిల్ 5న వింటుంది. ఆర్‌కాం కన్సాలిడేటెడ్ ఆస్తులపై ఎరిక్‌సన్ చేస్తున్న క్లైమును అనుమతిస్తూ ట్రైబ్యునల్ ఇచ్చిన ఆర్డరును భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్.బి.ఐ) బుధవారం సుప్రీం కోర్టులో సవాల్ చేసింది. ట్రైబ్యునల్ ఇచ్చిన ఉత్తర్వును బొంబాయి హైకోర్టు కూడా ధ్రువీకరించింది. భారతీయ రుణ దాతలకు ఆర్‌కాం రూ. 42,000 కోట్లు బకాయి పడింది. అనిల్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ కమ్యూనికేషన్స్, రిలయన్స్ ఇన్‌ఫ్రాటెల్, రిలయన్స్ టెలికాంలు ఆర్‌కాం కన్సాలిడేటెడ్ ఇన్‌కార్పొరేట్ల కిందకు వస్తాయి.

ఎస్.బి.ఐతోపాటు సంయుక్త రుణ దాతల సముచ్చయంలోకి బ్యాంక్ ఆఫ్ బరోడా, బ్యాంక్ ఆఫ్ ఇండియా, కెనరా బ్యాంక్, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, పంజాబ్ నేషనల్ బ్యాంక్, ఐ.డి.బి.ఐ. బ్యాంక్, యుకో బ్యాంక్, ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్, దేనా బ్యాంక్, కార్పొరేషన్ బ్యాంక్, యూనియన్ బ్యాంక్, యునైటెడ్ బ్యాంక్, ఎల్.ఐ.సి, బార్‌క్లేస్ బ్యాంక్‌లు వస్తాయి. ఆర్‌కాం కన్సాలిడేటెడ్ ఆస్తుల బిడ్డింగ్ ద్వారా అవి అమ్మకానికి శ్రీకారం చుట్టాయి.

స్పెక్ట్రం, సెల్ టవర్లు, 1.78 లక్షల కిలోమీటర్ల ఫైబర్ ఆప్టిక్స్ లైనుతో సహా ఇతర మౌలిక వసతులతో కూడిన దుస్థితిలో ఉన్న ఆర్‌కాం కన్సాలిడేటెడ్ ఆస్తులను రూ. 17,300 కోట్లకు కొనుగోలు చేసేందుకు రిలయన్స్ జియో ఇన్ఫోకామ్ (జియో) అంగీకరించింది. సెక్యూర్డ్ ఆస్తులను నగదుగా మార్చుకోవడంతోపాటు, ఢిల్లీ, చెన్నైలలో ఉన్న రిలయన్స్ కన్సాలిడేటెడ్‌కు చెందిన రెండు ఆస్తులను రూ. 800 కోట్లకు మూడవ పక్షానికి విక్రయించాలని ప్రతిపాదించారు.

అయితే, జియో బిడ్ ఖరారైన తర్వాత, రుణాల భారంతో కుంగిపోయిన ఆర్‌కాం తనకు రూ. 1150 కోట్లు చెల్లించవలసి ఉందని క్లైమ్ చేస్తూ, ఆర్‌కాం కన్సాలిడేటెడ్ ఆస్తుల అమ్మకాన్ని నిరోధించవలసిందిగా కోరుతూ మధ్యవర్తిత్వ ట్రైబ్యునల్‌ను ఎరిక్‌సన్ ఆశ్రయించింది. ఎరిక్‌సన్‌కు అనుకూలంగా ట్రైబ్యునల్ మార్చి 5న ఆదేశించింది. దానికి వ్యతిరేకంగా ఆర్‌కాం చేసుకున్న అప్పీలును హైకోర్టు మార్చి 5న తోసిపుచ్చింది.



ఆర్‌కాం కన్సాలిడేటెడ్ నుంచి ఎస్.బి.ఐకి రావలసిన బకాయిలే రూ. 4,027 కోట్ల మేరకు ఉన్నాయి. ఎస్.బి.ఐ వంటి సెక్యూర్డ్ రుణ దాతల దారికి అన్‌సెక్యూర్డ్ రుణ దాత (ఎరిక్‌సన్) రాలేదని పేర్కొంటూ తన న్యాయవాది సంజయ్ కపూర్ ద్వారా హైకోర్టు నిర్ణయాన్ని ఎస్.బి.ఐ తన అప్పీలులో సవాల్ చేసింది.

నష్టపోయిన సెన్సెక్స్, నిఫ్టీలు

మార్కెట్లను ముప్పిరిగొన్న వాణిజ్య యుద్ధ భయాలు

ముంబయి: అంతర్జాతీయ వాణిజ్య యుద్ధ భయాలు మళ్ళీ రేగడం, యూరోపియన్ మార్కెట్లలో వాటిల్లిన నష్టాల వల్ల రియల్టీ, క్యాపిటల్ గూడ్స్, ఆటో, బ్యాంకింగ్, టెక్ విభాగాల్లో లాభాల స్వీకరణతో బొంబాయి స్టాక్ ఎక్స్ఛేంజి (బి.ఎస్.ఇ) సున్నిత సూచి 'సెన్సెక్స్' గురువారంనాడు 130 పాయింట్లు నష్టపోయింది. 30 షేర్ల 'సెన్సెక్స్' 33,206.99 పాయింట్ల వద్ద బలమైన స్థితిలోనే మొదలై ట్రేడింగ్ మొదట్లో 33,206.99 పాయింట్ల అధిక స్థాయిని తాకింది. కానీ, చైనాపై నూతన ఆంక్షలు విధించే అంశాన్ని అమెరికా అధ్యక్షుడు పరిశీలిస్తున్నారని వార్తలు రావడంతో, తాజాగా ఆందోళనలు మొదలయ్యాయి. దాంతో మధ్యాహ్న ట్రేడింగ్‌లో 'సెన్సెక్స్' 32,963.31 పాయింట్ల అల్ప స్థితికి జారిపోయింది. 'సెన్సెక్స్' వరుసగా రెండు రోజులుగా లాభపడుతున్న గమనం నుంచి వైదొలగి, 129.91 పాయింట్లు నష్టపోయి, 33,006.27 పాయింట్ల వద్ద ముగిసింది. బ్యాంకింగ్ రంగ షేర్లు తగ్గడంతో, నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజి (ఎన్.ఎస్.ఇ) 50 షేర్ల సూచి 'నిఫ్టీ' 40.50 పాయింట్లు క్షీణించి 10,114.75 పాయింట్ల వద్ద ముగిసింది. అది గురువారం ట్రేడింగ్‌లో 10,105.40 పాయింట్ల నుంచి 10,207.85 పాయింట్ల మధ్య ఊగిసలాడింది. ''సీవై18 రేటు హెచ్చింపు గతిపై ఫెడ్ వ్యాఖ్యానం ఎక్కువ అతి ధోరణిలో లేకపోవడం, ప్రతిగా, అమెరికా 10 ఏళ్ళ బాండ్ ప్రతిఫలం తగ్గడంతో, మార్కెట్ సానుకూల ధోరణిలోనే మొదలైంది. అయితే, వాణిజ్య యుద్ధ భయాలు తిరిగి తెరపైకి రావడంతో యూరప్, ఆసియాలోని ఇతర మార్కెట్లు క్షీణించడంతో ఆ లాభాలు స్వల్పకాలికమైనవే అయ్యాయి'' అని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ పరిశోధన విభాగాధిపతి వినోద్ నాయర్ అన్నారు. ''మదుపరులు ప్రతి ర్యాలీని అమ్మకానికి ఒక అవకాశంగా వినియోగించుకుంటున్నారు'' అని ఆయన అన్నారు.



చైనాపై అలజడి

మేధాపరమైన ఆస్తి హక్కులు, టెక్నాలజీ బదలీల విషయంలో బీజింగ్ ఇచ్చిన మాటలు తప్పుతోందనడానికి అమెరికా వద్ద బలమైన ఆధారాలున్నాయని అమెరికా వాణిజ్య ప్రతినిధి చెప్పడంతో, చైనాపై వైట్ హౌస్ రేపు ఆంక్షలు ప్రకటించవచ్చనే ఊహాగానాలు ఊపందుకున్నాయి. ''న్యాయబద్ధమైన హక్కులు, ప్రయోజనాలను'' కాపాడుకునేందుకు, ''అవసరమైన చర్యలతో'' జవాబిస్తామని చైనా కూడా స్పందించింది.

వాల్‌స్ట్రీట్‌లో నష్టాలు

ప్రపంచ వ్యాప్తంగా చూస్తే, ఆసియా షేర్ మార్కెట్లు మిశ్రమ ఫలితాలతో ముగిశాయి. ఈ ఏడాదిలో మొదటి సారిగా అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లు పెంచడంతో వాల్‌స్ట్రీట్‌లో షేర్ల ధరలు నష్టపోయాయి. దాంతో యూరప్‌లో మార్కెట్లు దిగువ స్థాయిలో మొదలయ్యాయి. ఫెడరల్ రిజర్వ్ 2015 అంతం నుంచి వడ్డీ రేట్లు పెంచడం ఇది ఆరవసారి. ఈ సంవత్సరాంతం లోపల మరో రెండుసార్లు రేట్లు పెంచే అవకాశం ఉందని అది సంకేతాలిచ్చింది.

'సీమాంతర వర్తకాన్ని సులభతరం చేయండి'

న్యూఢిల్లీ: వాణిజ్య నిర్వహణ విధానాలను క్రమబద్ధం చేసేందుకు తక్షణం చర్యలు చేపట్టాలని ప్రధాన మంత్రి కార్యాలయం (పి.ఎం.ఓ) వాణిజ్య మంత్రిత్వ శాఖను ఆదేశించింది. సీమాంతర సరుకుల రవాణాకు వెసులుబాటు కల్పించేందుకు, వ్యాపార నిర్వహణ సౌలభ్యంలో భారతదేశ ర్యాంక్‌ను మెరుగుపరచేందుకు పి.ఎం.ఓ ఆ విధంగా ఆదేశించింది. వ్యాపార నిర్వహణ సౌలభ్యంలో సీమాంతర వర్తకం అంశం విషయంలో మొత్తం 190 దేశాలలో భారతదేశం 146 స్థానంలో ఉందని ప్రపంచ బ్యాంకు తాజా నివేదికలో వెల్లడించింది. ''ఈ పరామితి విషయంలో ర్యాంకింగ్ బాగా లేదు. ఈ దిశగా చర్యలు తీసుకోవలసిందిగా మంత్రిత్వ శాఖను ప్రధాన మంత్రి కార్యాలయం ఆదేశించింది'' అని వాణిజ్య మంత్రిత్వ శాఖ అధికారి ఒకరు చెప్పారు. వచ్చే ఏడాది నివేదికలో ఈ స్థానం గణనీయంగా మెరుగుపడేందుకు మంత్రిత్వ శాఖకు చెందిన లాజిస్టిక్స్ డివిజన్ కృషి చేస్తోంది. ఈ చర్యలలో భాగంగా, వాణిజ్య మంత్రిత్వ శాఖ పోర్టులు, కస్టమ్స్, భారత ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ వంటి నియంత్రణ సంస్థలతో సహా ఈ అంశంతో ప్రమేయమున్న ప్రధాన విభాగాలన్నింటినీ అనుమతులు, ఆమోదాలు కాగిత రహిత రీతిలో ఇవ్వవలసిందిగా కోరింది. అది ఈమేరకు వాటికి లేఖలు రాసింది. ''ఎగుమతులు, దిగుమతులకు అన్ని అనుమతులను ఆన్‌లైన్‌లోనే ఇవ్వవలసిందిగా మేం కోరాం. కాగితాల ద్వారా లావాదేవీలు అసమర్థతలను పెంచుతాయి కనుక, కాగితాల ద్వారా లావాదేవీలను నిర్మూలించాలి'' అని ఆ అధికారి అన్నారు. ఈ చర్య వల్ల, వివిధ రకాల అనుమతులు పొందడానికి వర్తకులకయ్యే సమయం, ఖర్చులు రెండూ తగ్గుతాయి. వస్తువుల ఎగుమతికి, దిగుమతికి తప్పనిసరిగా అవసరమయ్యే డాక్యుమెంట్ల సంఖ్యను ప్రభుత్వం ప్రతీ కేసులోనూ మూడుకు తగ్గించినప్పటికీ, అనుమతి పొందడానికి సమయం పడుతోంది. కార్గో కంటైనర్ల రవాణాను వేగవంతం చేసే ఉద్దేశంతో కన్‌సైన్‌మెంట్లలో అత్యధిక భాగానికి 'డైరెక్ట్ పోర్ట్ డెలివరీ' నిర్వహించవలసిందిగా కస్టమ్స్ విభాగాన్ని మంత్రిత్వ శాఖ కోరింది. 'డైరెక్ట్ పోర్ట్ డెలివరీ' విధానం లేకపోతే, కార్గోల అనుమతులకు కొన్ని రోజులు పట్టేస్తుందని ఒక ఎగుమతిదారు తెలిపారు. ఈ డెలివరీ యంత్రాంగం కింద సుమారు 50 గంటలు పడుతుంది. ఎగుమతులు పెంపొందించే లక్ష్యంతోనే ఈ మొత్తం వ్యవహారాన్ని చేపట్టారు. వ్యాపార నిర్వహణ సులభతర ర్యాంకింగ్‌లో ప్రపంచ బ్యాంకు తాజా నివేదికలో భారతదేశం తన స్థానాన్ని 130 నుంచి 100కి మెరుగుపరచుకుంది.

పెరిగిన సి.ఎస్.ఆర్. వ్యయం



ముంబయి: భారతీయ కంపెనీలు కార్పొరేట్ సామాజిక బాధ్యత (సి.ఎస్.ఆర్) వ్యయాన్ని పెంచాయి. కంపెనీల నికర లాభాలలో ఓ మోస్తరు వృద్ధి మాత్రమే ఉన్నప్పటికీ, గత రెండు ఆర్థిక సంవత్సరాలలో అది 14 శాతం పెరిగిందని ఒక సర్వేలో వెల్లడైంది. అర్హత కలిగిన 1186 లిస్టెడ్ కంపెనీలను విశ్లేషించి క్రిసిల్ ఫౌండేషన్ కొన్ని విశేషాలు వెల్లడించింది. ''నికర లాభంలో వృద్ధి నామమాత్రంగా 5 శాతమే ఉన్నప్పటికీ, కార్పొరేట్ సామాజిక బాధ్యతపై చేసే వ్యయం మొత్తం గత రెండు ఆర్థిక సంవత్సరాలలో 14 శాతం కాంపౌండ్ వార్షిక వృద్ధి రేటు నమోదు చేసింది'' అని సర్వే తెలిపింది. సి.ఎస్.ఆర్ వ్యయానికి అమలు చేసే సంస్థలుగా అత్యధిక భాగం కంపెనీలు ప్రభుత్వేతర సంస్థ (ఎన్.జి.ఓ)లను ఉపయోగించుకుంటున్నాయి. చిన్న కంపెనీలలో మూడింట రెండో వంతు కంపెనీలతో సహా, అర్హత కలిగిన కంపెనీలలో దాదాపు 74 శాతం కంపెనీలు గత ఆర్థిక సంవత్సరంలో సి.ఎస్.ఆర్ వ్యయాన్ని అమలు చేసే సంస్థలుగా ఎన్.జి.ఓలను ఉపయోగించుకున్నాయి'' అని సర్వేలో తేలింది. అయితే, సర్వేలో పాల్గొన్న కంపెనీల్లో దాదాపు మూడింట రెండు వంతుల కంపెనీలకు సి.ఎస్.ఆర్ కార్యకలాపాలకు అంకితమైన వారు ఐదుగురుకన్నా తక్కువగా ఉన్నారు. పటిష్టమైన పర్యవేక్షణను సమకూర్చుకునేందుకు స్వీయ సామర్థ్యాన్ని నిర్మించుకోవడంలో కంపెనీలు ఎక్కువ పెట్టుబడులు పెట్టడం లేదని అది సూచిస్తోంది. మొత్తం సి.ఎస్.ఆర్ వ్యయంలో అదనపు వ్యయాలు 5 శాతం మించకూడదన్న నిబంధన కూడా కంపెనీలు సి.ఎస్.ఆర్‌కు తక్కువ సిబ్బందిని పెట్టుకోవడానికి ఒక కారణం కావచ్చు. ''ఆ పరిమితిని కనుక పెంచితే, కంపెనీలు మరింత ప్రత్యక్ష ప్రమేయం కల్పించుకునేందుకు వీలు ఏర్పడుతుంది. సి.ఎస్.ఆర్‌కి పెద్ద బృందాలు నిర్మించుకునేందుకు సహాయపడినట్లు అవుతుంది. కార్యక్రమాలకు అమలు చేసే సంస్థలు అనివార్యం కాబట్టి ఎన్.జి.ఓలకు కొన్ని ప్రమాణాలను పెంపొందించే విధంగా చర్యలు తీసుకోవచ్చు. దీనివల్ల వాటి అమలు సామర్థ్యాన్ని పరిశీలించినట్లు అవుతుంది. ప్రామాణీకరణను తీసుకువచ్చినట్లు అవుతుంది'' అని క్రిసిల్ ఫౌండేషన్ అధ్యక్షుడు రామ్‌రాజ్ పాయ్ చెప్పారు.

28న 'సెబి' బోర్డు సమావేశం

ఎజెండాలో ముఖ్యమైన అంశాలు

ముంబయి: భారతీయ సెక్యూరిటీలు, ఎక్స్ఛేంజి బోర్డు (సెబి) బోర్డు 28న జరుగనుంది. ఉదయ్ కోటక్ కమిటీ సూచించిన కార్పొరేట్ పాలన నిబంధనలను దశలవారీగా అమలులోకి తేవడం, లిస్టెడ్ కంపెనీలు రుణాలను ఎగవేసి ఉంటే వాటిని వెల్లడించడం, 'సెబి' ఉద్యోగులకు ఒక పెన్షన్ పథకాన్ని రూపొందించడం వంటి అంశాలు ఈ సమావేశ ఎజెండాలో అగ్ర స్థానంలో ఉన్నాయి. పి.ఎన్.బి రుణ కుంభకోణం, తదనంతరం ఎగవేతల గురించి వె ల్లడించడంలో కంపెనీలు జాప్యం చేస్తున్న ఉదంతాలు బయటపడుతున్న నేపథ్యంలో, రూ. 5 కోట్లకు మించిన రుణాలు చెల్లించడంలో 30 రోజులకు పైగా జాప్యం జరిగితే, వాటి గురించి వెంటనే వెల్లడించవలసి వచ్చేట్లుగా కంపెనీలపై ఒత్తిడి తెచ్చే ప్రతిపాదనను 'సెబి' పరిశీలిస్తోంది. బ్యాంకులకు లేదా ఫైనాన్షియల్ సంస్థలకు వడ్డీ చెల్లింపు లేదా అసలును తిరిగి చెల్లించడంలో ఏ ఎగవేతనైనా సరే, ఎగవేసిన 24 గంటల లోపలే వెల్లడించడాన్ని కంపెనీలకు 'సెబి' గత ఆగస్టులో తప్పనిసరి చేసింది. ప్రస్తుత నిబంధనలు, రుణ సెక్యూరిటీలపై వడ్డీ/అసలు చెల్లింపులో జాప్యమైనా లేదా ఎగవేసినా లిస్టెడ్ కంపెనీలు వెల్లడించాలని నిర్దేశిస్తున్నాయని, బ్యాంకులు లేదా ఫైనాన్షియల్ సంస్థల నుంచి తీసుకున్న రుణాల విషయంలో అలాంటి నిబంధనలు ఏవీ లేవని నియంత్రణ సంస్థ పేర్కొంది. కానీ, ఆ నిబంధనలు ప్రవేశపెట్టిన తర్వాత, వాటిని మార్చేశారు. స్టాక్ మార్కెట్‌పై ప్రతికూల ప్రభావం పడుతుందనే భయాలే దానికి ప్రధాన కారణం.

ఉదయ్ కోటక్ అధ్యక్షతన గల 23 మంది సభ్యుల కమిటీ తన 177 పేజీల నివేదికను అక్టోబరులో 'సెబి'కి సమర్పించింది. విదేశాలలో నెలకొల్పిన వాటితో సహా, లిస్ట్ కాని అనుబంధ సంస్థలకు నిధుల ప్రవాహాన్ని ఆడిట్ కమిటీలు పరిశీలించాలని కోటక్ ప్యానెల్ ప్రతిపాదించింది. షేర్ల ధరలపై ప్రభావం చూపగల ప్రచురించని సున్నితమైన సమాచారాన్ని ప్రమోటర్లతో లేదా మరి ఏ ఇతర గణనీయమైన షేర్‌హోల్డర్లతో పంచుకునేందుకు లిస్టెడ్ కంపెనీలు తగిన నియంత్రణ నిబంధనావళిని పెట్టుకోవాలని కూడా ఆ కమిటీ సూచించింది. లిస్టెడ్ కంపెనీల్లో కనీసం ఆరుగురు డైరెక్టర్లు ఉండాలని, ఒక మహిళా డైరెక్టర్‌తో సహా ఇండిపెండెంట్ డైరెక్టర్లకు కనీసం 50 శాతం ప్రాతినిధ్యం లభించాలని కూడా అది ప్రతిపాదించింది.



రేసులో జేఎస్‌డబ్ల్యూ స్టీల్

ముంబయి: ఎస్సార్ స్టీల్‌ను కైవసం చేసుకునేందుకు పోటీ మళ్ళీ కొత్తగా మొదలుకానుంది. ఎస్సార్ స్టీల్ కోసం బిడ్ చేయడానికి జేఎస్‌డబ్ల్యూ స్టీల్‌తో సహా బరిలోకి కొత్త సంస్థలు ప్రవేశిస్తున్నాయి. నుమెటల్, ఆర్సిలార్‌మిత్తల్ సమర్పించిన బిడ్లను ఎస్సార్ స్టీల్‌కు చెందిన రుణ దాతల కమిటీ తిరస్కరించడంతో అలా పరిస్థితిలో మార్పు వచ్చింది. నుమెటల్‌కు రష్యాలోని అతి పెద్ద బ్యాంకు వి.టి.బి అండ ఉంది. ఆర్సిలార్ మిత్తల్ ప్రపంచంలోనే అతి పెద్ద ఉక్కు కంపెనీగా ఖ్యాతి కెక్కింది. కానీ, వాటి ప్రతిపాదనలు ఇన్‌సాల్వెన్సీ అండ్ బ్యాంక్‌రప్టీ కోడ్‌కు అనుగుణంగా లేవనే కారణంతో వాటి బిడ్లను తిరస్కరించారు.

బుధవారం నాడిక్కడ నిర్వహించిన సమావేశంలో కొత్త బిడ్లను ఆహ్వానించాలని రుణ దాతలు నిర్ణయించారు. ఫలితంగా, కంపెనీకి కొత్త యజమానిని కనుగొనే మొత్తం ప్రక్రియలో మరింత జాప్యం జరగవచ్చు. రూ. 48,000 కోట్ల రుణంపై ఎస్సార్ స్టీల్ ఎగవేతకు పాల్పడింది. రుణ దాతలు లేవనెత్తిన సంశయాలను తీర్చిన తర్వాత, నుమెటల్, ఆర్సిలార్‌మిత్తల్ రెండూ రీబిడ్డింగ్‌లో పాల్గొనే అవకాశం ఉండవచ్చు.

ఎన్.సి.ఎల్.టిని ఆశ్రయించిన నుమెటల్

ఎస్సార్ స్టీల్‌కు బిడ్ చేసిన కన్సార్టియం నుంచి అవసరమైతే, ఎస్సార్ ప్రమోటర్ రవి రూయా కుమారుడు రేవంత్ రూయాను తొలగిస్తామని పేర్కొంటూ అహ్మదాబాద్‌లో ఎన్.సి.ఎల్.టి ఎదుట నుమెటల్ ఒక దరఖాస్తు దాఖలు చేసింది. రుణ దాతలు దాని బిడ్‌ను తిరస్కరించడానికి ప్రాథమిక కారణం నుమెటల్‌లో రేవంత్ షేర్‌హోల్డర్‌గా ఉండడమే. తన అర్హతకు సంబంధించిన పూర్తి వాస్తవాలను సరైన విధంగా మదింపు చేయలేదని నుమెటల్ పేర్కొంది. ''అందుకని, నిష్పాక్షికమైన అంచనా కోసం ఎన్.సి.ఎల్.టి. ఎదుట అర్హతను నిర్ణయించడానికి అవసరమైన అన్ని వాస్తవాలను ఉంచుతున్నాం'' అని అది తెలిపింది. తన బిడ్ తిరస్కరణకు సంబంధించి రుణ దాతల నుంచి ఎలాంటి అధికారిక వర్తమానం అందలేదని ఆర్సిలార్‌మిత్తల్ తెలిపింది. ఎస్సార్ స్టీల్ స్వాధీనానికి అది నిప్పన్ స్టీల్, సుమిటోమో మెటల్ కార్పొరేషన్‌లను భాగస్వాములుగా చేసుకుంది. కానీ, రుణ భారంతో కుంగిన ఉత్తమ్ గాల్వాలో ఆర్సిలార్‌కు వాటా ఉండడం దాని ప్రయత్నాన్ని భగ్నం చేసింది.



నేడు రుణ దాతల సమావేశం

గతంలో కొనుగోలుకు ఆసక్తి ఉన్నట్లు లేఖలు సమర్పించి, ఫైనాన్షియల్ బిడ్లను మాత్రం సమర్పించని కంపెనీలకు మాత్రమే తాజా బిడ్డింగ్‌ను పరిమితం చేయాలా లేక ఆసక్తి ఉన్న సంస్థలన్నింటినీ పాల్గొనవలసిందిగా ఆహ్వానించాలా అనే సంగతిని నిర్ణయించుకునేందుకు రుణ దాతలు శుక్రవారంనాడు సమావేశమవుతున్నారని అభిజ్ఞ వర్గాల ద్వారా తెలిసింది.

ఇంతకుముందు ఆసక్తి కనబరచినప్పటికీ టాటా స్టీల్, వేదాంత సంస్థలు ఈసారి బిడ్డింగ్‌లో చేరకపోవచ్చు. భూషణ్ స్టీల్‌ను టాటా స్టీల్ కైవసం చేసుకోగా, ఎలక్ట్రోస్టీల్‌కి టాప్ బిడ్డర్‌గా వేదాంత అవతరించింది. కనుక, ఆ రెండు కంపెనీలు మరిన్ని ఆస్తుల స్వాధీనానికి ఆసక్తి చూపించకపోవచ్చు.

ప్రస్తుతం సాగుతున్న ఆస్తుల-అమ్మకాల ప్రక్రియలో జేఎస్‌డబ్ల్యూ స్టీల్ ఇంకా విజయాన్ని రుచి చూడలేదు. ఇంతకుముందు ఆసక్తి కనబరచిన ప్రైవేటు ఈక్విటీ ఫండ్లతో కలసి, అది ఎస్సార్ స్వాధీనానికి సొంతంగా బరిలోకి దిగే అవకాశం ఉంది.

'ఫియూ'కు వివరాలివ్వండి

న్యూఢిల్లీ: గుప్తధన చెలామణీ నిరోధక చట్టం (పి.ఎం.ఎల్.ఎ) కింద పాటించవలసిన నియమాలకుగాను ఫైనాన్షియల్ ఇంటెలిజెన్స్ యూనిట్-ఇండియా (ఫియూ-ఇండ్) వద్ద రిజిస్టరు కావలసిందిగా, రిజిస్టరుకాని 9000లకు పైగా నాన్-బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీలను ఆర్థిక మంత్రిత్వ శాఖ నేడు కోరింది. క్లయింట్ల గుర్తింపును సరిచూడడం, రికార్డులు నిర్వహించడం, ఫియూ-ఇండ్‌కు సమాచారాన్ని సమర్పించడం ఎన్.బి.ఎఫ్.సిలతో సహా వివిధ నివేదన సంస్థలకు పి.ఎం.ఎల్.ఎ కింద తప్పనిసరి అయింది. రిజిస్టరుకాని ఎన్.బి.ఎఫ్.సిలు ఫియూకు నివేదించవలసిన పరిధికి బయట ఉండడం వల్ల , అవి దేశ ఫైనాన్షియల్ వ్యవస్థ సమైక్యతకు ముప్పుగా పరిణమిస్తున్నాయని ఆర్థిక మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. ఆర్థిక మంత్రిత్వ శాఖలోని ఫియూ, పి.ఎం.ఎల్.ఎ కింద పాటించాల్సిన నిబంధనలను పాటించని 9,236 'నాన్-కాంప్లియంట్ ఎన్.బి.ఎఫ్.సి'ల జాబితాను ప్రచురించింది. అవి వెంటనే నివేదించవలసిన సంస్థ ముఖ్య అధికారిని, ఫియూ-ఇండ్ నియమిత డైరెక్టర్‌ని కలవాలని సూచించింది. ఆ జాబితాను నెలకోసారి సవరిస్తారు. దీని కోసం ఫిన్‌నెట్ గేట్‌వే పేరుతో ఒక పోర్టల్‌ను కూడా ఫియూ అభివృద్ధి చేసింది.

కృష్ణకుమార్ పునర్నియామకం

న్యూఢిల్లీ: టాటా గ్లోబల్ బివరేజెస్ లిమిటెడ్ (టి.జి.బి.ఎల్) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఎల్. కృష్ణకుమార్ తిరిగి నియమితులయ్యారు. ఆయన 2018 ఏప్రిల్ 1 నుంచి ఆ పదవిలో ఐదేళ్ళపాటు ఉంటారు. ఆయన కంపెనీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా 2013 ఏప్రిల్‌లో నియమితులయ్యారు. గ్రూప్ హోటళ్ళ వ్యాపారంలో ఫైనాన్స్ విభాగ ఉపాధ్యక్షుడుగా ఆయన 2000 సంవత్సరంలో టాటా గ్రూప్‌లో చేరారు. ఇండియాలో టాటా టీ ఫైనాన్స్ విభాగ అధిపతిగా 2004లో పదోన్నతి పొందారు. టాటా గ్రూప్‌లో చేరడానికి ముందు ఆయన లార్సెన్ అండ్ టూబ్రోలో ఫైనాన్స్ విభాగ జనరల్ మేనేజర్‌గా పనిచేశారు.

మనం టెక్నాలజీ
శుక్రవారం 23 మార్చి 2018
www.manamnews.com

స్మార్ట్ తాళం

అదిరే బైక్‌లు... కార్లు ఎన్నొచ్చినా సైకిల్‌కి ఉండే ఆదరణే వేరు. ఇప్పటికీ ట్రెండీ మోడళ్లతో నేటి తరాన్ని ఆకర్షిస్తోంది. దీంతో సంబంధిత సైకిల్ యాక్ససరీస్ కూడా కొత్తగా పుట్టుకొస్తున్నాయి. 'బైసెక్యూ' కూడా అలాంటిదే. ఇదో స్మార్ట్ తాళం. చిత్రంలో మాదిరిగా దీన్ని సైకిల్ ముందు చక్రానికి



అమర్చి స్మార్ట్ ఫోన్‌తో జత చేసి వాడుకోవచ్చు. సైకిల్‌ని ఎక్కడ ఉంచినా మాన్యువల్‌గా తాళం వేయాల్సిన పని లేదు. స్టాండ్ వేసి సైకిల్‌కి సమీప దూరం నుంచి ఎటైనా వెళ్తే చాలు. ఆటోమాటిక్‌గా లాక్ అవుతుంది. ముందు చక్రం కదలదు. ఎవరైనా సైకిల్‌ని కదలిస్తూ తాళం తీసేందుకు ప్రయత్నిస్తే ఫోన్‌లో అలారం మోగుతుంది. నోటిఫికేషన్స్ రూపంలోనూ అలర్ట్ చేస్తుంది. సైకిల్ సమీపంలోకి యజమాని రాగానే తాళం అన్‌లాక్ అవుతుంది. ఏ రకమైనా తాళాలు వాడకుండా మొత్తం వ్యవస్థని బ్లూటూత్ టెక్నాలజీతో రన్ చేయవచ్చు. ప్రత్యేక ఆప్‌తో సైకిల్ వెళ్తున్నప్పుడు ఎంత వేగంతో వెళ్తున్నారో కూడా రీడింగ్‌ని తెరపై చూడొచ్చు. అంతేకాదు... రోజంతా చేసిన సైక్లింగ్‌తో ఎంత దూరం ప్రయాణించారు? ఎన్ని కేలరీలు ఖర్చు అయ్యాయో తెలుసుకోవచ్చు.



బ్యాకప్ తీసుకుందాం!

కొత్త మొబైల్ కొనడమంటే కొత్త ఇంట్లోకి గృహప్రవేశం చేస్తున్నట్లే...! పాత మొబైల్ నుంచి కొత్తదాంట్లోకి మారడమంటే ఇల్లు మారుతున్నట్లే! అవును... కొత్త ఇంట్లో అడుగుపెట్టాలంటే పాత ఇంట్లోని సామాన్లను ప్యాక్ చేసుకొని కొత్త ఇంటికి తీసుకెళ్లాలి. కొత్త మొబైల్‌ను వాడుకోవాలంటే పాత మొబైల్‌లోని డేటాను సర్దుకొని కొత్త దాంట్లో వేసుకోవాలి! మొబైల్‌లోని డేటా అంటే సామాన్యమా! కాంటాక్ట్స్, ఆప్స్, ఫొటోలు, పాటలు, వీడియోలు, డాక్యుమెంట్లు... ఇలా చాలానే ఉంటాయి. వాటన్నింటినీ జాగ్రత్తగా సర్దుకొని కొత్తగా మొబైల్‌లోకి తీసుకురావాలి. ఒకవేళ మొబైల్ పాడైతే, మీకు తెలియకుండా రీసెట్ అయితే మీ డేటా మొత్తం పోతుంది. మళ్లీ ఆ డేటాను పొందాలంటే ఎప్పటికప్పుడు జాగ్రత్తగా బ్యాకప్ చేసుకోవడం మంచిది. ఈ విషయంలో ఈ ఆప్స్, ఆప్షన్లు మీకు ఉపయోగపడతాయి.

అన్నీ ఒకేసారి

ఒక్కొక్క అంశాన్ని బ్యాకప్ చేసి పంపించుకోవడం కంటే అన్నీ ఒకేసారి పంపించగలిగితే బాగుంటుంది అని అనుకుంటున్నారా? దానికి మొబైల్ డేటా ఖర్చు కాకూడదు అనుకుంటున్నారా? షేర్ ఇట్ ఆప్‌తో ఈ పని చేయొచ్చు. అయితే ఈ పని చేయడానికి మరికొన్ని ఆప్స్ కూడా ఉన్నాయి. డేటా పంపించే, అందుకునే మొబైల్‌లో ఈ ఆప్ ఉంటే చాలు. డేటాను సులభంగా ట్రాన్స్‌ఫర్ చేసుకోవచ్చు. రెండు మొబైళ్లలోనూ ఈ ఆప్‌ను ఇన్‌స్టాల్ చేసుకొని ఆప్ సూచించిన ప్రకారం రెండు మొబైళ్లను కనెక్ట్ చేసుకోండి. ఆ తర్వాత పంపించాలనుకునే డేటా అంశాలను ఎంచుకొని సెండ్ చేసుకోవడమే. రెండు ఆండ్రాయిడ్ మొబైళ్ల మధ్యనే కాకుండా, ఆపిల్ లేదా విండోస్ మొబైల్ నుంచి కూడా ఆండ్రాయిడ్‌కు సమాచారాన్ని బట్వాడా చేసుకోవచ్చు. ల్యాప్‌టాప్ నుంచి కూడా డేటాను ట్రాన్స్‌ఫర్ చేసుకోవచ్చు. వీటిలో అయితే ఆప్స్, వీడియోలు, ఫొటోలు బట్వాడా అవుతాయి. వీటితోపాటు కాంటాక్ట్స్, మెసేజ్‌లు, కాల్ హిస్టరీని కూడా పంపుకోవాలనుకుంటే ఆప్ ఉంది.



గూగుల్ ద్వారా...

డేటా, ఫొటోలు, కాంటాక్ట్‌ల తదితర అంశాల బ్యాకప్ కోసం గూగుల్ కొన్ని సౌకర్యాలను అందిస్తోంది. వీటిని వినియోగించడానికి మీ మొబైల్ సెట్టింగ్స్‌లోని అకౌంట్స్ ఆప్షన్‌ను ఒత్తండి. అక్కడ కనిపించే గూగుల్ ట్యాబ్‌ను క్లిక్ చేయండి. అందులో ప్రతి అంశం సింక్ అవుతున్నాయో లేదా చూసుకోండి. ఒకవేళ సింక్ కాకపోతే ఆప్షన్‌ను ఆన్ చేసుకోండి. ఆ తర్వాత సెట్టింగ్స్‌లోని బ్యాకప్ అండ్ రిసెట్ ఆప్షన్‌లోకి వెళ్లండి. అందులో 'బ్యాకప్ మై డేటా' విభాగాన్ని ఎంచుకోండి. అప్పుడు మీ మెయిల్ ఐడీని చూపిస్తూ బ్యాకప్ అవుతున్నట్లు చూపిస్తుంది. తర్వాత కొత్త మొబైల్ ఇన్‌స్టాల్ చేస్తున్నప్పుడు డేటా, సిస్టమ్ సెట్టింగ్స్ ఆటోమేటిక్‌గా రెస్టోర్ అవుతుంది. మొబైల్ లేదా సిమ్‌లో కాంటాక్ట్స్ సేవ్ చేస్తూ ఉంటారు. అలా కాకుండా జీమెయిల్‌లోనూ కాంటాక్ట్స్ సేవ్ చేసుకోవచ్చు. నంబరును సేవ్ చేసుకునేటప్పుడు అది ఎందులో సేవ్ అవుతుందనేది దిగువన చూపిస్తుంది. అక్కడ జీమెయిల్‌ను ఎంచుకుంటే సరి. మొబైల్‌ను మార్చినప్పుడు కొత్తదానికి మీ మెయిల్ ఐడీని సింక్ చేస్తే అందులోని కాంటాక్ట్స్ కూడా వచ్చేస్తాయి. దీంతో పాత మొబైల్ నుంచి మళ్లీ కాంటాక్ట్స్ కాపీ చేసుకోనక్కర్లేదు.



ఫొటోస్ బ్యాకప్

సెల్ఫీలు, ఫొటోలు, వీడియోలు... ఇవి ఎప్పటికీ ముఖ్యమే. మొబైల్ చోరీకి గురైనా, పాడైపోయినా అయ్యో ఫొటోలు పోయాయి అని బాధపడక్కర్లేదు. తీసిన ఫొటో అప్పటికప్పుడు గూగుల్ ఫొటోస్‌లో బ్యాకప్ చేసుకోవచ్చు. మొబైల్‌లోని గూగుల్ ఫొటోస్ ఆప్ ఓపెన్ చేసి ఆటోమేటిక్ బ్యాకప్‌ను ఎంచుకోండి. ఆ తర్వాత మీ ఫొటోలు, వీడియోలు ఎప్పటికప్పుడు అందులో బ్యాకప్ అవుతాయి. అవసరమైతే వాటిని సిస్టమ్‌లో కూడా చూసుకోవచ్చు. ఇదే తరహాలో యాహూ నుంచి ఫ్లికర్ ఉంది. ఇందులో అయితే 1 టీబీ వరకు స్పేస్ ఉంటుంది.



మెసేజ్‌ల సంగతి

వాట్సాప్ తర్వాత స్థానం మెసేజ్‌లదే. వ్యక్తిగత సందేశాలు, బ్యాంకుల లావా దేవీల విషయాలు, రీఛార్జిల లెక్కలు.. ఇలా అన్నీ మెసేజ్‌ల రూపంలోనే వస్తుంటాయి. మొబైల్‌ను మార్చినప్పుడు ఈ డేటాను తరలించుకోకపోతే చాలా కష్టం. ఆప్‌ని ఇన్‌స్టాల్ చేసుకొని మీ మొబైల్‌లోని మెసేజ్‌లను ఎన్‌క్రిప్ట్ ఫైల్ రూపంలో బ్యాకప్ తీసుకోవచ్చు. మొబైల్‌తోపాటు క్లౌడ్ సర్వీసులు గూగుల్ డ్రైవ్, డ్రాప్‌బాక్స్‌లోనూ బ్యాకప్ తీసుకోవచ్చు. తర్వాత కొత్త మొబైల్‌లో బ్యాకప్ ఫైల్‌ను రెస్టోర్ చేసుకొని మీ డేటాను తిరిగి పొందొచ్చు. ఈ బ్యాకప్ రోజూ నిర్ణీత సమయానికి జరిగేలా చూసుకోవచ్చు. దీని కోసం ఆప్ ఓపెన్ చేసిన తర్వాత 'బ్యాకప్ నౌ' ఆప్షన్‌లోకి వెళ్లండి. అక్కడ బ్యాకప్ లొకేషన్ దగ్గర మీరు బ్యాకప్ ఫైల్‌ను ఎక్కడ సేవ్ చేయాలనుకుంటున్నారో దాన్ని ఎంచుకొండి. ఆ తర్వాత డైలీ బ్యాకప్‌కు సంబంధించిన సమయం తదితర వివరాలు నమోదు చేసుకోండి.



క్లౌడ్‌లోకి పంపిస్తే

మీ మొబైల్‌లోని ఆప్స్, కాంటాక్ట్స్, మెసేజ్‌లు... ఇలా అన్నీ ఎప్పటికప్పుడు క్లౌడ్‌లో సేవ్ అయిపోతే బాగుంటుంది కదా! ఎప్పుడైనా మొబైల్‌లో డిలీట్ అయిపోతే మళ్లీ క్లౌడ్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. దీని కోసం చాలా సర్వీసులున్నాయి. ఆప్‌ను ఇన్‌స్టాల్ చేసుకుంటే 5 జీబీ స్పేస్‌తో ఓ ఖాతా ప్రారంభమవుతుంది. దాంట్లోకి షెడ్యూల్ ప్రకారం డేటాను బ్యాకప్ తీసుకోవచ్చు. ఎప్పుడు బ్యాకప్ అవ్వాలన్నది మీరే నిర్ణయించుకోవచ్చు. వేరే మొబైల్‌లో ఈ డేటాను పొందాలంటే అందులో ఈ ఆప్‌ను ఇన్‌స్టాల్ చేసుకొని ఐడీ, పాస్‌వర్డ్‌తో లాగిన్ అవ్వండి. ఆ తర్వాత పైన కనిపించే రెస్టోర్ బటన్‌ను ఒత్తి పాత డేటాను పొందొచ్చు.

ఎప్పటికప్పుడు బ్యాకప్

మొబైల్‌ను మార్చినప్పుడల్లా ఆప్స్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలంటే చాలా మొబైల్ డేటా ఖర్చవుతుంది. అంతేకాదు అందులో ఏయే ఆప్స్ వాడేవారో గుర్తుంచుకోవడమూ కష్టమే. ఇలాంటి ఇబ్బంది లేకుండా మీరు వాడుతున్న ఆప్స్‌ను ఎప్పటికప్పుడు బ్యాకప్ తీసుకుంటే మంచిది కదా. మెసేజ్‌లు, కాంటాక్ట్‌లు బ్యాకప్ తీసుకున్నట్లు ఆప్స్‌ను కూడా బ్యాకప్ తీసుకోవచ్చు. ఆప్‌ను ఇన్‌స్టాల్ చేసుకొని మీ మొబైల్‌లోని ఆప్స్‌ను మీ ఫోన్, గూగుల్ డ్రైవ్, యూఎస్‌బీ డ్రైవ్‌లో బ్యాకప్ చేసుకోవచ్చు. ఆ బ్యాకప్ ఫైల్స్‌ను తర్వాత కొత్త ఫోన్‌లో వేసి ఇన్‌స్టాల్ చేసుకోవచ్చు. మీ మొబైల్‌లో ఉన్న ఏపీకే ఫైళ్లను వెతికి పట్టుకొని వాటిని ఇన్‌స్టాల్ చేయాలన్నా ఈ ఆప్‌ను వాడొచ్చు.

వాట్సాప్ కోసం

బ్యాకప్ అనగానే ముందుగా గుర్తొచ్చేది వాట్సాప్. ప్రస్తుతం వ్యక్తిగత, వృత్తిగత సంభాషణలు ఎక్కువ శాతం వాట్సాప్‌లోనే జరుగుతున్నాయి. ఫొటోలు, వీడియోలు, పీడీఎఫ్‌లు... ఇలా ముఖ్యమైన సమాచారం ఎంతో. ఈ డేటాను బ్యాకప్ చేసుకోవడానికి థర్డ్ పార్టీ ఆప్స్ అవసరం లేదు. వాట్సాప్‌లోనే ఆప్షన్ ఉంది. మీ వాట్సాప్ ఖాతాను జీమెయిల్‌తో అనుసంధానం చేసుకుంటే గూగుల్ డ్రైవ్‌లో బ్యాకప్ తీసుకోవచ్చు. తర్వాత వేరే మొబైల్‌లో వాట్సాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకుంటే పాత మొబైల్‌లోని డేటా ఆటోమేటిక్‌గా వచ్చేస్తుంది. దీని కోసం వాట్సాప్ సెట్టింగ్స్‌లోని చాట్స్ ఆప్షన్‌లోకి వెళ్లండి. అందులో చాట్ బ్యాకప్ ఆప్షన్‌ను ఎంచుకోండి. అక్కడ గూగుల్ డ్రైవ్‌కు సంబంధించిన ప్రాథమిక సమాచారం ఇచ్చి, ఎప్పుడు బ్యాకప్ తీసుకోవాలో సూచించండి. మిగిలిన పని మీ వాట్సాప్ చూసుకుంటుంది.

పాటలు పంచుకోండి

ఒక హెడ్‌సెట్‌లో వినిపిస్తున్న పాటల్ని వేరే హెడ్‌సెట్‌లో వినొచ్చు తెలుసా? హెడ్‌సెట్ ఇయర్ కప్స్‌కు రెండు 3.5 ఎంఎం జాక్ హోల్డర్లుంటాయి. ఒక హోల్డర్ నుంచి కేబుల్ సాయంతో వేరే హెడ్ సెట్‌ను జోడించి ఇందులో ప్లే అవుతున్న పాటల్ని వేరే హెడ్‌సెట్‌లో వినొచ్చు. మొబైల్‌కి కేబుల్ కనెక్ట్ చేసి దీంతో ఫోన్ కాల్స్ కూడా మాట్లాడుకోవచ్చు. త్రీడీ హింగే సాంకేతికతతో రూపొందించడం వల్ల ఈ హెడ్‌సెట్ క్లిప్‌ను ఎటుకావాలంటే అటు మెలితిప్పుకోవచ్చు.



టోపీ నుంచి లైవ్



వీడియోల ప్రత్యక్ష ప్రసారం కోసం సోషల్ మెసేజింగ్ ఆప్ స్నాప్‌చాట్ ఇటీవల కళ్లద్దాలు విడుదల చేసింది. ఇవి విదేశాల్లో అందుబాటులో ఉన్నాయి. ఇప్పుడు ఆ తరహాలో గూగుల్ ఓ టోపీని రూపొందిస్తోంది. టోపీ బ్రిమ్‌లో (ముందు భాగం) ఉండే కెమెరాతో వీడియోను చిత్రీకరించి అనుబంధ ఆప్ ద్వారా సోషల్ నెట్‌వర్క్స్‌లో షేర్ చేసుకోవచ్చు. దీనికి సంబంధించిన పేటెంట్‌ను గూగుల్ ఇటీవల పొందింది. గతంలో ఇదే తరహాలో గూగుల్ గ్లాస్‌ను రూపొందించింది. అయితే ధర ఎక్కువగా ఉండటంతో అవి అనుకున్న స్థాయిలో మార్కెట్‌లో ఆదరణకు నోచుకోలేదు. అందుకే ఈ సారి తక్కువ ధరలో టోపీని తయారు చేసే పనిలో పడింది. గూగుల్ గ్లాస్ తరహాలోనే ఇందులోనూ ఇయర్ ఫోన్లు ఉండవు. ప్రత్యేక సాంకేతికత ద్వారా ఎముకల ఆధారంగా శబ్దం మెదడులోకి చేరుతుందట.

5జీ వైపు అడుగులు




2జి, 3జీ శకం ముగిసిపోయి... 4జీ వైపు పరుగులు పెడుతోంది. 4జీ శకం అన్నిచోట్లా పూర్తిగా అందుబాటులోకి రాకుండానే ముగిసిపోయి 5జీ వైపు వడివడిగా అడుగులు పడుతున్నాయి. మన జీవన విధానాన్ని మార్చేయగలిగే శక్తిసామర్థ్యాలు 5జీకి ఉన్నాయి. 2019లో 5జీ స్మార్ట్‌ఫోన్లు మార్కెట్‌లోకి ప్రవేశించనున్నట్టు తెలుస్తోంది. క్వాల్‌కామ్, ఇంటెల్ రెండూ కూడా కొన్ని నెలల నుంచి దీనిపై ట్రయల్స్ నిర్వహిస్తున్నాయని, ఈ ఏడాది చివరకు లేదా 2019 ప్రారంభంలో 5జీ కేపబుల్ తొలి స్మార్ట్‌ఫోన్ మార్కెట్‌లోకి రానున్నట్టు పలు రిపోర్టులు తెలియజేస్తున్నాయి. ఈ క్రమంలో టెలికం దిగ్గజ కంపెనీ ఎయిర్‌టెల్, చైనాకు చెందిన నెట్‌వర్కింగ్ అండ్ టెలీకమ్యూనికేషన్స్ ఉపకరణాల తయారీ సంస్థ హువావే తాజాగా భారత్‌లో తొలిసారి 5జీ నెట్‌వర్క్ ట్రయల్స్‌ను నిర్వహించాయి. ఇందులో 3 గిగాబైట్ పర్ సెకన్ (జీబీపీఎస్)కు పైగా డేటా స్పీడ్‌ను సాధించినట్లు ఈ కంపెనీలు ప్రకటించాయి.

కార్టూన్లుగా మార్చే యాప్స్



స్మార్ట్‌ఫోన్లు అందుబాటులోకి వచ్చిన తర్వాత... కాదేదీ ఫొటోల కనర్హం అన్నట్టుగా తయారైంది. క్వాలిటీ మెగా పిక్సెల్‌తో వస్తోన్న రియర్ కెమెరా, ఫ్రంట్ కెమెరాలతో ఫొటో ప్రియుల ఉత్సాహం మరింత ద్విగుణీక తం అయింది. సెల్ఫీల ట్రెండ్ విపరీతంగా పెరిగింది. సోషల్ మీడియా ఈ ఫొటోలన్నింటికీ వేదికగా మారింది. రకరకాల హావభావాలతో ఫొటోలను తీసుకోవడం, వాటిని ఫేస్‌బుక్, ఇతర సోషల్ మీడియాలో పోస్టు చేయడం, లైకులు, కామెంట్లతో సంబరపడటం ఓ అలవాటుగా మారిపోయింది. అదే సమయంలో కొత్తదనం కోసం ఆరాటమూ పెరిగింది. ఇలా కొత్తదనం కోరుకునే వారు వారి వారి ఫొటోలను రకరకాల గ్రాఫిక్ డిజైన్లలోనూ, కార్టూన్ క్యారెక్టర్లలోనూ చూసుకోవడానికి ఉత్సాహం చూపిస్తున్నారు. అటువంటి వారికోసం రకరకాల ఫొటో ఎడిటింగ్ యాప్స్, కార్టూన్ యాప్స్ అందుబాటులోకి వచ్చాయి. ఇదే కోవలో మన ఫొటోలను కార్టూన్ క్యారెక్టర్‌లోకి మార్చగల యాప్స్ కూడా వున్నాయి. మన ఫొటోలను కార్టూన్స్ గాను, పెయింటింగ్స్ గాను మార్చేందుకు కావాల్సిన మోడ్రన్ ఆర్ట్ ఫిల్టర్స్ ఎన్నో ఈ యాప్‌లో ఉన్నాయి. మీ ఫొటోను కార్టూన్‌లోకి మార్చేందుకు సెల్ఫీ కెమెరాలో ఉన్న కార్టూన్ ఫిల్టర్స్ ఆప్షన్‌ను ఉపయోగించుకోవచ్చు. ఆండ్రాయిడ్ ఫోన్‌లో మీ ఫొటోలను కార్టూన్లుగా క్రియేట్ చేయడానికి గూగుల్ ప్లే స్టోర్ నుండి ఈ యాప్‌ను ఉచితంగా డౌన్లోడ్ చేసుకోవచ్చు.

స్మార్ట్‌ఫోన్‌తో నడిచే ఫ్యాన్



కాదేదీ స్మార్ట్‌ఫోన్ ఉపయోగాని కనర్హం అన్నట్టుగా మారింది ప్రస్తుత పరిస్థితి. రకరకాల యాప్స్‌తో పాటు అనేక యాక్సెసరీస్ అందుబాటులోకి రావడంతో స్మార్ట్ ఫోన్ ను రకరకాల పనులకు ఉపయోగిస్తున్నారు. టీవీ పెట్టడానికి రిమోట్ లా ఉపయోగించడమే కాకుండా ఫ్యాన్ గాను ఉపయోగించుకోవచ్చు. మొబైల్‌కు రెండు రెక్కలు అమర్చడం ద్వారా చల్లని గాలినీ ఆస్వాదించవచ్చు. కేవలం రెండు రెక్కలతో ఉన్న ఈ ఫ్యాన్ మొబైల్‌లో పెట్టుకునే ఛార్జింగ్ పెట్టే పోర్టుకు పెడితే చాలు. అది తిరిగి చల్లగా గాలి వస్తుంది. దీని ధర మూడు వందల రూపాయలు. ఈ రకమైన ఫ్యాన్ ఆన్లైన్ వెబ్ సైట్స్ అయిన మినీ ఇన్ ది బాక్స్ వెబ్‌సైట్‌లో, అమెజాన్‌లో ఇవి అందుబాటులో ఉన్నాయి.

మనం స్పోర్ట్స్
శుక్రవారం 23 మార్చి 2018
www.manamnews.com

సౌమ్యజిత్‌పై అత్యాచారం కేసు



కోల్‌కతా : భారత టేబుల్ టెన్నిస్ ప్లేయర్ , అర్జున అవార్డు విజేత సౌమ్యజిత్ ఘోష్‌పై అత్యాచార ఆరోపణలు చేస్తూ 18 ఏళ్ల యువతి బెంగాల్ పోలీసులకి ఫిర్యాదు చేసింది. సౌమ్యజిత్ తనని పెళ్లి చేసుకుంటానని నమ్మించి మూడేళ్లుగా అత్యాచారం చేస్తున్నాడని.. అతని కారణంగా తాను ఒకసారి అబార్షన్ కూడా చేయించుకున్నానని ఆ యువతి ఆరోపించింది. భారత్ తరపున 2012, 2016 ఒలింపిక్స్‌లో ఆడిన సౌమ్యజిత్‌తో తనకు సోషల్ మీడియా ద్వారా పరిచయం ఏర్పడిందని తెలిపింది. ఈ క్రమంలో చాలాసార్లు పెళ్లి చేసుకుంటానని నమ్మించి తనపై అత్యాచారం చేసినట్లు వెల్లడించింది. కోల్‌కతాలోని సౌమ్యజిత్ ఫ్లాట్‌లో తాము కలుసుకునేవాళ్లమని వివరించింది. తాజాగా తనని పెళ్లి చేసుకునేందుకు సౌమ్యజిత్ నిరాకరిస్తున్నాడని బరాసత్ మహిళా పోలీసులకి బాధితురాలు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. వీరిద్దరూ అనధికారికంగా ఓ ఆలయంలో పెళ్లి చేసుకున్నటు కూడా సమాచారం. అయితే ఆ పెళ్లిని సౌమ్యజిత్ అంగీకరించటం లేదని ఆ యువతి ఫిర్యాదులో పేర్కొంది.

ఆమె బ్లాక్‌మెయిల్ చేస్తోంది : ఘోష్

తాను ఓ యువతిపై లైంగిక దాడికి పాల్పడ్డట్టు వచ్చిన ఆరోపణలు నిజంకాదంటున్నాడు సౌమ్యజిత్. ఉద్దేశపూర్వకంగానే ఇదంతా జరుగుతోందని, ఆ యువతి తనను బ్లాక్‌మెయిల్ చేస్తోందని అన్నాడు. ఏడాది నుంచి ఇదంతా జరుగుతోందని గతంలో చాలా సార్లు తనను డబ్బులు కూడా డిమాండ్ చేసిందని సౌమ్యజిత్ అన్నాడు. ఆమె నాకు స్నేహితురాలని గతంలో ఆయువతి బంధువులకు ఆసుపత్రిలో చికిత్స జరిగితే తాను డబ్బులు కట్టాడని అన్నాడు.

సౌమ్యజిత్‌పై వేటు

ఇక ఈ ఆరోపణలు ఎదుర్కొంటున్న సౌమ్యజిత్‌ను కామన్‌వెల్త్ క్రీడల్లో ఆడకుండా సస్పెన్సన్ వేటు వేయాలని భారత టేబుల్ టెన్నిస్ సమాఖ్య నిర్ణయించింది. ఈ నిర్ణయం కారణంగా వచ్చే నెల మొదటి వారంలో పారంభమ్యే కామన్‌వెల్త్ క్రీడలకు సౌమ్యజిత్ దూరం కావాల్సి ఉంటుంది. ఈ పోటీల కోసం జర్మనీలో శిక్షణ పొందుతున్న సౌమ్యజిత్‌పై తుది నిర్ణయం తీసుకునేందుకు టేబుల్ టెన్నిస్ సంఘం అధికారులు శుక్రవారం సమావేశం కానున్నారు.



షమికి ఊరట

బి గ్రేడ్ కాంట్రాక్ట్ ప్రకటించిన బీసీసీఐ

ఐపీఎల్‌కు రెడీ.. కొనసాగుతున్న జహాన్ ఆరోపణలు

ముంబాయి: భారత స్టార్ బౌలర్ షమికి భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు (బీసీసీఐ) గుడ్‌న్యూస్ చెప్పింది. ఫిక్సింగ్‌కు పాల్పడుతున్నాడంటూ షమిపై అతని భార్య జహాన్ చేసిన ఆరోపణలపై విచారణ జరిపిన అవినీతి నిరోధక విభాగం అత నికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ నివేదిక ఆధారంగా షమికి బీసీసీ ఐ బి –గ్రేడ్ కాంట్రాక్టు ప్రకటించింది. ఈ కాంట్రాక్టు ప్రకారం ఇతర ఆటగాళ్లతో పాటు షమి మూడు కోట్లు అందుకోనున్నా డు. జహాన్ చేసిన ఆరోపణలతో ఇంతకు ముందు ఆటగాళ్లకు ప్రకటించిన కాంట్రాక్టు జాబితాలో షమికి చోటు దక్కలేదు. ఇక వచ్చే నెల్లో ప్రారంభమయ్యే ఐపీఎల్ టోర్నీలోనూ షమి ఆడేం దుకు బీసీసీఐ ఓకె చెప్పింది. దీంతో ఢిల్లీ డేర్ డెవిల్స్ తరపున షమి ఐపీఎల్‌లో బరిలోకి దిగబోతున్నాడు. జహాన్ ఆరోపణలతో బీసీసీఐ అవినీతి నిరోధక విభాగం డైరెక్టర్ నీరజన్‌కుమార్ రంగంలోకి దిగి ఓ రహస్య నివేదికను బోర్డుకు ఇచ్చారు. ఈ నివే దిక ఆధారంగా షమిపై ఇక ఎలాంటి చర్యలు తీసుకోనవసరం లేదని క్రికెట్ బోర్డు స్పష్టం చేసింది. మహ్మద్ భాయ్ అనే వ్యక్తి నుంచి దుబాయిలో పాకిస్తాన్‌కు చెందిన అలిస్బా అనే మహి ళ షమికి డబ్బులు ఇచ్చిందని జహాన్ ఆరోపించింది. అయితే షమి తనను వేధించినట్టు, చాలా మంది మహిళలతో సంబం ధాలున్నాయంటూ హసీన్ చేసిన ఫిర్యాదుపై కోల్‌కతా పోలీసుల విచారణ చేస్తున్నారు. మరోవైపు షమిపై జహాన్ ఆరోపణలు కొనసాగుతున్నాయి. తనకు షమి నుంచి ప్రాణహాని ఉందని, ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో రాజీపడే ప్రసక్తే లేదని జహాన్ చెప్పింది. లండన్‌కు చెందిన మహ్మద్ భాయ్ అనే వ్యాపారి అమ్మాయిలను పరిచయం చేశాడని తాజాగాఆరోపించింది.

తొలి రౌండ్‌లో సెరెనా పరాజయం

మియామి ఓపెన్ టెన్నిస్ టోర్నీ



మియామి : మాజీ వరల్డ్ నంబర్ వన్ సెరెనా విలియమ్స్ మియామీ ఓపెన్ టెన్నిస్ టోర్నీ తొలి రౌండ్‌లోనే పరాజయం పాలైంది. జపాన్‌కు చెందిన నవోమి ఒసాకా 6–3, 6–2 స్కోరుతో సెరెనాను చిత్తు చేసింది. గత వారం ఇండియన్ వెల్స్ టెన్నిస్ టోర్నీలో విజయం సాధించి తొలి టైటిల్‌ను తన ఖాతాలో వేసుకున్న ఒసాకా ఈ మ్యాచ్‌లో సెరెనాను సులువుగా ఓడించింది.

జూనియర్ ప్రపంచకప్ షూటింగ్

వాళరివన్‌కు డబుల్ గోల్డ్



సిడ్నీ: జూనియర్ ప్రపంచకప్ షూటింగ్‌లో భారత్‌కు చెందిన ఎల్వేనియల్ వాళరివన్‌కు స్వర్ణం దక్కింది. మహిళల పది మీటర్ల ఎయిర్ రైఫిల విభాగంలో మొదటి స్థానంలో నిలిచి స్వర్ణం గెలుచుకున్న వాళరివన్ టీమ్ విభాగంలో శ్రేయ అగర్వాల్, జీనా కిత్తాతో కలసి స్వర్ణం సాధించింది. రెండో సారి వరల్డ్ కప్ షూటింగ్ పోటీల్లో పాల్గొంటున్న వలరివన్ 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఈవెంట్‌లో 249.9 పాయింట్లతో మొదటి స్థానంలో నిలిచింది. గతవారం జరిగిన యూనివర్సిటీ షూటింగ్ పోటీల్లోనూ వలరివన్ స్వర్ణం సాధించింది.

చిక్కుల్లో హార్ధిక్ పాండ్య



కేసు పెట్టాలని కోర్టు ఆదేశం

జోధ్‌పూర్: టీమిండియా ఆల్‌రౌండర్ హార్థిక్ పాండ్య చిక్కుల్లో పడ్డాడు. పాండ్యాపై కేసు నమోదు చేయాలని జోధ్‌పూర్‌లోని ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక న్యాయస్థానం పోలీసులను ఆదేశించింది. ఓ సామాజిక వర్గానికి చెందిన ప్రజల మనోభావాలు దెబ్బతీసేలా అతను వ్యాఖ్యానించినందుకుగానూ ఈ ఆదేశాలు జారీచేసింది. గతేడాది డిసెంబరు 26న పాండ్యా 'దేశవ్యాప్తంగా రిజర్వేషన్ల వ్యాధిని వ్యాప్తి చేసింది అంబేద్కర్' అంటూ ట్వీట్ చేశాడు. అప్పట్లో అది వివాదంగా మారింది. దీంతో రాజస్థాన్‌లోని జలోర్ జిల్లాకు చెందిన రాష్ట్రీయ భీమ్ సేనా సభ్యుడు, న్యాయవాది మేఘ్‌వాల్ పాండ్యాపై ఫిర్యాదు చేశారు. పాండ్యా వ్యాఖ్యలు ఓ వర్గపు ప్రజల మనోభావాలు దెబ్బతీసేలా ఉన్నాయని ఆరోపిస్తూ ఆయన స్థానిక న్యాయస్థానాన్ని ఆశ్రయించారు.

అది నకిలీ అకౌంటా...

అయితే ఆ ట్వీట్ వచ్చింది ఓ నకిలీ అకౌంట్ నుంచి అని తేలింది. అంబేద్కర్‌పై వివాదాస్పద ట్వీట్ వచ్చింది.. @hardikpandya7 అకౌంట్ నుంచి. కానీ ఇది హార్థిక్ పాండ్యా అధికారిక అకౌంట్ కాదు. అతనికి ట్విట్టర్ అకౌంట్ @sirhardik 3777తో ఉంది. మేఘవాల్ అనే వ్యక్తి ఫిర్యాదు మేరకు ఓ ఎస్సీ, ఎస్టీ కోర్టు పాండ్యాపై కేసు నమోదు ఆదేశించింది. అయితే దీనిపై అటు పిటిషనర్ గానీ, పాండ్యాగానీ ఇంకా ఏమీ స్పందించలేదు. అంబేద్కర్ ఎవరు.. మన రాజ్యాంగాన్ని రాసిన వ్యక్తేనా లేక రిజర్వేషన్లు అన్న రోగాన్ని మన దేశానికి అంటించిన వ్యక్తా అని ఆ ట్వీట్‌లో పేర్కొన్నాడు.

అది నా కల

స్టార్ బ్యాట్స్‌మన్ దినేశ్ కార్తీక్



చెన్నయ్: ఎప్పటికైనా ఐపీఎల్‌లో చెన్నయ్ సూపర్ కింగ్స్‌కు ఆడాలన్నది తన కల అని భారత స్టార్ బ్యాట్స్‌మన్ దినేశ్ కార్తీక్ చెప్పాడు. శ్రీలంకలో ముగిసిన నిదహాస్ కప్ టి20 సిరీస్ ఫైనల్లో సిక్సర్ కొట్టి భారత్‌ను గెలిపించిన దినేశ్ కార్తీక్ ప్రస్తుతం ఐపీఎల్‌పై ఫోకస్ పెట్టాడు. రెండు సార్లు ఐపీఎల్ చాంపియన్ కోల్‌కతా నైట్‌రైడర్స్‌కు కెప్టెన్‌గా వ్యవహరిస్తున్న కార్తీక్ ఒకటి రెండు రోజుల్లో కోల్‌కతాకు పయన మవుతున్నాడు. జట్టుతో కలసి ప్రాక్టీస్ మొదలుపెటడతాడు. చెన్నయ్ జట్టుకు ఆడాలన్న తన కల నెరవేరటం లేదని పదేళ్ల నుంచి ఆ జట్టుకు ఆడాలని అనుకుంటున్నానని చెప్పాడు. అసలు తాను చెన్నయ్ జట్టుకు ఆడతానో లేదో తెలియదని అన్నాడు. గౌతం గంభీర్ తప్పుకోవడంతో కోల్‌కతా నైట్‌రైడర్స్‌కు దినేశ్ కార్తీక్ సారథ్య బాధ్యతలు చేపట్టాడు. ' చెన్నయ్‌లో పుట్టిపెరిగాను, అందుకే చెన్నయ్ జట్టంటే నాకు ప్రేమ' అని కార్తీక్ చెప్పాడు. ఐపీఎల్‌లో ఓ జట్టుకు సారథ్యం వహించటం గొప్పగా ఉందని, ఆ బాధ్య తను నెరవేరుస్తానని కార్తీక్ అన్నాడు. 2010 నంచి ఐపీఎల్‌లో ఆడుతున్న కార్తీక ఢిల్లీ డేర్‌డెవిల్స్, రాయల్ చాలెంజర్స్, ముం బాయి ఇండియన్స్, కింగ్స్ లెవెన్ పంజాబ్, గుజరాత్ లయిన్స్, నైట్ రైడర్స్ జట్లకు ఆడాడు. ఈ ఏడాది దినేశ్ కార్తీక్ సారథ్యంలోని నైట్‌రైడర్స్ జట్టు తొలి మ్యాచ్‌ను ఏప్రిల్ 8న బెంగళూరు రాయల్ చాలెంజర్స్‌తో ఈడెన్ గార్డెన్స్‌లో ఆడుతుంది.

కామన్‌వెల్త్ గేమ్స్‌లో భారత్ ఖాయంగా పతకం గెలుచుకునే క్రీడాంశాల్లో బ్యాడ్మింటన్ ముఖ్యమైంది. మహిళల విభాగంలో రియో స్టార్ సింధు, సైనా నెహ్వాల్ సంచలనాలకు సిద్ధమవుతుంటే... మెన్స్ విభాగంలో భారత స్టార్ కిదాంబి శ్రీకాంత్ స్వర్ణ పతకంపై ఆశలు రేకెత్తిస్తున్నాడు. 2017లో నాలుగు సూపర్ సిరీస్ టైటిల్స్ గెలుచుకుని ఈ మెగా ఈవెంట్‌లో మిగతా దేశాల ఆటగాళ్లతో సై అంటే సై అంటున్నాడు. శ్రీకాంత్ లక్ష్యం నెరవేరుతుందా.. పతకం సాధిస్తాడా...

కామన్‌వెల్త్ క్రీడలకు భారత బృందం పయనం

ఆల్ ది బెస్ట్

స్వర్ణంపై శ్రీకాంత్ గురి



హైదరాబాద్: భారత బ్యాడ్మింటన్ స్టార్, తెలుగుతేజం కిదాంబి శ్రీకాంత్ ఏప్రిల్‌లో ప్రారంభం కానున్న కామన్‌వెల్త్ గేమ్స్‌లో పతకంపై గురి పెట్టాడు. గత సంవత్సరం 2017లో అద్భుతంగా రాణించిన శ్రీకాంత్ గతవారం ముగిసిన ఆల్ ఇంగ్లండ్ ఓపెన్‌లో ఆకట్టుకోలేక పోయాడు. రెండో రౌండ్‌లోనే చైనాకు చెందిన అన్‌సీడెడ్ హ్యాంగ్ యూజియంగ్ చేతిలో ఓడి పోయాడు. అయితే బ్యాడ్మింటన్‌లో అమల్లెకి వచ్చిన కొత్త నిబంధనలపై అసంతృప్తిని వ్యక్తం చేసిన శ్రీకాంత్ తన పరాజయానికి ఆ నిబంధనలు అడ్డంకిగా మారాయని విమర్శించాడు. అయితే ప్రస్తుతం తాను వాటి నన్నింటిన వదిలేసి ఏప్రిల్ మొదటి వారంలో జరిగే కామన్‌వెల్త్ పోటీలపై దృష్టి పెట్టానని తెలిపాడు. కామన్‌వెల్త్‌లో శ్రీకాంత్ ఒక పతకం కూడా గెలువలేదు. 2014లో జరిగిన కామన్‌వెల్త్ పోటీల్లో మొదటి సారి శ్రీకాంత్ ఆడాడు. అప్పుడు అతని వయస్సు 21 సంవత్సరాలు. పెద్దగా అనుభవం కూడా లేదు. కానీ, ఇప్పుడు తాను ప్రపంచ మేటి ఆటగాళ్లలో ఒక్కడు. కోచ్ పుల్లెల గోపీచంద్ బ్యాడ్మింటన్ అకాడమీలో చేరిన తర్వాత శ్రీకాంత్ ఆటతీరు పూర్తిగా మారిపోయింది. గోపీచంద్ శిక్షణలో భారత టాప్ ఆటళ్లలో ఒకడిగా ఎదిగి వచ్చాడు. ఒకొక్క మెట్టు ఎక్కుతూ ప్రస్తుతం అకాశస్థాయికి చేరుకున్నాడు. 2017 సంవత్సరం శ్రీకాంత్‌కు మరపురాని ఏడాది. అద్భుతమైన ప్రతిభను ప్రదర్శించిన శ్రీకాంత్ పేరు ప్రపంచ బ్యాడ్మింటన్‌లో మారుమోగింది. శ్రీకాంత్ ఏకంగా నాలుగు సూపర్‌సిరీస్ టైటిళ్లు సాధించి చరిత్ర సృష్టించాడు. ఒక క్యాలెండర్ ఇయర్‌లో ఏ భారత ఆటగాడూ ఇన్ని టైటిళ్లు సాధించలేదు. చైనా, కొరియా, జపాన్ దేశాల టాప్ ఆటగాళ్లతో పోటీపడి విజయాలు సాధించాడు. ప్రపంచ చాంపియన్ లీన్ డాన్‌ను సైతం మట్టికరిపించాడు. 2017లో జరిగిన ఇండోనేషియన్ ఓపెన్ ఫైనల్స్‌లో శ్రీకాంత్ వరుసా సెట్లలో జపాన్‌కు చెందిన కజుమస సకయ్‌ను ఓడించి ఈ సంవత్సరపు తొలి టైటిల్ అందుకున్నాడు. తర్వాత జరిగిన ఆస్ట్రేలియా ఓపెన్‌లో ఒలింపిక్ చాంపియన్ చెన్ లాంగ్‌ను ఓడించి రెండో టైటిల్‌ను తన ఖాతాలో వెసుకున్నాడు. తర్వాత డెన్‌మార్క్ ఓపెన్ టైటిల్ గెలుచుకొని ప్రకాశ్ పదుకొనే సరసనా చేరాడు. తర్వాత ఫ్రెంచ్ ఓపెన్ గెలుచుకొని నాలుగో టైటిల్‌తో చరిత్ర సృష్టించాడు. అదే ఏడాది సింగపూర్ ఓపెన్‌లో భారత ప్రత్యర్థి సాయి ప్రణిత్ చేతిలో ఓడి రన్నరప్‌గా నిలిచాడు. ఇక బ్యాడ్మింటన్ వరల్డ్ చాంపియన్‌షిప్‌లో క్వార్టర్ ఫైనల్ వరకు వెళ్లాడు. తర్వాత ఇండియాలో జరిగిన జాతీయ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో రన్నరప్‌గా నిలిచి ఈ ఏడాదిని గొప్పగా ముగించాడు. అద్భుత ఆటతో పురుషుల సింగిల్స్ బిడబ్ల్యూఎఫ్ ర్యాంకింగ్స్‌లో ప్రపంచ రెండవ ర్యాంక్‌ను అందుకున్నాడు. అద్భుత ఆటను కనబర్చిన కిదాంబి శ్రీకాంత్‌కు భారత ప్రభుత్వం పద్మ శ్రీ అవార్డుతో సన్మానించింది. కామన్‌వెల్త్‌కు పూర్తి ఫిట్‌నెస్‌తో సిద్ధంగా ఉన్నాని ఈ పోటీల కోసం కఠోరా సాధన చేస్తున్నట్టు తెలిపాడు. పతకమే లక్ష్యంగా బరిలోకి దిగుతున్నాడు. భారత ఆశలన్ని క్రీదాంబి శ్రీకాంత్‌పై ఉన్నాయి. ఈ టోర్నీలో రాణించి పతకంతో తిరిగి రావాలని బెస్టాఫ్ లక్ చెబుదాం.



బెస్ట్ ఆఫ్ లక్....

కామన్‌వెల్త్ క్రీడల్లో దేశం గర్వపడే రీతిలో పతకాలు గెలుచుకోవాలని భారత క్రీడాకారులకు కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్ ఆకాక్షించారు. ఏప్రిల్ నాలుగు నుంచి ఆస్ట్రేలియాలోని గోల్డ్ కోస్ట్‌లో ప్రారంభం కానున్న 21వ కామన్‌వెల్త్ క్రీడల్లో పాల్గొనే తొలి విడత భారత బృందానికి ఆయన అభినందనలు తెలిపారు. ఢిల్లీ నుంచి బయల్దేరిన భారత అథ్లెట్లకు ఆయన సెండాఫ్ ఇచ్చారు. ఈ పోటీల్లో భారత్ వీలైనన్ని పతకాలు గెలుచుకుని భారత కీర్తిని పెంచాలని కోరారు. 2010లో ఢిల్లీలో జరిగిన కామన్‌వెల్త్ పోటీల్లో భారత్ పతకాల పట్టికలో అగ్రస్థానంలో నిలిచిందని, అయితే ఒలింపిక్స్‌లో భారత ఆటగాళ్లు ఇంకా మెరుగైన ఫలితాలు సాధించాలని రాజ్‌నాథ్ కోరారు. ఈ సారి కామన్‌వెల్త్ క్రీడలకు మొత్తం 222 మంది అథ్లెట్లతో భారత బృందం ఆస్ట్రేలియా బయల్దేరింది.

వీసా కోసం ప్లేయర్ల ఎదురుచూపులు

అధికారుల నిర్లక్ష్యం ఆటగాళ్లకు శాపంగా మారుతోంది. మరో రెండు వారాల్లో ఆస్ట్రేలియాలోని గోల్డ్‌కోస్ట్‌లో కామన్‌వెల్త్ పోటీలు ప్రారంభం కావాల్సి ఉండగా ఇంత వరకూ చాలా మంది ఆటగాళ్లు, కోచ్‌లు, సహాయ కోచ్‌లకు వీసాలు దక్కలేదు. ఏప్రిల్ 4 నుంచి ఆస్ట్రేలియాలోని గోల్డ్‌కోస్ట్‌లో 21వ కామన్‌వెల్త్ క్రీడలు జరగనున్నాయి. దాదాపు 222 మంది ఆటగాళ్లు, 106 మంది అధికారులతో భారత్ ఈ పోటీల్లో బరిలోకి దిగుతోంది. అయితే భారత బృందంలో ఇంత వరకూ షూటింగ్, రెజ్లింగ్ విభాగాలకు చెందిన ప్లేయర్లు, కోచ్‌లు, అసిస్టెంట్ కోచ్‌లకు వీసాలు దక్కలేదు. ఈ పనులన్నీ చక్కదిద్దే భారత ఒలింపిక్ సంఘం ఇంకా 109 మంది ఆటగాళ్లకు వీసా అనుమతివ్వాల్సి ఉందని తెలిపింది. వీసాలు ఇంకా అందని ఆటగాళ్లలో రెజ్లర్లు సుశీల్‌కుమార్, బబితా కుమారి, వినేష్ పోగట్, పూజా దంధా, పురుషుల హాకీ జట్టు ఆటగాడు లలిత్ ఉపాధ్యాయ్, మహిళా హాకీ ప్లేయర్ సవిత, బ్యాడ్మింటన్ ప్లేయర రుత్విక్, అథ్లెట్ తేజిందర్ పాల్ సింగ్‌లు ఉన్నారు. షూటింగ్ విభాగంలోనూ చైన్ సింగ్, జితూ రాయ్, సంజీవ్ రాజ్‌పుత్, గగన్ నారంగ్, దీపక్‌కుమార్, అనిష్ భన్వాలా, నీరజ్‌కుమార్ తదితరులున్నారు. వీరందరికీ ఇంకా క్రీడల మంత్రిత్వ శాఖ ఆమోదం తెలపనందునే వీసాలు కేటాయించలేదని ఒలింపిక్ సంఘం ప్రతినిధి తెలిపారు.

భారత్‌కు ఆసీస్ మరో షాక్

తొలి టి20లోనూ పరాజయం



ముంబై: ఆసీస్ మహిళల జట్టుతో జరిగిన వన్డే సిరీస్‌లో వైట్‌వాష్ అయిన భారత మహిళలకు మరో షాక్ తగిలింది. ముక్కోణపు టీ 20 సిరీస్‌లో భాగంగా ఇక్కడ బ్రాబౌర్న్ స్టేడియంలో ఆస్ట్రేలియా మహిళలతో జరిగిన తొలి టి 20 మ్యాచ్‌లో భారత మహిళా బృందం ఆరు వికెట్ల తేడాతో పరాజయం పాలైంది. భారత మహిళలు నిర్దేశించిన 153 పరుగుల లక్ష్యాన్ని ఆసీస్ 18.1 ఓవర్లలో నాలుగు వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఆసీస్ మహిళల్లో బెత్ మూనీ (32 బంతుల్లో 8 ఫోర్లతో 45), ఎలైస్ విలానీ(39), మెగ్ లాన్నింగ్(35 నాటౌట్)లు రాణించి జట్టుకు విజయాన్ని అందించారు. అంతకుముందు టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన భారత మహిళలు నిర్ణీత ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి 152 పరుగులు చేశారు. స్మృతీ మంధాన(67), అనుజా పా టిల్(35)లు మాత్రమే రాణించారు. మిథాలీ రాజ్ (18), వేదా క ష్ణమూర్తి (15), హర్మన్ ప్రీత్ కౌర్ (13)లు నిరాశపరిచారు.

సంక్షిప్త స్కోర్లు : భారత్ 20 ఓవర్లలో 152/5 (మంధాన 65, అనూజ పాటిల్ 35), ఆస్ట్రేలియా : 18.1 ఓవర్లలో 153/4 బెత్ మూనీ 45, ఎలైస్ విలాని 39, మెక్‌లాన్నింగ్స్ (35నాటౌట్).

తిరువనంతపురంలోనే వన్డే!



త్రివేండ్రం: వెస్టిండీస్‌తో నవంబర్ ఒకటిన జరగాల్సిన వన్డే తిరువనంతపురంలో నిర్వహించేందుకు కేరళ క్రికెట్ సంఘం (కేసీఏ) సూచన ప్రాయంగా ఆమోదం తెలిపింది. మొదట ఈ వన్డేను కొచ్చిలో నిర్వహించాలని కేసీఏ తలపెట్టింది. అయితే అంతరాతీయ ప్రమాణాలు గల కొచ్చి స్టేడియంను వన్డే మ్యాచ్ కోసం ధ్వంసం చేయద్దంటూ ఆందోళనలు మొదటలవడంతో కేసీఏ పునరాలోచనలో పడింది. కేరళ క్రీడల మంత్రి మొయి దీన్‌తో సమావేశం అనంతనం ఈ వన్డే వేదికను తిరువనంతపురంలో నిర్వహిం చాలని నిర్ణయించారు. ప్రభుత్వ సహకా రంతో కొచ్చిలో కొత్త క్రికెట్ స్టేడియం నిర్వహించాలని కేసీఏ తలపెట్టింది.



కివీస్ పెను సంచలనం

ఇంగ్లండ్ 58 ఆలౌట్

ఐదుగురు బ్యాట్స్‌మన్ డకౌట్

ఆక్లాండ్ : ఇంగ్లండ్‌తో ప్రారంభమైన డేఅండ్ నైట్ టెస్టు మ్యాచ్‌లో న్యూజిలాండ్ సంచలనం సృష్టించింది. కివీస్ బౌలర్లు ట్రెంట్ బౌల్ట్, టిమ్ సౌథీ దెబ్బకు ఇంగ్లండ్ 20.4 ఓవర్లలో 58 పరుగులకే కుప్ప కూలింది. టాస్ గెలిచిన న్యూజిలాండ్ బౌలింగ్ ఎంచుకుంది. ఆట ఐదో ఓవర్ నుంచి ఇంగ్లండ్ పతనం మొదలైంది. ఇంగ్లండ్ 6 పరుగుల వద్ద ఓపెనర్ అలెస్టర్ కుక్(5) వికెట్ కోల్పోయింది. తొలి డే అండ్‌నైట్ టెస్ట్ ఆడుతున్న కివీస్ బౌలర్లు బోల్ట్, టిమ్ సౌథీ దెబ్బకు విలవిల్లాడింది. పింక్ బంతితో ఇంగ్లండ్ బ్యాట్స్‌మెన్‌ను బెంబేలెత్తించారు. దీంతో 27 పరుగులకే ఇంగ్లండ్ 9 వికెట్లు కోల్పోయింది. ఈ సమయంలో ఇంగ్లండ్ టెస్టుల్లో అత్యంత తక్కువ స్కోరుకు ఆలౌట్ అవుతుందని అందరూ భావించారు. అయితే టెయిలెండర్ ఓవర్టన్ (33 నాటౌట్) ఒంటరిపోరాంతో అత్యంత చెత్త రికార్డు నుంచి ఇంగ్లండ్‌ను గట్టెక్కించాడు. ఓవర్టన్ పోరాటంతో ఇంగ్లండ్ పదో వికెట్‌కు 31 పరుగులు జతచేయగలిగింది. దీంతో ఇంగ్లండ్ 58 పరుగులకు పరిమితమైంది. ఇంగ్లండ్‌కు టెస్టుల్లో ఇది ఆరో అత్యల్ప స్కోరు. ఇంగ్లండ్ ఇన్నింగ్స్‌లో ఐదుగురు డకౌట్ కావడం గమనార్హం. బోల్ట్ 32 పరుగులిచ్చి ఆరు వికెట్లు నేలకూల్చగా, సౌథీ 25 పరుగులిచ్చి నాలుగు వికెట్లు తీసుకున్నాడు. ఆ తర్వాత మొదటి ఇన్నింగ్స్ ప్రారంభించిన కివీస్ తొలి రోజు ఆట ముగిసే సమయానికి మూడు వికెట్లు నష్టపోయి 175 పరుగులు చేసింది. మొత్తంగా 117 పరుగుల ఆధిక్యంలో ఉంది.

400 క్లబ్‌లో స్టువర్ట్ బ్రాడ్



ఇక ఈ మ్యాచ్‌లో ఇంగ్లండ్ పేస్ బౌలర్ స్టువర్ట్ బ్రాడ్ టెస్టుల్లో 400 వికెట్ల మైలురాయిని చేరుకున్నాడు. ఇంగ్లండ్ తరపున ఈ ఘనత సాధించిన రెండో బౌలర్‌గా రికార్డుల్లోకెక్కాడు. మొత్తంగా 400 వికెట్ల క్లబ్‌లో నిలిచిన పదో ఆటగాడయ్యాడు. 31 ఏళ్ల బ్రాడ్ 115 టెస్ట్‌లో ఈ ఘనత సాధించాడు. ఇంగ్లండ్ తరపున అండర్సన్ ఇంతకు ముందు 525 వికెట్లు పడగొట్టి అగ్రస్థానంలో ఉన్నాడు.

సంక్షిప్త స్కోర్లు : ఇంగ్లండ్ మొదటి ఇన్నింగ్స్ : 20.4 ఓవర్లలో 58 ఆలౌట్ (ఓవర్టన్ 33, స్టోన్‌మన్ 11, బోల్ట్ 4 /32, సౌథీ 4/25, న్యూజిలాండ్ మొదటి ఇన్నింగ్స్ : 175/3.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam publications private limited, Printed at JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, Survey No:127, Plot No:12, Mallapur Village, Nacharam, Medchal District.Telangana state and Published From H.No:6-3-864/4/B, SBN Arcade,4th&5th Floor, Green lands, Opp: Green Park Hotel, Hyderabad - 500016 Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952. Phone No.040-46519999. E-mail Id: editor@manamnews.com.